www.bharathasakthi.com

# భారత శక్తి®

VOICE OF INDIAN

Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal

సంపుటి : 21 | సంచిక : 14 | హైదరాబాద్ | గురువారం,జూన్ 18 , 2026 | పేజీలు : 12 | వెల : 1.00

## గుడిసెలు లేని తెలంగాణే ప్రభుత్వ లక్ష్యం

- రెండో విడత ఇందిరమ్మ ఇండ్లలో గుడిసెల వాసులకే తొలి ప్రాధాన్యత
- యుద్ధప్రాతిపదికన క్షేత్రస్థాయి సర్వే నిర్వహించి అర్హుల ఎంపిక
- రూఫ్ రీప్లేస్‌మెంట్ పథకం కింద రూ.2 లక్షల వరకు ఆర్థిక సాయం
- ప్రతి నియోజకవర్గానికి 500 ఇళ్లు రాష్ట్రవ్యాప్తంగా 50 వేల కుటుంబాలకు లబ్ధి




**హైదరాబాద్ (భారత శక్తి)** రాష్ట్రంలో ఒక్క నిరుపేద కుటుంబం కూడా గుడిసెల్లో జీవించకుండా, ప్రతి కుటుంబం సురక్షితమైన సొంత ఇంటిలో గౌరవప్రదంగా జీవించేలా చేయడమే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార & పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిరు స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి

2లో..

## విద్యార్థి రాహుల్ మృతిపై సర్కార్ నిర్లక్ష్యం

### – మృతదేహం కోసం తల్లిదండ్రుల కన్నీటి దీక్ష!

- కార్పొరేట్ విద్యా సంస్థల వేధింపులపై బీసీ రాజ్యాధికార సమితి ఆగ్రహం; కోటి రూపాయల పరిహారానికి డిమాండ్.
- కార్పొరేట్ విద్యా సంస్థల తీరు మారాలి: అల్లంపల్లి రామకోటి హెచ్చరిక




**హైదరాబాద్: జూన్ 17 భారత శక్తి** కాచిగూడ పరిధిలో అదృశ్యమై, సింగరాయకొండలో ప్రాణాలు కోల్పోయిన విద్యార్థి అంకం రాహుల్ ఉదంతం రాష్ట్రంలో కలకలం రేపుతోంది. కొడుకు మరణించి 20 రోజులు గడుస్తున్నా.. కనీసం ఆ విద్యార్థి భౌతికకాయాన్ని కూడా తల్లిదండ్రులకు అప్పగించకపోవడంపై తీవ్ర నిరసన వ్యక్తమవుతోంది. తమ కళ్లముందే తిరగాల్సిన బిడ్డ శవమై ఎక్కడో పడి ఉంటే, ఆ దేహాన్ని కూడా చూడనివ్వని ప్రభుత్వాల, పోలీసుల నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ బాధితులు కన్నీటి దీక్షకు దిగారు. బాగ్ లింగంపల్లిలోని బీసీ రాజ్యాధికార సమితి కార్యాలయంలో బుధవారం ఈ నిరసన కార్యక్రమం ప్రారంభమైంది. ఈ దీక్షకు బీసీ రాజ్యాధికార సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు దాసు సురేష్ అధ్యక్షత వహించి, ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు.

2లో..

# ఇరాన్‌కు ట్రంప్ అల్టిమేటం

## 'తీరు మారకుంటే బాంబుల వర్షమే!'

- అది కేవలం ప్రాథమిక అవగాహన ఒప్పందం మాత్రమే.. ఫైనల్ కాదు!
- పునర్నిర్మాణ నిధుల వార్తల్లో నిజం లేదు.. ఒక్క పైసా కూడా ఇచ్చేది లేదు!
- అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన వ్యాఖ్యలు.



**వాషింగ్టన్/టెహ్రాన్: జూన్ 17 భారత శక్తి** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌కు మరోసారి తీవ్రస్థాయిలో హెచ్చరికలు జారీ చేశారు. ఇరాన్ వైఖరిలో మార్పు రాకపోతే ఆ దేశంపై మళ్లీ బాంబు దాడులు చేయడానికి వెనుకాడబోమని స్పష్టం చేశారు. ప్రస్తుతం ఇరాన్‌తో తాము జరుపుతున్న చర్చలు, చేసుకోబోయే ఒప్పందాలు కేవలం ప్రాథమిక అవగాహన (అండర్‌స్టాండింగ్) కోసమేనని, అది ఎంతమాత్రం అంతిమ (ఫైనల్) ఒప్పందం కాదని ఆయన తేల్చిచెప్పారు. ఒప్పందంలో పొందుపరిచే అంశాలు తనకు నచ్చకపోయినా, లేదా ఇరాన్ తన దూకుడు స్వభావాన్ని మార్చుకోకపోయినా తీవ్ర పరిణామాలు ఉంటాయని ట్రంప్ హెచ్చరించారు.

### ఆ నిధుల వార్తల్లో నిజం లేదు!

అమెరికా-ఇరాన్ ఒప్పందంలో భాగంగా, ఇరాన్ పునర్నిర్మాణ నిధుల (రికాన్స్ట్రక్షన్ ఫండ్స్) కింద టెహ్రాన్‌కు అమెరికా సుమారు 300 బిలియన్ డాలర్లు సమకూర్చనుందనే వార్తలను అధ్యక్షుడు ట్రంప్ తీవ్రంగా ఖండించారు. ఈ ప్రచారంలో ఎలాంటి నిజం లేదని ఆయన స్పష్టం చేశారు. "ఇరాన్ కోసం మేం ఒక్క పైసా కూడా వెచ్చించడం లేదు. అక్కడ పెట్టుబడులు పెట్టడానికి మా దగ్గర ఎలాంటి ప్రత్యేక నిధులు లేవు" అని ట్రంప్ వ్యాఖ్యానించారు.

2లో..

## తెలంగాణ ఇజ్జత్ తీయడమే సీఎం రేవంత్ పని : కవిత



**గోదావరిఖని (భారత శక్తి)** "బాయిబాట"లో భాగంగా గోదావరిఖని 11 ఇంక్లైన్ కార్మికులతో టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత గేట్ మీటింగ్ జరిపారు. కార్మికులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు.కవిత మాట్లాడుతూ ఈ ముఖ్యమంత్రి తెలంగాణ ఇజ్జత్ తీయటమే పనిగా పెట్టుకున్నాడు. అప్పులు పుడుతలేవంటాడు, మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఫోన్ ఎత్తుత లేదని చెబుతాడు. ముఖ్యమంత్రి స్థాయిలో ఉన్న వ్యక్తి ఇంత బేలగా మాట్లాడతడా? అందుకే మన రాష్ట్రంపై పెత్తనం కోసం పక్క రాష్ట్రం నాయకులు కుట్ర చేస్తున్నారు. సింగరేణిలో కార్మికుల కష్టాలు తెలుసుకునేందుకు వస్తే మమ్మల్ని

2లో..

## తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ను ప్రారంభించిన సీఎం రేవంత్

**రంగారెడ్డి (భారత శక్తి)** మంచాల మండలం ఆరుట్లలో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మించిన తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ను ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ప్రారంభించారు. తెలంగాణలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న దాదాపు 27 లక్షల మంది విద్యార్థి యువతకు ఈ ప్రారంభోత్సవ శుభ సందర్భాన్ని అంకితం చేశారు. తెలంగాణలో మొట్టమొదటి ఈ ఆదర్శ పాఠశాలను ప్రారంభించిన తర్వాత ఆవరణ ఆసాంతం తిరిగి పరిశీలించారు. ఇదే సందర్భంగా పాఠశాలల్లో ఉదయం బ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని ప్రారంభించారు. విద్యార్థినీ విద్యార్థులతో కలిసి అల్పాహారం తీసుకున్నారు. ఆ తర్వాత అత్యాధునిక వసతులతో నిర్మించిన పాఠశాల తరగతి గదులు, లైబ్రరీ, ఫిజిక్స్, బాటనీ, కెమిస్ట్రీ ల్యాబరేటరీల్లో ఏర్పాటు చేసిన సౌకర్యాలను

2లో..






- ర్యాంకుల దాహానికి బలవుతున్న బాల్యం!
- తెలంగాణలో యథేచ్ఛగా సాగుతున్న విద్యా వ్యాపారం
- శాస్త్రీయతకు పాతరేసి.. బట్టీ చదువులతో పిల్లల మెదళ్లపై తీవ్ర ఒత్తిడి
- ఢిల్లీ, కేరళ నమూనాలతో రాష్ట్ర విద్యావ్యవస్థ ప్రక్షాళనకు ఇదే సరైన సమయం..
- విద్యాశాఖ సెక్రటరీ, విద్యాశాఖ మంత్రి సీఎం రేవంత్ రెడ్డి దృష్టి సారించాలి..!

తెలంగాణలో కార్పొరేట్ విద్యాసంస్థల ర్యాంకుల దాహం, ఫీజుల దోపిడీ పతాక స్థాయికి చేరడానికి విద్యాశాఖ అధికారుల అవినీతి, అలసత్వమే ముఖ్య కారణం. క్షేత్రస్థాయి పరిశీలనలు చేయకుండా, ఆటస్థలాలు మరియు కనీస వసతులు లేని ఇరుకు భవనాలకు సైతం భారీ లంచాలకు ఆశపడి అధికారులు యథేచ్ఛగా అనుమతులు (NOCs) మంజూరు చేస్తున్నారు. నిబంధనలను తుంగలో తొక్కి 14 గంటల పాటు విద్యార్థులను బంధిస్తున్నా, ఫీజుల నియంత్రణ చట్టాలను పక్కనబెట్టి లక్షలు వసూలు చేస్తున్నా అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. కార్పొరేట్ యాజమాన్యాలతో చేతులు కలిపి విద్యావ్యవస్థను వ్యాపారమయం చేసిన ఇలాంటి అవినీతి అధికారుల అక్రమాలను ఎండగట్టడం, ఢిల్లీ, కేరళ తరహా నమూనాలతో వ్యవస్థను ప్రక్షాళన చేయడం తక్షణావసరం.

2లో..

**పరిశోధనాత్మక పాత్రికేయులు మీ.. వీ.జీ**

# జీ.హెచ్.ఎం.సీ మలక్‌పేట్ యార్డులో 'డీజిల్' దందా!




పనిచేయని డీజిల్ జనరేటర్ పేరు చెప్పి డీజిల్ దొంగతనం..

- 12 ఏళ్లుగా సాగుతున్న భారీ దోపిడీ!
- విద్యుత్ ఉన్నా జనరేటర్ల పేరిట వేలాది లీటర్ల స్వాహా!
- 'ఫిట్టర్ ఇసాక్' లీలలు.. బంక్ డీలర్లు, అధికారుల కుమ్మక్కుపై విచారణకు డిమాండ్.
- పూర్తి ఆధారాలు పొందుపరిచి అవినీతిపరుల పేర్లు సహా వ్రాసినా.. కమిషనర్ ఆర్వీ కర్ణన్ చర్యలు ఎక్కడ..
- ఫోరం ఫర్ యాంటీ కరప్షన్ అండ్ హ్యూమన్ రైట్స్ అందిస్తున్న పరిశోధనాత్మక కథనం..

**హైదరాబాద్: జూన్ 17 భారత శక్తి** గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (GHMC) మలక్‌పేట్ వాహన నిల్వ కేంద్రం (పార్కింగ్ యార్డ్) అవినీతికి కేరాఫ్ అడ్రస్‌గా మారింది. గత పది, పన్నెండేళ్లుగా ఇక్కడ ఇంధనం (డీజిల్) వినియోగం పేరిట అక్షరాలా ప్రజా ధనం నడిరోడ్డుపై కొల్లగొట్టబడుతోంది. ప్రభుత్వ ఖజానాకు భారీగా గండి కొడుతున్న ఈ ముఠా వెనుక ఉన్న పెద్ద తలకాయలపై సమగ్ర విచారణ జరపాలని పౌర సమాజం గట్టిగా డిమాండ్ చేస్తోంది.

### డీజిల్ దొంగతనం 'ఫిట్టర్ ఇసాక్'దే ప్రధాన పాత్ర!

ఈ ఇంధన దోపిడీ సామ్రాజ్యంలో జనరేటర్ ఆపరేటర్, "ఫిట్టర్ ఇసాక్" పాత్ర అత్యంత కీలకంగా మారినట్లు తెలుస్తోంది.

2లో..

## నీట్ పరీక్ష కోసం టెలిగ్రామ్‌పై వేటు..

### – రాహుల్ గాంధీ తీవ్ర విమర్శలు



**న్యూఢిల్లీ (భారత శక్తి)** నీట్-యూజీ 2026 రీ-ఎగ్జామినేషన్‌ను అత్యంత కట్టుదిట్టంగా నిర్వహించేందుకు కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. పరీక్షల్లో అక్రమాలను, చీటింగ్ నెట్ వర్క్‌లను నిరోధించే చర్యల్లో భాగంగా ప్రముఖ మెసేజింగ్ యాప్ టెలిగ్రామ్‌పై దేశవ్యాప్తంగా తాత్కాలిక ఆంక్షలు విధించింది. జూన్ 21న పరీక్ష జరగనున్న నేపథ్యంలో, జూన్ 22 వరకు ఈ ఆంక్షలు అమల్లో ఉంటాయని స్పష్టం చేసింది. ఇందులో భాగంగా గూగుల్ ప్లే స్టోర్, యాపిల్ యాప్ స్టోర్ల నుంచి టెలిగ్రామ్‌ను తొలగించాలని కేంద్రం ఆదేశాలు జారీ చేసింది. ప్రభుత్వ నిర్ణయంపై ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తీవ్రంగా

2లో..

## సైబర్ నేరగాళ్లు సమాజానికి పరాన్నజీవులు సుప్రీంకోర్టు ఘాటు వ్యాఖ్యలు



**న్యూఢిల్లీ (భారత శక్తి)** సైబర్ నేరగాళ్లు అమాయక ప్రజల సంపదను దోచుకునే 'పరాన్నజీవులు' అని, వారి పట్ల అత్యంత కఠినంగా వ్యవహరించాల్సిన ఆవశ్యకత ఉందని సుప్రీంకోర్టు బుధవారం ఘాటు వ్యాఖ్యలు చేసింది. ఒక సైబర్ మోసం కేసులో నిందితుడికి బెయిల్ మంజూరు చేసేందుకు నిరాకరిస్తూ న్యాయస్థానం ఈ వ్యాఖ్యలు చేసింది.దజస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ వి. మోహనలతో కూడిన ధర్మాసనం ఈ కేసును విచారించింది. తనపై వివిధ రాష్ట్రాల్లో నమోదైన ఎఫ్ఐఆర్‌లను కలిపి విచారించాలని కోరుతూ నిందితుడు దాఖలు చేసిన పిటిషన్‌ను కోర్టు తోసిపుచ్చింది. ఈ అంశంపై సంబంధిత హైకోర్టులను ఆశ్రయించాలని ధర్మాసనం సూచించింది. "మీలాంటి వారు పరాన్నజీవులు. అమాయక మదుపరుల నుంచి సొమ్ము వసూలు చేసి వారిని వంచిస్తున్నారు. సైబర్ నేరగాళ్ల విషయంలో మేము అత్యంత కఠినంగా వ్యవహరించాల్సి ఉంటుంది" అని విచారణ సందర్భంగా జస్టిస్ సూర్యకాంత్ వ్యాఖ్యానించారు. ఈ తరహా నేరగాళ్లు తమిళనాడు నుంచి జమ్మూకశ్మీర్ వరకు దేశవ్యాప్తంగా అమాయకులను లక్ష్యంగా చేసుకుంటున్నారని ధర్మాసనం ఈ సందర్భంగా ఆందోళన వ్యక్తం చేసింది. ఇలాంటి నేరస్థులను జైల్లోనే ఉంచడం సామాజిక ప్రయోజనాలకు శ్రేయస్కరమని ధర్మాసనం పేర్కొంది. దేశంలో "డిజిటల్ అరెస్ట్" వంటి స్కామ్‌లతో సహా ఆన్‌లైన్ మోసాలు పెరిగిపోతున్న నేపథ్యంలో సర్వోన్నత న్యాయస్థానం చేసిన ఈ వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

ఈ మోసాల ధాటికి వృద్ధులు, సామాన్యులు కోట్ల రూపా యలు మేర నష్టపోతున్నారని, అటువంటి వారిని కట్టడి చేసేందుకు కఠినమైన న్యాయ పరమైన వైఖరిఅవసరమని సుప్రీంకోర్టుఅభిప్రాయపడింది.

# విద్యార్థి రాహుల్ మృతిపై సర్కార్ నిర్లక్ష్యం

### కార్పొరేట్ విద్యా సంస్థల తీరు మారాలి: అల్లంపల్లి రామకోటి హెచ్చరిక

ఈ నిరసన కార్యక్రమంలో పాల్గొన్న తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అల్లంపల్లి రామకోటి విద్యా వ్యవస్థలోని లోపాలను తీవ్రంగా తప్పుపట్టారు. రాహుల్ మరణాన్ని ప్రస్తావిస్తూ కార్పొరేట్ సాంకేతిక విద్యా సంస్థల (బి.టెక్ కాలేజీల) యాజమాన్యాలు ఇప్పటికైనా కళ్లు తెరవాలని హితవు పలికారు. విద్యార్థులపై మానసిక ఒత్తిడి, వేధింపులు ఆపి, తక్షణమే తమ ధోరణిని మార్చుకోవాలని డిమాండ్ చేశారు. “విద్యార్థులపై జరుగుతున్న వేధింపుల గురించి ఫిర్యాదు అందిన వెంటనే అధికార యంత్రాంగం స్పందించాలి. నిర్లక్ష్యం వహిస్తే, భవిష్యత్తులో జరిగే ప్రతి ఘాతుకానికి విద్యా సంస్థల యాజమాన్యాలతో పాటు ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుంది.”

### అల్లంపల్లి రామకోటి

బాధిత రాహుల్ కుటుంబానికి తక్షణమే కోటి రూపాయల నష్టపరిహారం చెల్లించాలని, ఈ ఘటనకు కారణమైన దోషులను కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ విషయమై త్వరలోనే రాష్ట్ర పోలీసు విభాగాధిపతిని (డీజీపీ) కలుస్తామని, అవసరమైతే ఉన్నత న్యాయస్థానాన్ని (హైకోర్టు), మానవ హక్కుల కమిషన్‌ను ఆశ్రయిస్తామని స్పష్టం చేశారు.

### ఇది ప్రజాస్వామ్యమా? ధనాస్వామ్యమా?

ఈ సందర్భంగా ప్రజా సంఘాల నాయకులు పాలకుల తీరును ప్రశ్నిస్తూ పలు అంశాలను లేవనెత్తారు:మృతుల పట్ల అగౌరవం: కన్నబిడ్డ మృతదేహాన్ని కూడా తల్లిదండ్రులకు చూపించలేకపోవడం ఈ పరిపాలన వ్యవస్థకే అవమానకరం. ఇది ప్రజాస్వామ్యమా లేక ధనాస్వామ్యమా అని వారు ప్రశ్నించారు.తల్లిదండ్రులకు హెచ్చరిక:రాష్ట్రంలోని పల్లెలు, పట్టణాలలోని విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లల రక్షణ పట్ల అప్రమత్తంగా ఉండాలి. వ్యాపార ధోరణితో నడుస్తున్న విద్యా సంస్థలలో విద్యార్థుల ప్రాణాలకు రక్షణ కరువైందని, ప్రభుత్వాల ఉదాసీనత ఇలాగే కొనసాగితే రేపు మరే కుటుంబానికైనా ఈ దారుణ పరిస్థితి ఎదురుకావచ్చని ఆందోళన వ్యక్తం చేశారు.

### పోరాటం ఆగదు:

బాధితులకు పూర్తి న్యాయం జరిగే వరకు తమ పోరాటం ఆగదని, అవసరమైతే రాష్ట్రవ్యాప్త ఆందోళనలు చేపడతామని నేతలు హెచ్చరించారు.ఈ నిరసన కార్యక్రమంలో వెనుకబడిన, నలిగిపోయిన వర్గాల చైతన్య వేదిక స్థాపకురాలు బోనం ఊర్మిల, బీసీ సంక్షేమ సంఘం ముఖ్య కార్యనిర్వహణాధికారి (సీఈఓ) పోషాల సరస్వతి, టి. జ్యోతి, రాజేష్ తదితరులు పాల్గొని బాధితులకు మద్దతు ప్రకటించారు.



# జీ.హెచ్.ఎం.సీ మలక్‌పేట్ యార్డులో ‘డీజిల్’ దందా!

తానే జనరేటర్ ఇన్‌ఛార్జ్‌నంటూ చెలామణి అవుతున్న ఈ ‘డీజిల్ దొంగ’ వీరన్న.. క్షేత్రస్థాయిలో కరెంట్ ఉన్నా లేకపోయినా నకిలీ లెక్కలు చూపించడంలో సిద్ధహస్తుడు.

నిరంతర విద్యుత్ సరఫరా జరుగుతున్నప్పటికీ, అత్యవసర విద్యుత్ జనరేటర్ల వినియోగం పేరిట ప్రతి నెలా సుమారు 500 లీటర్ల ఇంధన కూపన్లను ఇసాక్ అక్రమంగా క్లెయిమ్ చేస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. క్షేత్రస్థాయిలో జనరేటర్లు అస్సలు నడవకపోయినా.. కాగితాల్లో మాత్రం వేలాది లీటర్ల డీజిల్ కరిగిపోతుండటం వెనుక ఇసాక్ నడిపిన మాయాజాలమే ప్రధాన కారణమని సిబ్బంది కోడై కూస్తున్నారు.

### డ్రైవర్ల చేతిలో పెత్తనం.. నకిలీ షిఫ్టుల మాయాజాలం!

యార్డులో కేవలం వాహన చోదకులుగా (డ్రైవర్లుగా) పనిచేస్తున్న తాహెర్, అబ్దుల్లా అనే ఇద్దరు వ్యక్తులు నిబంధనలకు విరుద్ధంగా అక్కడి పర్యవేక్షకులుగా (కేర్‌టేకర్లుగా) అవతారమెత్తారు. ఇసాక్ లాంటి వారితో జతకలిసి వీరిద్దరే అనాధికారికంగా ఇంధన కూపన్లను జారీ చేస్తున్నట్లు సమాచారం.

నకిలీ రికార్డుల సృష్టి: వాహనాలు అసలు రెండో షిఫ్ట్ (మధ్యాహ్నం), నైట్ షిఫ్ట్ (రాత్రి) సమయాల్లో షెడ్డు దాటి బయటకు రాకపోయినా, ఆ సమయాల్లో కూడా డ్యూటీ చేసినట్లు తప్పుడు రికార్డులు సృష్టిస్తున్నారు.వాహనాల కదలికల పట్టికను ‘మూమెంట్ రిజిస్టర్’ పూర్తిగా తారుమారు చేస్తూ అదనపు ఇంధనాన్ని కాజేస్తున్నారు.

### 10 రోజులు సరఫరా బంద్.. కానీ బిల్లులు మాత్రం ఫుల్!

మలక్‌పేట్ యార్డుకు ఇంధనాన్ని సరఫరా చేసే పెట్రోల్ బంక్ నిర్వాహకులు.. తమకు మున్సిపల్ కార్పొరేషన్ నుండి బిల్లుల చెల్లింపులు రాలేదనే నెపంతో ప్రతి నెలా దాదాపు 10 రోజుల పాటు ఇంధన సరఫరాను పూర్తిగా నిలిపివేస్తున్నారు. ఈ విషయాన్ని స్వయంగా వాహన చోదకులే అంగీకరిస్తున్నారు.

### ఇక్కడే అసలు రహస్యం దాగి ఉంది!

నెలలో 10 రోజుల పాటు ఇంధన సరఫరా నిలిచిపోయినప్పుడు, నెలాఖరులో మాత్రం ఆ పూర్తి నెలకు కేటాయించిన మొత్తం ఇంధన పరిమాణానికి సంబంధించిన బిల్లులు ఎలా పాస్ అవుతున్నాయి? సరఫరా ఆగిపోయిన రోజుల్లో కూడా “ఫిట్టర్ ఇసాక్” మరియు కేర్‌టేకర్ల గ్యాంగ్ డీజిల్ వాడినట్లు ఎలా బిల్లులు పుట్టించారు? ఇంధన సరఫరాదారులు, మున్సిపల్ ఉన్నతాధికారులు కుమ్మక్కై ఈ నకిలీ బిల్లుల దందాకు తెరలేపినట్లు స్పష్టమైన ఆధారాలు కనిపిస్తున్నాయి.

నకిలీ బిల్లుల సృష్టి ద్వారా ప్రజాధనాన్ని లూటీ చేస్తున్న భారీ కుంభకోణంలో ప్రధాన ఇంధన సరఫరా కేంద్రాలు (పెట్రోల్ బంకులు) ప్రస్తుతం నిఘా నీడలోకి వచ్చాయి. ఈ అక్రమాలకు సహకరిస్తున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న వాటిలో ముఖ్యంగా మూడు కేంద్రాల పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. అవి:

1. ఎం. ఏ. రెహమాన్‌లి (భారత్ పెట్రోలియం సరఫరాదారు)
2. డెక్కన్ పెట్రోలియమ్స్‌లి (ఇంధన సరఫరాదారు)
3. ఏ. వై. ఫిల్లింగ్ స్టేషన్‌లి (భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ – BPCL)

ఈ సంస్థలు నకిలీ పత్రాలతో ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతున్నాయనే అంశంపై అధికారులు ముమ్మర విచారణ జరుపుతున్నారు.ఈ మూడు కేంద్రాల ద్వారా గత కొన్నేళ్లుగా జరిగిన ఇంధన సరఫరా, సమర్పించిన బిల్లులు, వాటికి జరిగిన చెల్లింపుల వివరాలపై సిట్టింగ్ జడ్జితో లేదా విజిలెన్స్ విభాగంతో నిశితంగా పరిశీలన చేయించాల్సిన అవసరం ఉంది.

### తక్షణమే ఉన్నత స్థాయి దర్యాప్తు జరగాలి!

గత 12 ఏళ్లుగా సాగుతున్న ఈ ఇంధన చీకటి సామ్రాజ్యాన్ని కూకటివేళ్లతో పెకలించాలంటే ప్రభుత్వం తక్షణమే స్పందించి క్రింది చర్యలు చేపట్టాలని పౌర సమాజం డిమాండ్ చేస్తోంది:

విభాగాల వారీగా విచారణ: ఈ కుంభకోణంపై తక్షణమే అంతర్గత మరియు ఏసీబీ (ఆజదీ) విభాగాల వారీగా ఉన్నత స్థాయి దర్యాప్తు ప్రారంభించాలి.

రికార్డుల లెక్కింపు: గత 12 ఏళ్లుగా జారీ చేసిన ఇంధన కూపన్ల రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించాలి.

**లాగ్‌బుక్స్‌తో సరిపోల్చడం:** వాహనాల కదలికల రిజిస్టర్లను, ఫిట్టర్ ఇసాక్ సమర్పించిన డీజిల్ వినియోగ రికార్డులతో సరిపోల్చి క్షేత్రస్థాయి తనిఖీలు చేయాలి.

**ఆర్థిక ఆడిటింగ్:** సదరు మూడు పెట్రోల్ బంక్ నిర్వాహకులకు సంబంధించిన ఒరిజినల్ బిల్లులు, బ్యాంకు చెల్లింపులపై సమగ్ర ఆడిటింగ్ జరపాలి.

**కఠిన చర్యలు:** ఈ సుదీర్ఘ అవినీతి దందాలో భాగస్వాములైన కింది స్థాయి ఫిట్టర్ ఇసాక్, కేర్‌టేకర్ల నుండి మొదలుకొని వారికి సహకరించిన ఉన్నతాధికారులు మరియు డీలర్లపై కఠినమైన క్రిమినల్ కేసులు నమోదు చేయాలి.పారదర్శకమైన విచారణ ద్వారానే ఈ ‘ఇంధన చీకటి దందా’ వెనుక ఉన్న పెద్ద తలకాయల గుట్టు రట్టవుతుందని, దోచుకున్న ప్రజాధనాన్ని రికవరీ చేయవచ్చని నగరవాసులు అభిప్రాయపడుతున్నారు.



# చదువుల పేరిట ‘కార్పొరేట్’ మారణహోమం..

**హైదరాబాద్, జూన్ 17 ‘భారత శక్తి’** తెలంగాణ రాష్ట్రంలో విద్యావ్యవస్థ ఒక పవిత్రమైన బాధ్యత స్థాయి నుంచి, వందల కోట్ల రూపాయల వ్యాపార సామ్రాజ్యంగా మారిపోయింది. “మా స్కూల్లో చేరితే ఐఐటీ, నీట్ పక్కా” అనే మాయమాటలతో కార్పొరేట్ విద్యాసంస్థలు తల్లిదండ్రుల జీవితకాల పొదుపును నిలువునా దోచుకుంటున్నాయి. ర్యాంకుల కోసం ఉదయం 7 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు నాలుగు గోడల మధ్య ఏసీ గదుల్లో బంధించి పిల్లల బాల్యాన్ని చిదిమేస్తున్నాయి. ఈ కార్పొరేట్ దోపిడీని, దాని వెనుక ఉన్న అశాస్త్రీయతను ఎండగడుతూ, దేశంలోని ఇతర రాష్ట్రాల ఆదర్శ విద్యా విధానాలతో బేరీజు వేస్తూ ‘భారత శక్తి’ అందిస్తున్న ప్రత్యేక పరిశోధనాత్మక కథనం.

### కార్పొరేట్ దోపిడీ - శాస్త్రీయ ఆధారాలు, వాస్తవాలు

మన కార్పొరేట్ స్కూళ్లలో విద్యాబోధన పూర్తిగా అశాస్త్రీయంగా సాగుతోంది. నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ (చీజజు౯), బాలల హక్కుల సంఘాల మార్గదర్శకాలను ఇవి బేఖాతరు చేస్తున్నాయి.

**మెదడుపై ‘కాగ్నిటివ్ ఓవర్‌లోడ్’ :** న్యూరో–సైన్స్ ప్రకారం, ఒక విద్యార్థి మెదడు రోజుకు గరిష్టంగా 5 నుంచి 6 గంటల నూతన సమాచారాన్ని మాత్రమే సమర్థవంతంగా గ్రహించగలదు. కానీ మన దగ్గర 12–14 గంటల పాటు సాగే ఒత్తిడితో కూడిన చదువుల వల్ల మెదడులోని ‘అమిగ్డాలా’ అనే భాగం నిరంతరం భయానికి గురై, పిల్లల్లో సహజ ఆలోచనా శక్తి నశిస్తోంది.

శారీరక, మానసిక రుగ్మతలు: ఆటస్థలాలు లేని ఇరుకు భవనాల్లో రోజంతా కూర్చోబెట్టడం వల్ల విద్యార్థుల్లో విటమిన్–డి లోపం, ఊబకాయం, చిన్న వయసులోనే దృష్టి లోపాలు వస్తున్నాయని వైద్య నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. నిద్రలేమి కారణంగా డిప్రెషన్ బారిన పడుతున్నారు.ం

### ఫీజుల దోపిడీ:

కేవలం కట్టడాల (Infrastructure) పేరుతో, డిజిటల్ క్లాసుల పేరుతో లక్షల్లో ఫీజులు వసూలు చేస్తున్నాయి. లాబొరేటరీల్లో ప్రాక్టికల్స్ కంటే పలకలపై బట్టీ కొట్టించడానికే ప్రాధాన్యత ఇస్తున్నాయి.

### దేశంలోని ఆదర్శ విద్యా నమూనాలు - ఒక తులనాత్మక పరిశీలన




తెలంగాణలో ఉన్నతమైన, ఒత్తిడి లేని విద్యను అందించాలంటే దేశంలోని ఇతర రాష్ట్రాలు అమలు చేస్తున్న ఈ క్రింది శాస్త్రీయ విధానాలను పరిశీలించక తప్పదు.

**1.ఢిల్లీ మోడల్ (మానసిక వికాసానికి పెద్దపీట):** ఢిల్లీ ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశపెట్టిన లి'హ్యాపీనెస్ కరిక్యులమ్' ప్రపంచవ్యాప్త ప్రశంసలు అందుకుంది. ప్రతిరోజూ ఉదయం 45 నిమిషాల పాటు మైండ్‌ఫుల్‌నెస్ (ధ్యానం), నైతిక కథలు వినడం ద్వారా పిల్లల్లో ఒత్తిడిని తగ్గిస్తున్నారు. కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా ప్రభుత్వ స్కూళ్ల మౌలిక సదుపాయాలను తీర్చిదిద్దడం వల్ల, ప్రైవేట్ స్కూళ్ల నుంచి ప్రభుత్వ స్కూళ్ల వైపు వలసలు పెరిగాయి.

**2.కేరళ మోడల్ (సాంకేతికత ం సమానత్వం):** కేరళ ప్రభుత్వం లి'పబ్లిక్ ఎడ్యుకేషన్ రిజువనేషన్ మిషన్'లి ద్వారా 100% ప్రభుత్వ పాఠశాలలను హైటెక్ గా మార్చింది. ఇక్కడ చదువు కేవలం మార్కుల కోసం కాకుండా సామాజిక బాధ్యత, కళలు, క్రీడల కలయికగా ఉంటుంది. ఫీజుల నియంత్రణ పటిష్టంగా ఉండటం వల్ల కార్పొరేట్ దోపిడీకి అక్కడ తావు లేదు.

**3.తమిళనాడు మోడల్ (పోషకాహారం – శారీరక ఆరోగ్యం):** చదువుకోవడానికి ముందు పిల్లల కడుపు నిండాలనే శాస్త్రీయ సత్యంతో ముఖ్యమంత్రి అల్పాహార పథకం' ను ప్రాథమిక పాఠశాలల్లో అమలు చేస్తున్నారు. దీనివల్ల విద్యార్థుల్లో ఏకాగ్రత పెరిగి, డ్రాపౌట్స్ (మధ్యలో బడి మానేసే వారి సంఖ్య) గణనీయంగా తగ్గాయి.

### తెలంగాణకు కావాల్సిన ప్రత్యామ్నాయ ప్రణాళిక

కార్పొరేట్ దోపిడీని అరికట్టి, ఉన్నతమైన విద్యను అందించడానికి రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే శాస్త్రీయమైన చర్యలు చేపట్టాలి:

1.ఫీజుల నియంత్రణ చట్టం: అడ్మిషన్ ఫీజులు, ట్యూషన్ ఫీజులను క్రమబద్ధీకరించడానికి హైకోర్టు సిట్టింగ్ జడ్జి నేతృత్వంలో పటిష్టమైన ‘ఫీజు రెగ్యులేటరీ కమిటీ’ని ఏర్పాటు చేసి, చట్టాన్ని కఠినంగా అమలు చేయాలి.

2.ఆటస్థలాలు తప్పనిసరి: మైదానాలు లేని, గాలి వెలుతురు రాని బహుళ అంతస్తుల భవనాల్లో నడుస్తున్న కార్పొరేట్ పాఠశాలల గుర్తింపును రద్దు చేయాలి.

3.సమయ నియంత్రణ: పాఠశాలల పనివేళలు ఉదయం 8:30 నుంచి సాయంత్రం 4:00 గంటలకు మించకుండా కఠిన నిబంధనలు తీసుకురావాలి.

4.ప్రాక్టికల్ విధానం: బట్టీ పద్ధతికి స్వస్తి పలికి, కాన్సెప్ట్ ఆధారిత విద్యావిధానాన్ని ప్రోత్సహించాలి. ఉపాధ్యాయులకు ఆధునిక చైల్డ్ సైకాలజీపై ఎప్పటికప్పుడు శిక్షణ ఇవ్వాలి.

చదువు అనేది పిల్లల బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలి కానీ, వారి పాలిట ఉరితాడు కాకూడదు. ర్యాంకుల ఫ్యాక్టరీలుగా మారిన కార్పొరేట్ స్కూళ్ల దోపిడీకి అడ్డుకట్ట వేసి, మానవతా విలువలతో కూడిన విద్యావిధానాన్ని తీసుకురావాల్సిన బాధ్యత అటు ప్రభుత్వంపై, ఇటు పిల్లల తలరాతను ర్యాంకులతో కొలుస్తున్న తల్లిదండ్రులపై కూడా ఉంది.

## ఇరాన్‌కు ట్రంప్ అల్టిమేటం

### లిగల్ఫ్ దేశాలకూ సంకేతాలు..

ఇరాన్‌లో పెట్టుబడులు పెట్టాలని తాము గల్ఫ్ దేశాలను కోరడం లేదని, అయితే ఒకవేళ ఆయా దేశాలు సొంతంగా ముందుకు వస్తే తమకు ఎలాంటి అభ్యంతరం లేదని ట్రంప్ పేర్కొన్నారు. కానీ, ఇరాన్ భవిష్యత్తు ధోరణి మరియు విశ్వసనీయతపై పూర్తి అవగాహన వచ్చే వరకు గల్ఫ్ దేశాలు కూడా అక్కడ పెట్టుబడులు పెట్టే సాహసం చేయకపోవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం ఇరాన్ వ్యవహారశైలిపైనే అంతర్జాతీయ సమాజం దృష్టి సారించిందని, అమెరికా ప్రయోజనాలకు భంగం కలిగితే సహించేది లేదని ట్రంప్ మరోసారి స్పష్టం చేశారు.

## తెలంగాణ ఇజ్జత్ తీయడమే సీఎం రేవంత్ పని : కవిత

అడ్డుకుంటున్నారు. కార్మికులకు కనీస అవసరాలు తీర్చకుండా ప్రభుత్వం, ఆఫీసర్లు ఇబ్బంది పెడుతున్నారని అన్నారు.సింగరేణిని కాపాడేందుకు బీజేపీ ఎక్కువ బొగ్గు బ్లాకులు కేటాయించాలి. అండర్ గ్రౌండ్ మైనింగ్ చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలి. కార్మికుల హక్కుల కోసం టీఆర్ఎస్, హెచ్ఎంఎస్ పోరాటం చేస్తుంది. కార్మికులను కలిసేందుకు వస్తే గేట్లు బంద్ పెట్టి అడ్డుకుంటున్నారు. ప్రతిపక్ష పార్టీలను సింగరేణి కార్మికులు కలవద్దా? కార్మికులకు ఏ పార్టీ వారితోనైనా మాట్లాడే హక్కు ఉంది. కానీ సింగరేణి యాజమాన్యం పోలీసులను తీసుకొచ్చి మమ్మల్ని అడ్డుకుంటున్నారని అన్నారు.అసలు సింగరేణి క్యాంపస్ లోకి పోలీసులే రావద్దు. కానీ వాళ్లను తీసుకొచ్చారంటే వీళ్లు ఎంత తప్పు చేసి ఉంటారు? ఇదే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, భట్టి, రాహుల్ గాంధీ కూడా ఎన్నికలకు ముందు సింగరేణి కార్మికులతో మీటింగ్ లు పెట్టలేదా? మీ మాటలు నమ్మి కోల్ బెల్ట్ ప్రాంతంలో కాంగ్రెస్ ను గెలిపించారు. కానీ మీరు గెలిచాక గ్లౌజ్ లు, షూస్, మెషీన్లు ఏదీ నాణ్యత లేకుండా అయిపోయింది. గనుల్లో కి వెళ్లే కార్మికులకు కనీసం ఆక్సిజన్ కూడా ఇవ్వలేని పరిస్థితి తీసుకొచ్చారు. ఏమైనా అడిగితే గత ప్రభుత్వం మీద నెట్టేసి డబ్బులు లేవు అంటున్నారు. సింగరేణి కార్మికులకు మాట ఇచ్చే ముందు ఇవ్వన్నీ మీకు తెలియవా? కనీసం నీళ్లు, గాలి ఇచ్చే సోయి కూడా లేదు. ప్రాథమిక సౌకర్యాలు కూడా ఇవ్వటం లేదు. సింగరేణిలో రాజకీయ జోక్యం ఎక్కువ కావటంతోనే చిన్న చిన్న సౌకర్యాలు కూడా ఇచ్చే పరిస్థితి లేకుండా పోయింది. వీటన్నింటినీ ప్రశ్నించాల్సిన అవసరం ఉంది. నాది ప్రశ్నించే తత్వం. నేను 20 ఏళ్లుగా సింగరేణి కార్మికులతో కలిసి పనిచేస్తున్నా. తెలంగాణ ఉద్యమంలో అగ్గిరాజేసి రాష్ట్రం సాధించుకున్నాం. బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చాక కూడా కేసీఆర్ తో మాట్లాడి మీ కోసం పనిచేశా. ముఖ్యంగా డిపెండెంట్ ఉద్యోగాల కోసం నేను చేసిన పోరాటంతో 19 వేల ఉద్యోగాలు నడుచుకుంటూ వచ్చాయి. మహిళలకు సింగరేణిలో ఉద్యోగాలు వచ్చేలా చేశాం. నేను ఎప్పటికీ సింగరేణి బిడ్డనే. ఎక్కడున్న కార్మికుల కోసమే కొట్లాడుతా. సింగరేణి కార్మికులను ఆఫీసర్లు ఇబ్బంది పెడుతుండటం చాలా బాధాకరం. ఆఫీసర్లకే తమ హక్కులు కాపాడుకునేందుకు యూనియన్లు ఉన్నాయి. అలాంటిది కార్మికులకు తమ హక్కులు కాపాడుకోవటానికి యూనియన్లు ఉండొద్దా? కార్మికులను ఇబ్బంది పెట్టవద్దని...చిన్న వాటికే మెమో లు అంటూ పరేషాన్ చేయవద్దని రిక్వెస్ట్ చేస్తున్నా. వన్ విజన్ అన్నట్లుగా ఉండాలి. కానీ ఇక్కడ రెండు విజన్లు అన్నట్లుగా పనిచేస్తున్నారు. మీ కారణంగా మైన్ లో కార్మికులు సంతోషంగా లేరు. ఆఫీసర్లు మానవీయకోణంలో ఆలోచించాలి. డిజీల్ కుంభకోణంలో పైన ఉన్న పెద్దవాళ్లు చిన్న ఆఫీసర్లను ఇబ్బంది పెడితే రియాజ్ గారు నేనే వాళ్ల హక్కుల కోసం పోరాటం చేశాం. కార్మికుల హక్కులు, వారికిచ్చే సౌకర్యాలు, భద్రత కోసం ఆఫీసర్లే తమ పై అధికారులతో కొట్లాడాలి. ఈ కాంగ్రెస్ పార్టీ వాళ్లు మనల్ని రానివ్వొద్దని ప్రయత్నం చేస్తున్నారు. కానీ తల్లి కాంగ్రెస్ తోనే పోరాటం చేసి...తెలంగాణను సాధించుకున్నాం. ఇప్పుడున్న ఈ పిల్ల కాంగ్రెస్ ఎంత? ఈ ముఖ్యమంత్రి తెలంగాణ ఇజ్జత్ తీయటమే పనిగా పెట్టుకున్నాడు. ఢిల్లీకి అప్పు కోసం పోతే చెప్పులు ఎత్తుకుపోయే వాళ్లను చూసినట్లు చూస్తున్నారని అంటాడు. మహారాష్ట్ర ముఖ్యమంత్రి తన ఫోన్ ఎత్తటం లేదని చెబుతాడు. మొన్నటికీ మొన్న నేను హిట్లర్ లాంటి వాడినంటూ గొప్పగా చెప్పుకుంటున్నాడు. అసలు ఒక ముఖ్యమంత్రి స్థాయిలో ఉన్న వ్యక్తి ఇంత బేలగా మాట్లాడుతాడా? ఆయన బేలా మాటల కారణంగానే ఆంధ్రాలో ఉండే నాయకులు మనపై పెత్తనం చెలాయించేందుకు మళ్లీ కుట్రలు చేస్తున్నారు.

## తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ను ప్రారంభించిన సీఎం రేవంత్

క్షుణ్ణంగా పరిశీలించారు. సైన్స్ ల్యాబరేటరీలో వివిధ పరికరాలను చూశారు. విద్యార్థులకు ఉచిత రవాణా సౌకర్యాల కోసం ఏర్పాటు చేసిన బస్సులను పరిశీలించారు. నృత్యం, సంగీతం బోధించే తరగతి గదులు, డిజిటల్ క్లాసులను సందర్శించారు. వంట గదిని పరిశీలించారు. వంటవారితో మాట్లాడుతూ ముఖ్యమంత్రి గారు పూరీ తయారీలో సహకరించారు. ఆవరణలో విద్యార్థులతో ముచ్చటించారు. అధ్యాపకుల కార్యాలయం సందర్శించారు. పాఠశాల మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులతో మాట్లాడి పలు విషయాలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాల ఆవరణలో అత్యున్నత వసతులతో తీర్చిదిద్దిన వాలీబాల్, క్రికెట్, ఫుట్‌బాల్, కబడ్డీ వంటి క్రీడాస్థలాలు, టెన్నిస్, క్యారమ్స్ హాళ్లను, ఆవరణలోని పార్కులను పరిశీలించారు. విద్యార్థులతో కలిసి కొద్దిసేపు సరదాగా ఫుట్‌బాల్ ఆడారు. అత్యంత అహ్లాదకరమైన వాతావరణంలో సాగిన ఈ కార్యక్రమంలో విద్యార్థినీ విద్యార్థులు ముఖ్యమంత్రి కి ఘన స్వాగతం పలికారు. పాఠశాల ఆవరణలో మొక్కను నాటారు. చాలా మంది విద్యార్థులతో కరచాలనం చేస్తూ ముఖ్యమంత్రి వారిని ఆశీర్వదించారు. ప్రీ–ప్రైమరీ నుంచి ఇంటర్మీడియట్ వరకు సౌకర్యాలు కల్పించారు. అంతర్జాతీ య స్థాయిలో ఏర్పాటు చేసిన ఈ పాఠశాలలో ఇంగ్లీషులో బోధిస్తారు.ఈ కార్యక్రమంలో ముఖ్య మంత్రి తో పాటు మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ఎంపీలు వేం నరేందర్ రెడ్డి , రఘువీర్ రెడ్డి , సల హాదారులు కె. కేశవ రావు, శాసన మండలి చీఫ్‌విప్ పట్నం మహేందర్ రెడ్డి తో పాటు ఇతర ప్రజాప్రతినిధులు, విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి తో పాటు ఇతర సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

## నీట్ పరీక్ష కోసం టెలిగ్రామ్‌పై వేటు..

స్పందించారు. “దొంగను పట్టుకోవడం చేతకాక, బాధితుడి ఇంటికి తాళం వేసినట్లుంది” అంటూ ‘ఎక్స్’ వేదికగా విమర్శలు గుప్పించారు. పేపర్ లీకేజీలను అరికట్టేందుకు మోదీ ప్రభుత్వం ఇదొక కొత్త ఉపాయాన్ని కనిపెట్టిందని ఆయన ఎద్దేవా చేశారు. అసలైన పేపర్ లీక్ మాఫియాను విడిచిపెట్టి, విద్యార్థులను ఇబ్బందులకు గురిచేయడం సరికాదని అభిప్రాయపడ్డారు. లక్షలాది మంది విద్యార్థులు తమ నోట్స్, టెస్ట్ సిరీస్‌ల కోసం టెలిగ్రామ్‌పైనే ఆధారపడతారని ఆయన ఈ సందర్భంగా గుర్తుచేశారు. అయితే, కేంద్రం తీసుకున్న ఈ నిర్ణయాన్ని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) సమర్థించుకుంది. వ్యవస్థీకృత చీటింగ్ ముఠాలు రీ–టెస్ట్‌లో మోసాలకు ఎటువంటి అక్రమాలకు పాల్పడకుండా నిరోధించేందుకే ఈ చర్యలు తీసుకున్నట్లు వెల్లడించింది. పరీక్ష పత్రాల భద్రతను పర్యవేక్షించేందుకు భారత వైమానిక దళం (ఐఏఎఫ్) సహాయాన్ని కూడా తీసుకుంటున్నట్లు ప్రభుత్వం పేర్కొంది. టెలిగ్రామ్ నిషేధంపై ఆ సంస్థ సీఈఓ పావెల్ డ్యూరోవ్ అసంతృప్తి వ్యక్తం చేశారు. కొందరు వ్యక్తులు చేసే తప్పులకు భారత్‌లోని 15 కోట్ల మంది వినియోగదారులను శిక్షించడం భావ్యం కాదని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం యాప్ స్టోర్ల నుంచి టెలిగ్రామ్‌ను తొలగించినప్పటికీ, ఇప్పటికే మొబైల్స్‌లో యాప్ ఉన్నవారు వీపీఎన్ సాయంతో దీనిని యాక్సెస్ చేస్తున్నారు. గత మే నెలలో జరిగిన నీట్–యూజీ పరీక్ష పత్రం లీకైనట్లు వచ్చిన ఆరోపణలతో పరీక్ష రద్దయిన సంగతి తెలిసిందే. ఈ వ్యవహారంపై ప్రస్తుతం సీబీఐ విచారణ కొనసాగుతోంది. ఈ నేపథ్యంలోనే రీ–ఎగ్జామ్‌ను పారదర్శకంగా నిర్వహించేందుకు ప్రభుత్వం కఠిన చర్యలు చేపట్టింది. కాగా, ఈ తాత్కాలిక నిషేధంపై ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ సహా పలువురు విపక్ష నేతలు కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీస్తున్నారు.

## గుడిసెలు లేని తెలంగాణే ప్రభుత్వ లక్ష్యం

రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణను గుడిసెలు లేని రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతోందన్నారు.బుధవారం హౌసింగ్ శాఖ అధికారులతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్ లో ఇందిరమ్మ ఇండ్ల రెండో విడత అమలు, గుడిసెల గుర్తింపు, రూఫ్ రీప్లేస్‌మెంట్ పథకం, అసంపూర్తి గృహాల వివరాల సేకరణ తదితర అంశాలపై మంత్రి గారు అధికారులకు పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. రెండో విడత ఇందిరమ్మ ఇండ్ల మంజూరులో గుడిసెల్లో నివసిస్తున్న నిరుపేద కుటుంబాలకే మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు. గుడిసెల్లో నివసిస్తున్న అర్హులందరికీ ఇళ్లు మంజూరు చేసిన తర్వాతే ఇతర దరఖాస్తులను పరిగణనలోకి తీసుకోవాలని పేర్కొన్నారు.గుడిసెల గుర్తింపునకు ప్రత్యేక సర్వే:రాష్ట్రంలోని ప్రతి గ్రామం, వార్డు, మున్సిపాలిటీ పరిధిలో ఉన్న గుడిసెలను యుద్ధప్రాతిపదికన గుర్తించేందుకు సమగ్ర సర్వే చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ వద్ద ఇప్పటికే ఉన్న సమాచారాన్ని క్షేత్రస్థాయిలో ధృవీకరించి, వాస్తవ పరిస్థితులను పరిశీలించి అర్హుల జాబితాను సిద్ధం చేయాలని సూచించారు. ప్రజాపాలన కార్యక్రమంలో రాష్ట్రవ్యాప్తంగా సుమారు 75 వేల మంది తాము గుడిసెల్లో నివసిస్తున్నామని దరఖాస్తు చేసుకున్నారని, ఆ దరఖాస్తులన్నింటినీ ప్రత్యక్షంగా పరిశీలించి నిజమైన అర్హులను గుర్తించాలని ఆదేశించారు. ఎంపీడీవో స్థాయిలో జాబితాలను సిద్ధం చేసి సంబంధిత ఇన్‌చార్జి మంత్రుల ఆమోదానికి పంపించాలని సూచించారు.గుడిసెల్లో నివసిస్తూ గతంలో ప్రజాపాలన లేదా ఇతర కార్యక్రమాల్లో దరఖాస్తు చేసుకోని నిరుపేద కుటుంబాలు ఇప్పుడు కూడా స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవచ్చని మంత్రి గారు తెలిపారు. అటువంటి దరఖాస్తులను కూడా క్షేత్రస్థాయిలో పరిశీలించి అర్హులైన వారికి అవకాశం కల్పించనున్నట్లు వెల్లడించారు.రెండో విడతలో 2.50 లక్షల ఇళ్లు: రెండో విడతలో రాష్ట్రవ్యాప్తంగా 2.50 లక్షల ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో క్షేత్రస్థాయిలో అన్ని ఏర్పాట్లు వేగవంతం చేయాలని మంత్రి గారు సూచించారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి 2,000 ఇళ్ల చొప్పున మంజూరు చేసిన నేపథ్యంలో అర్హుల ఎంపికను పూర్తిస్థాయి పారదర్శకతతో నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.రూఫ్ రీప్లేస్‌మెంట్ పథకానికి ప్రత్యేక ప్రాధాన్యత:పేదల నివాస భద్రతను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం రూఫ్ రీప్లేస్‌మెంట్ పథకాన్ని అమలు చేస్తున్నామని మంత్రి తెలిపారు.

# సంపాదకీయం

భారత్ శక్తి
VOICE OF INDIAN

## మళ్లీ తెరపైకి డిలిమిటేషన్

జనాభా ఆధారిత డీలిమిటేషన్ ఫార్ములాను ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, కేరళ వంటి దక్షిణాది రాష్ట్రాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. జనాభా నియంత్రణను పక్కాగా అమలు చేసి, దేశ ఆర్థిక వృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నందుకు తమకు సీట్లను తగ్గించి శిక్షిస్తారా? అని చంద్రబాబు నాయుడు, స్టాలిన్ వంటి నేతలు ఇప్పటికే బహిరంగంగానే ప్రశ్నించారు. ఒకవేళ కేంద్రం 50 శాతం పెంపు ఫార్ములాను మొండిగా ముందుకు తీసుకెళ్తే దక్షిణాది పార్టీలు ఖచ్చితంగా వ్యతిరేకిస్తాయి. అయితే, ఒకవేళ ప్రధాని ఆర్థిక సలహా మండలి ప్రతిపాదించిన 'టార్గెటెడ్ అండ్ వెయిటెడ్' పద్ధతిని ప్రవేశపెట్టి.. జనాభా నియంత్రించిన రాష్ట్రాలకు ప్రత్యేక వెయిటేజీ ఇస్తే మాత్రం దక్షిణాది పార్టీలు ఆ ఫార్ములాకు ఓటేసే అవకాశం ఉందని భావిస్తున్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లు చట్టంగా మారినప్పటికీ, అది అమలు కావాలంటే డీలిమిటేషన్ ప్రక్రియ పూర్తి కావడం సాంకేతికంగా అత్యంత కీలకం. ఉత్తరాదిలోని ఎస్పీ, ఆర్జేడీ వంటి పార్టీలు కోటాలో కోటా ఓబీసీ మహిళలకు ప్రత్యేక రిజర్వేషన్ డిమాండ్ చేస్తున్నాయి. 2029 లోక్‌సభ ఎన్నికలకు ముందే డీలిమిటేషన్ బిల్లు, ఒక దేశం, ఒక ఎన్నిక బిల్లు రెండింటికీ పార్లమెంటరీ ఆమోదం పొందాలని ప్రభుత్వం ఆసక్తిగా ఉన్నట్లు తెలుస్తున్నది. డీలిమిటేషన్ బిల్లును ఆమోదింపచేయడానికి ప్రభుత్వం గతంలో చేసిన ప్రయత్నానికి పార్లమెంట్‌లో అవసరమైన మద్దతు లభించకపోవడంతో ఈ అంశం మళ్లీ వెలుగులోకి వచ్చింది.అయితే, పార్లమెంట్‌లో ఎన్డీఏ బలం పెరుగుతున్న తరుణంలో, మహిళా ఓటర్ల మద్దతును పూర్తిగా స్వంతం చేసుకోవడానికి కేంద్రం ఈ రెండు బిల్లులను ఒకేసారి ముడిపెట్టి ఆమోదించే వ్యూహంతో ముందుకు వెళ్తోందిరాబోయే రోజుల్లో డీలిమిటేషన్ చర్చ కేవలం సీట్ల సంఖ్యకు పరిమితం కాకుండా.. భారతదేశ సమాఖ్య స్ఫూర్తి కి ఒక పెద్ద పరీక్షగా మారబోతోంది. మోదీ ప్రభుత్వం పార్లమెంట్‌లో లభించిన 2/3 వంతు మెజార్టీతో ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకుంటుందా, లేదా దక్షిణాది రాష్ట్రాల ఆందోళనలను పరిగణనలోకి తీసుకుని ఆర్థిక సలహా మండలి సూచించిన సమతుల్య ఫార్ములా వైపు మొగ్గు చూపుతుందా అనేది తేలాల్సి ఉంద దేశవ్యాప్తంగా నియోజకవర్గాల పునర్విభజన , మహిళా రిజర్వేషన్ బిల్లు అమలుపై రాజకీయ సమీకరణాలు అత్యంత వేగంగా మారుతున్నాయి. గతంలో ఎన్డీఏ కూటమికి పార్లమెంట్‌లో మూడింట రెండు వంతుల మెజార్టీ లేకపోవడం వల్ల ఈ రాజ్యాంగ సవరణల ప్రక్రియ సాధ్యం కాదనే చర్చ నడిచింది. అయితే, లోక్‌సభలో అనూహ్యంగా తృణమూల్ కాంగ్రెస్ కి చెందిన సుమారు 20 మంది ఎంపీలు ప్రభుత్వానికి మద్దతుగా నిలవడం, ఇండీ కూటమిలోని సమాజ్‌వాదీ పార్టీ వంటి కొన్ని ప్రాంతీయ పార్టీలు కూడా మహిళా రిజర్వేషన్ల క్రెడిట్ కోసం సానుకూల సంకేతాలు ఇస్తుండటంతో మోదీ-షా ద్వయానికి అవసరమైన సంఖ్యాబలం సమకూరుతున్నట్లు స్పష్టమవుతోంది. అసలు డీలిమిటేషన్ ఏ ప్రాతిపదికన జరగబోతోంది? దక్షిణాది రాష్ట్రాల భవిష్యత్తు ఏంటి? ఈ ఫార్ములా ప్రకారం.. ప్రస్తుతం ఉన్న లోక్‌సభ సీట్ల సంఖ్యను నేరుగా దాదాపు 50 శాతం పెంచుతారు. కొత్త పార్లమెంట్ భవనాన్ని కూడా ఇదే సంఖ్యాబలానికి అనుగుణంగా నిర్మించారు. కేవలం జనాభా ప్రాతిపదికన సీట్లను పెంచితే, జనాభా నియంత్రణ పాటించని ఉత్తరాది రాష్ట్రాలకు భారీగా సీట్లు పెరుగుతాయి. ఇటీవల పలు రాష్ట్రాల్లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల అనంతరం రాజకీయ సమీకరణాలు గణనీయంగా మారిపోయాయి. తమిళనాడు ఎన్నికల ఫలితాల తర్వాత కాంగ్రెస్-డీఎంకే కూటమి విచ్ఛిన్నమైందన్న వార్తలు చర్చనీయాంశంగా ఉన్న కీలక పరిణామాల్లో ఒకటి. బిల్లుకు విస్తృత మద్దతు కూడగట్టే ప్రయత్నంలో భాగంగా ప్రభుత్వం డీఎంకేను సంప్రదించే ప్రయత్నాలను ప్రారంభించినట్లు ఆ వర్గాలు వెల్లడించాయి. అదే సమయంలో తృణమూల్ కాంగ్రెస్‌లోని పరిణామాలను కూడా నిశితంగా గమనిస్తున్నారు.

ఒకవేళ గణనీయ సంఖ్యలో ఎంపీలు టీఎంసీ నుంచి విడిపోతే అది పార్లమెంటరీ సమీకరణాలను మార్చివేసి బిల్లు ఆమోదానికి అవసరమైన మద్దతును కూడగట్టడంలో ప్రభుత్వానికి సులభతరం చేస్తుందని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు.పోయినసారి డీలిమిటేషన్ బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టినపుడు దాని ఆమోదం పొందేందుకు ప్రభుత్వానికి మూడింట రెండు వంతుల మెజారిటీ అవసరమైంది.

అంటే బిల్లుకు అనుకూలంగా కనీసం 362 ఓట్లు అవసరం. అయితే బిల్లుకు 298 మంది సభ్యుల మద్దతు మాత్రమే లభించింది. బిల్లుకు వ్యతిరేకంగా 230 మంది ఎంపీలు ఓటు వేశారు. ఫలితంగా బిల్లుకు అవసరమైన సంఖ్యాబలం దక్కక సభలో వీగిపోయింది.జనాభా ప్రాతిపదికన మాత్రమే సీట్లు పెంచితే దేశ సమగ్రతకు, సమాఖ్య స్ఫూర్తికి నష్టం వాటిల్లుతుందని ప్రధానమంత్రి ఆర్థిక సలహా మండలి ఒక ప్రత్యామ్నాయాన్ని సూచించింది. కేవలం జనాభాయే కాకుండా.. భౌగోళిక విస్తీర్ణం, ఆర్థిక వృద్ధి, అక్షరాస్యత వంటి వివిధ సూచీలను పరిగణనలోకి తీసుకుని 'టార్గెటెడ్ నియోజకవర్గాల విభజన' చేయాలని ప్రతిపాదించింది. దీనివల్ల ఉత్తరాదికి సీట్లు పెరిగినప్పటికీ, దక్షిణాది రాష్ట్రాలు మరీ ఘోరంగా నష్టపోకుండా ఒక సమతుల్యత సాధ్యమవుతుంది.

# కాలుస్తున్న సిగరెట్... కరుగుతున్న ఆయుష్షు

- -టీ కొట్టు ముచ్చట్లు.. సిగరెట్ సెగలు
- - ఫ్యాషన్ ,స్టైల్ , రిలాక్సేషన్ సరదా పేరిట అలవాటు
- - ఆర్యోగంతో ఆటలాడుతున్న యువత
- ఈ- సిగరేట్ కు ఆకర్షణ....
- - సాధారణ సిగరేట్ల కంటే ఈ- సిగరేట్లు తక్కువ



హానికరం అనే అపోహతో కొంతమంది వీటికి ఆకర్షితులవుతున్నారు. యువత వీటిని ఓ ఫ్యాషన్ సింబల్ "గా భావిస్తుండటం, వీటి ధర సైతం తక్కువగా ఉండ టంతో వీటికి తొందరగా బానిసలవుతున్నారు. గతంలో అప్పుడప్పుడు మాత్రమే సిగరేట్ కాల్చే యువత, ఇప్పుడు రోజువారీ అలవాటుగా మార్చుకుంటున్నారని వైద్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. స్నేహితుల ప్రభావం, సినిమాల్లో ధూమపాన దృశ్యాలు, ఫ్యాషన్ గా భావించడం వంటి అంశాలు కూడా ధూమపానం పెరగ డానికి కారణమవుతున్నాయని నిపుణులు పేర్కొంటున్నారు.

మంచిర్యాల ప్రతినిధి జూన్ 17(భారతశక్తి):'స్మోకింగ్ ఈజ్ ఇన్జ్యూరియస్ టు హెల్త్' అనే విషయం అందరికీ తెలిసినా.. నేడు కొత్తతరం యువత ఈ ఊబిలో పడిపోతున్నారు. వేసవి సెలవుల వేళ.. స్నేహితులతో సరదాగా గడిపే సమయం కాస్తా ఇప్పుడు వ్యసనాలకు అడ్డాగా మారుతోంది. జిల్లావ్యాప్తంగా, గల్లి గల్లిన పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న కేఫ్ లు,టీ స్టాల్స్ యువతను ధూమ పానానికి అలవాటు చేస్తున్నాయి. ప్రధాన కూడళ్లు ,,విద్యాసంస్థల పరిసరాలు, పట్టణాలు, గ్రామాల్లోనూ చిన్నా పెద్దా టీ స్టాల్స్ పెరుగుతుండటంతో యువతకు ఇవి ప్రధాన మీటింగ్ స్పాట్లు మారాయి. ముఖ్యంగా వేసవి సెలవుల నేపథ్యంలో విద్యార్థులు ఎక్కువ సమయం బయట గడుపుతున్నారు. దీంతో టీ స్టాల్స్, కేఫ్ వద్ద గుంపుగా చేరి ధూమపానం చేయడం గణనీయంగా పెరిగింది. ఉదయం నుంచి అర్ధరాత్రి వరకు అనేక కేఫ్ లు, టీ స్టాల్స్ వద్ద సిగరేట్లు కాలుస్తూ కనిపిస్తున్నారు. కొట్పా చట్టం ప్రకారం మైనర్లకు, విద్యాసంస్థలకు 100 గజాల పరిధిలో పొగాకు విక్రయాలు నిషేధం. విక్రయకేంద్రాల వద్ద 18ఏళ్ల లోపు వారికి పొగాకు ఉత్పత్తుల అమ్మకం నిషేధం అని హెచ్చరిక బోర్డు లు ఏర్పాటు చేయాలి. కాగా, క్షేత్రస్థాయిలో ఎక్కడా అమలుకావడం లేదు. పైగా ప్రతీ టీస్టాల్, కేఫ్ వద్ద తెరలు కట్టి స్మోకింగ్ జోన్లు ఏర్పాటు చేస్తున్నారు.వాటిలో కళాశాల విద్యార్థులు, యువకులు ఎక్కువగా సిగరేట్లకు బానిసవుతున్నట్లు స్థానికులు చెబుతున్నారు.

### సినిమాలు, వేసవి సెలవుల ప్రభావం ..

వేసవి సెలవుల సమయంలో విద్యార్థులకు చదువు ఒత్తిడి లేకపోవడం, పాఠశాలలు, కళాశాలలు మూతపడటంతో ఎక్కువగా స్నేహితులతో గడిపే పరిస్థితి ఏర్పడుతోంది.ఈ నేపథ్యంలో టీ స్టాల్స్, కేఫ్ లు ప్రధాన అడ్డాలుగా మారుతున్నాయి. కొందరు రోజులో పలుమార్లు ఈ ప్రాంతాలకు వెళ్లి గంటల తరబడి గడుపుతుండగా, ధూమపానం చేసే వారి సంఖ్య కూడా పెరుగుతోందని స్థానికులు పేర్కొంటున్నారు.

### ఆరోగ్యంతో చెలగాటం..

ధూమపానం వల్ల ఊపిరితిత్తుల వ్యాధులు,గుండె సంబంధిత సమస్యలు,శ్వాసకోశ ఇబ్బందులు,క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. చిన్న వయస్సులోనే సిగరేట్ అలవాటు చేసుకున్న వారిలో ఊపిరితిత్తుల పనితీరు తగ్గిపోవడం,శారీరక సామర్థ్యం క్షీణించడం, మానసిక ఒత్తిడి పెరగడం వంటి సమస్యలు కనిపిస్తున్నాయని పేర్కొంటున్నారు. సిగరెట్ కాల్చే వారికే కాకుండా పరోక్ష ధూమపానం వల్ల పిల్లలు, మహిళలు, వృద్ధులు కూడా ఆరోగ్య సమస్యలకు గురయ్యే అవకాశముందని హెచ్చరిస్తున్నారు.

### తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలి..

వేసవి సెలవుల సమయంలో పిల్లలు ఎక్కడికి వెళ్తున్నారు.ఎవరితో ఎక్కువ సమయం గడుపుతున్నారు అనే విషయాలను తల్లిదండ్రులు గమనించాలని వైద్యులు సూచిస్తున్నారు. ఇంటికి ఆలస్యంగా రావడం,తరచూ డబ్బులు అడగడం, దుస్తుల నుంచి పొగ వాసన రావడం, ప్రవర్తనలో మార్పులు కనిపించడం వంటి అంశాలను నిర్లక్ష్యం చేయ రాదని చెబుతున్నారు.అలాగే ధూమపానం నియం త్రణకు పాఠశాలలు ప్రారంభమైన తర్వాత ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ప్రజారోగ్య నిపుణులు కోరుతున్నారు.విద్యా సంస్థల పరిసరాల్లో పొగాకు ఉత్పత్తుల విక్రయాలపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచిస్తున్నారు.

### ఆరోగ్యంపై ప్రభావం...

పొగాకు ఏ రూపంలో ఉన్నా ప్రాణాంతకమే.సిగ రెట్లు, బీడీలు,గుట్కా ఇవన్నీ తీవ్రమైన ఆరోగ్య సమస్యలకు దారితీస్తాయి.ధూమపానంతో గుండె,శ్వాసకోశ, క్యాన్సర్ వంటి వ్యాధుల బారిన పడే అవకాశం ఉంటుంది. ధూమపానం ఏదైనా ఆరోగ్యానికి హానికరం.

## ఆదివాసీ హక్కులు చట్టాల అమలుకై,
## అడవి, భూమి, నీరు రక్షణకై పోరాటం

**- ఆదివాసీ గిరిజన సంఘం**

**అరకులోయ** అల్లూరి సీతారామరాజు జిల్లా ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా స్థాయి శిక్షణ తరగతులు అరకులోయ గిరిజన సంఘం కార్యాలయంలో 17,18,19 తేదీల్లో మూడురోజులు పాటు జరుగుతుందని ఆదివాసీ హక్కులు చట్టాలు, సంస్కృతి సంప్రదాయాలు, ఆదివాసీ కళలు, అడవి భూమి, నీరు రక్షణకోసం పోరాటం కొనసాగిస్తామని అన్నారు

ఆదివాసి గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్ ధర్మన్న పడాల్ అధ్యక్షతన జరిగిన ప్రారంభ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బాలాదేవ్ మాట్లాడుతూ ఆదివాసి షెడ్యూల్ ప్రాంతంలో ఆదివాసి హక్కులు చట్టాలు ఉల్లంఘిస్తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదివాసి సహజ వనరులు ,సంపదలు అడవి ,భూమి , నీరు కార్పొరేట్ బడా కంపెనీలకు అప్పనంగా అప్పగిస్తున్నాయని ఆదివాసి సంస్కృతి సాంప్రదాయాలు పండుగలు కళలు నిర్వీర్యం చేసే విధంగా ఆదివాసుల తెగల మధ్య వైమానిష్యాలు విభేదాలు సృష్టిస్తున్నారని ప్రకృతిని దైవంగా ఆరాధించే ఆదివాసులకు మతం పేరుతో విడదీస్తున్నారని ఆదివాసులకు వంద శాతం రిజర్వేషన్ చట్టం చేయాలని ఆదివాసి స్పెషల్ డిఎస్సి నోటిఫికేషన్ విడుదల చేయాలని హైడ్రో పవర్ ప్రాజెక్ట్ అక్రమ ఒప్పందాలు రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో నెంబర్ 13 ,51, 2 రద్దు చేయాలని పీఎం జన్మన్ హౌసింగ్ బకాయి బిల్లులు ఇవ్వాలని చేయాలని రాష్ట్ర ప్రభుత్వం పెంచిన లక్ష రూపాయలు విడుదల చేయాలని జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం కొనసాగించాలని ముఖ హాజరు రద్దు చేయాలని డిమాండ్ చేశారు, ఈ కార్యక్రమంలో ఆదివాసి గిరిజన సంఘం జిల్లా నాయకులు పి సత్యనారాయణ పి సురేష్ కుమార్ జి చిన్నబాబు గంగాధరం జిల్లా నలుమూలల నుండి వచ్చిన ఆదివాసి గిరిజన సంఘం మండల పంచాయతీ గ్రామ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబ సభ్యునికి 75000/- విలువ గల ఎల్.ఓ.సి అందించిన ఎం.ఎల్.ఏ కడియం శ్రీహరి.



జనగామ(భారత శక్తి)జూన్ 17: ధర్మసాగర్ మండల కేంద్రానికి చెందిన గంటే పెద్దపురం కి హైదరాబాద్ లోని నిమ్స్ ఆసుపత్రిలో మోకాలు చికిత్స వైద్యం కోసం వెళ్లగా పెద్దమొత్తంలో ఖర్చు అవుతుందని పరిస్థితిని మాజీ ఉపముఖ్యమంత్రి,ఎం.ఎల్.ఏ కడియం శ్రీహరి దృష్టికి తీసుకెళ్లారు. వారు స్పందించి ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి 75000/-( డెభై ఐదు వేలు)రూపాయల విలువగల ఎల్.ఓ.సి మంజూరు చేయించి ఈ రోజు ఎల్.ఓ.సి పత్రాన్ని హనుమకొండ లోని ఎం.ఎల్.ఏ కడియం శ్రీహరి నివాసంలో వారి కుటుంబ సభ్యులకు అందించారు.

## కూటమినేతలు తమిళనాడు
## సీఎంను చూసి నేర్చుకోవాలి

- - తమిళనాడు తరహాలో రైతన్నకు లక్షలోపు రుణ మాఫీని తక్షణమే ప్రకటించాలి
- - సిపిఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ జిల్లా స్టాండింగ్ కమిటీ సభ్యులు ఎస్ చంద్రశేఖర్ డిమాండ్

**బద్వేలు** నాలుగు దశాబ్దాలు అనుభవం పేదల పక్షపాతి అని చెప్పుకుంటున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం తమ పక్కనున్న తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ ను చూసి నేర్చుకోవాలని తక్షణమే రాష్ట్రంలో ఉన్నటువంటి రైతాంగానికి లక్షలోపు రుణాలను రద్దుచేసి రైతంగం పట్ల తమకున్న చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని సిపిఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ జిల్లా స్టాండింగ్ కమిటీ సభ్యులు చంద్రశేఖర్ డిమాండ్ చేశారు.

బుధవారం ఉదయం తమ పార్టీ ముఖ్య కార్యకర్తలతో కలిసి స్థానిక బద్వేల్ పట్టణంలోని భగత్ సింగ్ నగర్ లోని పార్టీ కార్యాలయం నందు ఆయన పై విధంగా స్పందించారు. ఈ సందర్భంగా ఎస్ చంద్రశేఖర్ మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం తమ ఎన్నికల ప్రచారంలో తాము అధికారంలోకి వచ్చిన వెంటనే రైతన్నలకు అండగా నిలుస్తామని రైతన్నలను పారిశ్రామికవేత్తలకు దీటుగా అభివృద్ధి చెందేలా ప్రణాళికలు రూపొందిస్తామని బూటక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత హామీలను తుంగలో తొక్కి రైతాంగాన్ని మోసం చేసిందని వారు ఘాటుగా విమర్శించారు. రైతన్నల భరోసా అంటూ పదేపదే సభలు సమావేశాలు పెడుతూ హంగామా చేస్తున్న కూటమి ప్రభుత్వ నేతలు రెండేళ్లు గడిచిన ఏ హామీని నెరవేర్చిన పాపాన పోలేదని వారు విమర్శించారు. ఎన్నికల ప్రచారంలో స్మార్ట్ మీటర్లు బిగిస్తే పగలగొట్టండి అని నినాదం ఇచ్చి నేడు మాట మరిచి స్మార్ట్ మీటర్లు బిగించి రైతన్నల రక్తం తాగుతున్న మాట వాస్తవం కాదా అని వారు ప్రశ్నించారు. ఒకవైపు రైతు ప్రభుత్వం అంటూ చెప్పుకుంటూ రెండో వైపు ప్రాజెక్టుల పనులను పోస్ట్ ఫోన్ చేసుకుంటూ పర్యటనలు పేరుతో రైతులను ఏమారుస్తున్న మాట వాస్తవం కాదా అని వారు ఘాటుగా ప్రశ్నించారు.

రైతుల పట్ల ప్రజల సమస్యల పట్ల నిజమైన నిజాయితీ చిత్తశుద్ధి ఉంటే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రైతాంగం యొక్క సహకార రుణాలు మాఫీ చేయాలని వారు డిమాండ్ చేశారు. పదేపదే మేము ఇది సాధించాం మేమే అభివృద్ధి చేశాం అంటూ ప్రగల్బాలు పలుకుతున్న మంత్రివర్గం ఇంతవరకు రైతాంగ సమస్యలపై వారి సహకార రుణాల మాఫీపై ఇంతవరకు ఎందుకు ప్రకటించలేదని వారు ప్రశ్నించారు. అనుభవం ముఖ్యం కాదని అవగాహన ముఖ్యమని అది ఉండబట్టే తమిళనాడు సీఎం గా కొత్తగా ఎన్నికైన విజయ్ గారు 75 వేల లోపు రుణాలు ఉన్న సహకార సంఘాల రుణాల మాఫీని ప్రకటించారని, స్మార్ట్ మీటర్లను పూర్తిగా ఎత్తివేయాలని, ఆ ప్రాజెక్టును పూర్తిగా పక్కన పెట్టాలని చేసిన నిర్ణయాలు ఆదర్శంగా నిలుస్తున్నాయని మీరు కూడా ఆ బాటలో పయనించి తక్షణమే లక్షలోపు రుణాలు ఉన్న రైతులకు రుణమాఫీ ప్రకటించి నిధులు విడుదల చేయాలని, వివాదాల పేరుతో మాయ మాటలు చెప్పకుండా కేంద్రంతో పరిష్కరించుకొని తక్షణమే అన్ని ప్రాజెక్టులకు నీరు విడుదల చేసి రైతాంగాన్ని ఆదుకోవాలని లేనిపక్షంలో సిపిఐ ఎంఎల్ లేబరేషన్ పార్టీ ఆధ్వర్యంలో రైతాంగంతో పెద్ద ఎత్తున ఉద్యమాలు నిర్వహించడానికి కార్యచరణ రూపొందిస్తున్నామని ఆయన హెచ్చరించారు.

ఈ సమావేశంలో జిల్లా కమిటీ సభ్యులు జకరయ్య, నియోజకవర్గ కమిటీ సభ్యులు విజయరావు నారాయణ డి కోడూరు మండల కార్యదర్శి మార్కు,రమణ పట్టణ సమితి సభ్యులు ఈశ్వర్ నరసింహ రమణ తిరువెంగళ ఆచారి తదితరులు పాల్గొన్నారు

## త్వరలో పోరుమామిళ్ల ఉప మార్కెట్ యార్డ్ పూర్తి

**- బద్వేల్ ఏఎంసి నారిసెట్టి సుప్రజ**

పోరుమామిళ్ల వైఎస్సార్ కడప జిల్లా బద్వేల్, పోరుమామిళ్ల ప్రాంతాల్లో రైతులకు మెరుగైన మార్కెట్ సదుపాయాలు కల్పించే దిశగా కీలక సమావేశం జరిగింది. బద్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ నారిశెట్టి సుప్రజ, నాగేంద్రలు మార్కెటింగ్ జాయింట్ డైరెక్టర్ రామాంజనేయులను కలిసి పలు అభివృద్ధి అంశాలపై చర్చించారు.ఈ సందర్భంగా బద్వేల్ మార్కెట్ యార్డ్‌కు సంబంధించిన సమస్యలు, పోరుమామిళ్లలో రైతు బజార్ ఏర్పాటు, బద్వేల్ రైతు బజార్ నిర్వహణను మరింత సమర్థవంతంగా చేపట్టే అంశాలపై చర్చించారు. అలాగే నిర్మాణంలో ఉన్న పోరుమామిళ్ల ఉప మార్కెట్ యార్డ్‌ను త్వరలో పూర్తి చేసి రైతులకు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు.అదేవిధంగా బద్వేల్ మార్కెట్ యార్డ్‌లో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టి ఆదాయ వనరులను పెంచడంతో పాటు రైతులు, వ్యాపారులకు మెరుగైన సౌకర్యాలు కల్పించే అంశాన్ని కూడా ప్రస్తావించారు. రైతుల ప్రయోజనాలే లక్ష్యంగా ఈ అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయాలని సమావేశంలో నిర్ణయించారు.

## మహిళల గౌరవాన్ని కించపరిచే
## వ్యాఖ్యలను ఖండిస్తున్నాం

**పిడుగురాళ్ల** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హోంమంత్రి అనిత పై వైసీపీ నాయకుడు గుడివాడ అమర్‌నాథ్ చేసిన అనుచిత, అవమానకర వ్యాఖ్యలను నేను తీవ్రంగా ఖండిస్తున్నాను అని సౌత్ సెంట్రల్ రైల్వే బోర్డు మెంబర్ కొంక రాధ అన్నారు. ఈ సందర్భంగా ఆమె పిడుగురాళ్లలో మీడియాతో మాట్లాడుతూ ఒక మహిళను, అదీ రాష్ట్ర హోంమంత్రిగా బాధ్యతలు నిర్వహిస్తున్న నాయకురాలిని వ్యక్తిగతంగా లక్ష్యంగా చేసుకుని మాట్లాడటం అత్యంత బాధాకరం అన్నారు, ఆ వ్యాఖ్యలు ఖండించదగిన విషయం అన్నారు.సామాన్య కుటుంబం నుంచి స్వయంకృషితో ఎదిగి, ఎస్సీ వర్గానికి చెందిన మహిళగా ఎన్నో అవరోధాలను అధిగమించి రాష్ట్ర హోంమంత్రి స్థాయికి చేరుకున్న అనిత నేటి యువతకు, మహిళలకు స్ఫూర్తిగా నిలుస్తున్నారు అని అన్నారు. అలాంటి మహిళపై వ్యక్తిగత విమర్శలు చేయడం అంటే ఆమెను మాత్రమే కాదు, రాష్ట్రంలోని ప్రతి మహిళ ఆత్మగౌరవాన్ని అవమానించినట్టే అని అన్నారు.రాజకీయాల్లో విభేదాలు ఉండవచ్చు, విమర్శలు ఉండవచ్చు, కానీ అవి విధానాలపై ఉండాలి తప్ప, మహిళల వ్యక్తిత్వం, రూపురేఖలు లేదా వ్యక్తిగత విషయాలపై కాదు అని అన్నారు. మహిళలను కించపరిచే భాషను ఉపయోగించడం వైసీపీ నాయకుల సంస్కృతిని బయటపెడుతోంది అన్నారు.నేడు మహిళలు అన్ని రంగాల్లో అగ్రస్థానాల్లో నిలుస్తున్నారు అని అన్నారు. అలాంటి సమయంలో మహిళల గౌరవాన్ని దెబ్బతీసే వ్యాఖ్యలు చేయడం అత్యంత దురదృష్టకరం అని రాధా అన్నారు . ఇటువంటి వ్యాఖ్యలను రాష్ట్రంలోని ప్రతి మహిళ, ప్రతి ప్రజాస్వామ్యవాది ఖండించాలి అన్నారు. హోంమంత్రి అనిత కి ప్రజల ఆశీస్సులు, మద్దతు పుష్కలంగా ఉన్నాయి అన్నారు. ఇలాంటి చౌకబారు వ్యాఖ్యలు ఆమె స్థాయిని ఏమాత్రం తగ్గించలేవు అన్నారు. ఆమె మరింత ధైర్యంగా, మరింత సమర్థవంతంగా ప్రజాసేవలో ముందుకు సాగుతారు అని రాధా తన ఆశా భావాన్ని వ్యక్తం చేశారు.మహిళలను అవమానించడం ద్వారా రాజకీయ లబ్ధి పొందాలనుకునే వారికి ప్రజలే తగిన సమయంలో తగిన సమాధానం చెబుతారు అని అన్నారు. వైసిపి మాజీ మంత్రి అమర్‌నాథ్ హోంమంత్రి అనిత కు బహిరంగం గా క్షమాపణలు చెప్పాలని గురజాల నియోజకవర్గ మహిళాలందరి తరుపున డిమాండ్ చేస్తున్నాం అని కొంకా రాధ అన్నారు.

# శ్రీ భీమేశ్వర స్వామివారిని దర్శించుకున్న కరీంనగర్ ఎమ్మెల్యే.



భారత శక్తి న్యూస్, రాజన్న సిరిసిల్ల, జూన్ 17: వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీ భీమేశ్వర స్వామివారిని కరీంనగర్ శాసనసభ్యులు గంగుల కమలాకర్ కుటుంబ సమేతంగా దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి విచ్చేసిన ఎమ్మెల్యే గంగుల కమలాకర్ కి ఆలయ అర్చకులు వేద మంత్రోచ్చారణలతో, స్వస్తి వచనాలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం స్వామివారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీర్వాదాలు పొందారు. తదుపరి స్వామివారి మండపంలో ఆలయ అర్చకులు, వేద పండితులు ఎమ్మెల్యే కి తీర్థప్రసాదాలు అందజేసి ఆశీర్వచనం చేశారు. ఈ సందర్భంగా ఆలయ డీఈవో భాస్కర శర్మ స్వామివారి శేషవస్త్రం, లడ్డూ ప్రసాదాన్ని అందజేసి సత్కరించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలోని బద్ది పోచమ్మ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక మొక్కులు సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ జి. శ్రావణ్ కుమార్, ప్రోటోకాల్ అండ్ టెంపుల్ పర్యవేక్షకులు జి. శ్రీనివాస్ శర్మ, నూగురి నరేందర్, టెంపుల్ ఇన్స్పెక్టర్ గౌతమ్, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# భైంసాలో ఎస్పీ గ్రీవెన్స్ డే.. 11 ఫిర్యాదుల స్వీకరణ.

**బాధితులకు సత్వర న్యాయం అందించాలంటూ అధికారులకు ఆదేశాలు.**




నిర్మల్ జిల్లా ప్రతినిధి, జూన్ 17 (భారత శక్తి )భైంసా, ప్రజల సమస్యల పరిష్కారానికి పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని నిర్మల్ జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల తెలిపారు. బుధవారం భైంసా ఎస్పీ క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమంలో ఆమె పాల్గొని ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు.భైంసా సబ్‌డివిజన్ పరిధిలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన 11 మంది అర్జిదారుల నుంచి వినతులు స్వీకరించిన ఎస్పీ, ప్రతి ఫిర్యాదును క్షుణ్ణంగా పరిశీలించారు. బాధితుల సమక్షంలోనే సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి, సమస్యలను చట్టపరంగా పరిష్కరించేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రజలకు న్యాయం త్వరితగతిన అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ సందర్భంగా కుటుంబ కలహాలకు సంబంధించిన కొన్ని ఫిర్యాదులపై షీ టీం సిబ్బంది ఇరు వర్గాలకు కౌన్సిలింగ్ నిర్వహించారు. కౌన్సిలింగ్ ఫలితంగా కొన్ని కుటుంబాలు తిరిగి కలిసినట్లు అధికారులు తెలిపారు. కౌన్సిలింగ్ కోసం నిర్మల్ వరకు వెళ్లాల్సిన అవసరం లేకుండా భైంసాలోనే ఈ సదుపాయం కల్పించడంపై బాధితులు సంతృప్తి వ్యక్తం చేశారు.అనంతరం గత గ్రీవెన్స్ డేల్లో స్వీకరించిన ఫిర్యాదుల పరిష్కార స్థితిపై ఎస్పీ సమీక్ష నిర్వహించారు. ఇంకా పెండింగ్‌లో ఉన్న ఫిర్యాదులను వేగవంతంగా పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.జిల్లా పోలీస్ శాఖ ప్రజల సమస్యల పరిష్కారానికి కట్టుబడి ఉందని, ప్రతి ఫిర్యాదుపై స్పందించి బాధితులకు సహాయం అందిస్తామని ఎస్పీ డా. జి. జానకి షర్మిల స్పష్టం చేశారు.

# డాక్టర్ శ్రీనివాస్ ఆర్థోపెడిక్‌డజనరల్ హాస్పిటల్ ను ప్రారంభించిన ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి



జనగామ(భారత శక్తి)జూన్ 17: పాలకుర్తి నియోజకవర్గం,తొర్రూర్ పట్టణంలోని డాక్టర్ శ్రీనివాస్ ఆర్థోపెడిక్‌డజనరల్ హాస్పిటల్‌ను పాలకుర్తి శాసనసభ్యురాలు మామిడాల యశస్విని రెడ్డి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆసుపత్రి ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, వైద్య సిబ్బంది, స్థానిక నాయకులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మాట్లాడుతూ డాక్టర్ శ్రీనివాస్ గ్రామీణ,పట్టణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ఈ ఆసుపత్రిని ఏర్పాటు చేయడం అభినందనీయమని,ఆధునిక వైద్య సదుపాయాలతో కూడిన ఈ ఆసుపత్రి ద్వారా ప్రజలకు మెరుగైన ఆరోగ్య సేవలు అందుబాటులోకి వస్తాయని,ప్రజలు చిన్న చిన్న ఆరోగ్య సమస్యల కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా స్థానికంగానే నిపుణుల వైద్య సేవలు పొందగలరని,ఆరోగ్యమే మహాభాగ్యమని, ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు.అనంతరం ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన వివిధ విభాగాలను ఎమ్మెల్యే పరిశీలించి, వైద్య సిబ్బందితో మాట్లాడి అందిస్తున్న సేవల గురించి వివరాలు తెలుసుకున్నారు. ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందిస్తూ ఆసుపత్రి మంచి పేరు తెచ్చుకోవాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తూనం శ్రవణ్ కుమార్, వైస్ చైర్మన్ సోమా రజిని రాజశేఖర్, సీనియర్ నాయకులు డా, సోమేశ్వర్ రావు, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మేకల కుమార్, మాజీ మున్సిపల్ చైర్మన్ వైస్ చైర్మన్, వార్డు కౌన్సిలర్లు, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, వైద్యులు, సిబ్బంది,ప్రజలు పాల్గొన్నారు.

# పోక్సో & హత్య కేసులో సంచలన తీర్పు.

**- నిందితుడుకి పాక్సో కేసులో 20 సం. జైలు శిక్ష హత్య కేసులో జీవిత ఖైదు.**

**- పోలీసు-ప్రాసిక్యూషన్ సమన్వయంతో నిందితులకు వరుస శిక్షలు.**

**- నిందుతుడికి శిక్ష పడటంలో కృషి చేసిన అధికారులను , పిపి,సిబ్బందిని అభినందించిన జిల్లా ఎస్పీ.**

భారత శక్తి న్యూస్,రాజన్న సిరిసిల్ల, జూన్ 17: చందుర్తి, వేములవాడ పట్టణ పోలీస్ స్టేషన్లలో నమోదైన రెండు కేసుల్లో మైనర్ బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడిన పోక్సో కేసుతో పాటు,అదే బాలిక హత్య కేసులో నిందితుడికి పొక్సో కేసులో 20 సం.హత్య కేసులో జీవిత ఖైదు విధిస్తూ సిరిసిల్ల పోక్సో కోర్టు ప్రధాన న్యాయమూర్తి రాధికా జైస్వాల్ బుధవారం తీర్పు వెల్లడించినట్లు జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే తెలిపారు. కోడిమ్యాల్ మండలం శ్రీరాములపల్లి గ్రామనికి చెందిన బండపల్లి నవీన్ అనే వ్యక్తి చందుర్తి మండలం మూడపల్లి గ్రామానికి చెందిన మైనర్ బాలికను లైంగికా వేధింపులకి గురి చేసిన విషయంలో బాధితురాలి తండ్రి ఫిర్యాదు మేరకు చందుర్తి పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేసి అప్పటి వేములవాడ డిఎస్పీ వెంకటరమణ దర్యాప్తు అనంతరం నిందితుడినీ రిమాండ్ కి తరలించి కోర్టులో చార్జిషీట్ ఫైల్ చేసారు. వేములవాడ పట్టణ పోలీస్ స్టేషన్లో నమోదైన అదే మైనర్ బాలిక హత్య కేసులో బాధితురాలి తండ్రి ఫిర్యాదు మేరకు అప్పటి వేములవాడటౌన్ ఇన్స్పెక్టర్ వెంకటేష్ కోడిమ్యాల మండలం శ్రీరాములపల్లి గ్రామనికి చెందిన బండపల్లి నవీన్ పై కేసు నమోదు చేసి దర్యాప్తు అనంతరం నిందితుడి రిమాండ్ చేసి కోర్టులో చార్జ్ షీట్ దాఖలు చేయడం జరిగింది. కోర్టు విచారణలో భాగంగా అదనపు ఎస్పీ చంద్రయ్య పర్యవేక్షణలో కోర్టు మానిటరింగ్ ఎస్.ఐ రవీందర్ నాయుడు ఆధ్వర్యంలో చందుర్తి, వేములవాడ కోర్టు కానిస్టేబుల్స్ లతీఫ్, మహేందర్ , కోర్టు మానిటరింగ్ కానిస్టేబుల్ నవీన్, పొక్సో కోర్టు కానిస్టేబుల్ వెన్నెల కోర్టులో 15 మంది సాక్షులను ప్రవేశపెట్టగా ప్రాసిక్యూషన్ తరుపున గత పబ్లిక్ ప్రాసిక్యూటర్ పెంట శ్రీనివాస్ వాదించగా, శాస్త్రీయ ఆధారాలు, సాక్ష్యాలు పరిశీలీశీచిన న్యాయమూర్తి నేరము రుజువు కావడంతో నిందితుడైన బండపల్లి నవీన్ కి పొక్సో కేసులో 20 సంవత్సరాలు జైలు శిక్ష,రూ. 7000 జరిమాన , హత్య కేసులో జీవిత ఖైదు రూ.5000/- విధించారు. సమాజంలో నేరం చెసిన వారు ఎవరు కుడా శిక్షల నుండి తప్పించుకోలేరని, శిక్షలతోనే సమాజంలో మార్పు వస్తుందని, పోలీసులు, ప్రాసిక్యూషన్ వారు వ్యూహాత్మకంగా న్యాయ నిరూపణ, న్యాయ విచారణ జరిపి శిక్షలు పడేల చెస్తారని సూచించారు. ఈ కేసులలో పకడ్బంధిగా దర్యాప్తు జరిపి నిందితుడికి శిక్ష పడేలా కృషి చెసిన పొక్సో



కేసులో అప్పటి విచారణ అధికారి డిఎస్పీ వెంకటరమణ, ప్రస్తుత డిఎస్పీ శ్రీనివాసులు, ఎస్.ఐ రమేష్, హత్య కేసులో అప్పటి విచారణ అధికారి ఇన్స్పెక్టర్ వెంకటేష్, ప్రస్తుత ఇన్స్పెక్టర్ వీరప్రసాద్, గత పబ్లిక్ ప్రాసిక్యూటర్ పెంట శ్రీనివాస్,కోర్టు మానిటరిశీగ్ ఎస్.ఐ రవీందర్ నాయుడు, కోర్టు కానిస్టేబుల్స్ మహేందర్, లతీఫ్, కోర్టు మానిటరింగ్ కానిస్టేబుల్ నవీన్,పొక్సో కోర్టు కానిస్టేబుల్ వెన్నెల లను జిల్లా ఎస్పీ అభినందిచారు. మైనర్లపై నేరాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవని, ప్రతి కేసులో నాణ్యమైన దర్యాప్తు చేపట్టి బాధితులకు న్యాయం జరిగేలా జిల్లా పోలీస్ యంత్రాంగం కట్టుబడి ఉందన్నారు.

# ప్రభుత్వ బడుల్లోనే నాణ్యమైన విద్య

**-కుంటాల పాఠశాల తనిఖీలో కలెక్టర్ భవేశ్ మిశ్రా.**

**-పాఠశాల పరిశుభ్రతపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసిన కలెక్టర్**

**-హాజరు లేని విద్యార్థులను బడికి తీసుకురావాలని ఉపాధ్యాయులకు ఆదేశం.**



నిర్మల్ జిల్లా ప్రతినిధి, జూన్ 17(భారత శక్తి ): ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అన్నారు. బుధవారం కుంటాల మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆదర్శ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఆయన విద్యార్థుల హాజరు, ఉపాధ్యాయుల పనితీరు, పాఠశాల నిర్వహణపై సమగ్రంగా ఆరా తీశారు. ఈ సందర్భంగా పాఠశాల పరిసరాలను పరిశీలించిన కలెక్టర్, పరిశుభ్రత సరిగా లేకపోవడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులకు ఆదర్శంగా నిలవాల్సిన విద్యాసంస్థల్లో పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వకపోవడం సరికాదని అధికారులను హెచ్చరించారు. పాఠశాల ఆవరణను ఎల్లప్పుడూ శుభ్రంగా ఉంచాలని, నిర్లక్ష్యం వహిస్తే బాధ్యులపై చర్యలు తప్పవని స్పష్టం చేశారు. విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఉపాధ్యాయులను ఆదేశించిన కలెక్టర్, బడికి హాజరుకాని విద్యార్థుల తల్లిదండ్రులతో నేరుగా మాట్లాడి ప్రతి విద్యార్థి పాఠశాలకు వచ్చేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలలపై ప్రజల్లో విశ్వాసం పెంచే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని చెప్పారు. పదో తరగతి విద్యార్థులతో ప్రత్యేకంగా ముచ్చటించిన కలెక్టర్, వారి విద్యా ప్రతిభను పరీక్షించారు. లెక్కలు చేయించి, పలు ప్రశ్నలు అడిగి



వారి అవగాహనను తెలుసుకున్నారు. కేవలం పాఠ్యాంశాలకే పరిమితం కాకుండా సామాజిక అంశాలపై కూడా అవగాహన పెంపొందించుకోవాలని విద్యార్థులకు సూచించారు. భవిష్యత్ పోటీ ప్రపంచాన్ని ఎదుర్కొనేందుకు నైపుణ్యాల అభివృద్ధిపై దృష్టి పెట్టాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం పాఠశాల ప్రాంగణంలోని ట్రాన్స్‌ఫార్మర్‌ను పరిశీలించిన కలెక్టర్, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా మెరుగైన విద్యుత్ సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. వసతి గృహాన్ని తనిఖీ చేసి విద్యార్థులకు మెరుగైన వసతి, భోజన సదుపాయాలు అందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. తర్వాత కుంటాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్, వైద్య సేవలు, రికార్డులు, రోగులకు అందుతున్న చికిత్సపై సమీక్ష నిర్వహించారు. వర్షాకాలం నేపథ్యంలో కాలానుగుణ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనంతరం అందకూర్ గ్రామ ప్రాథమిక పాఠశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన పూర్వ ప్రాథమిక పాఠశాలను ప్రారంభించి చిన్నారులతో ఆప్యాయంగా ముచ్చటించారు. విద్యార్థులతో కలిసి సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమంలో పాల్గొని వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి భోజన్న, జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి రాజేందర్, తహసీల్దార్ కమల్ సింగ్, ఎంపీడీఓ వనజ, మండల విద్యాధికారి ముత్యం, సర్పంచ్ గజేందర్ తదితరులు పాల్గొన్నారు.

# అరుదైన వ్యాధితో బాధపడుతున్న అభిమాని నిరంజన్ ను పరామర్శించిన పవన్ కళ్యాణ్..

జనగామ (భారత శక్తి)జూన్17: అరుదైన డిఎన్డి అనే జన్యుపరమైన వ్యాధితో బాధపడుతూ ఎదుగుదల లేని స్థితిలో,మంచానికే పరిమితం అయిన యువ అభిమాని కోరికను మన్నించి స్వయంగా అతని నివాసానికి వెళ్లి పరామర్శించారు.ఆర్థిక భరోసాతోపాటు భగవంతుని తీర్థప్రసాదాలు అందజేశారు.తెలంగాణ రాష్ట్రం హనుమకొండ పట్టణంలోని హనుమాన్ నగర్ కి చెందిన 17 ఏళ్ల నిరంజన్ అరుదైన వ్యాధితో పోరాడుతున్నాడు. తన చివరి కోరికగా పవన్ కళ్యాణ్ ని కలవాలని అభిలషించారు. తెలంగాణ జనసేన నాయకుల ద్వారా విషయం తెలుసుకున్న ఉప ముఖ్యమంత్రివర్యులు బుధవారం స్వయంగా నిరంజన్ ఇంటికి వెళ్లారు. అతన్ని దగ్గరకు తీసుకుని పరామర్శించారు. తల్లిదండ్రులు పొనుగోటి రాంగోపాల్-మానసతో మాట్లాడి నిరంజన్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వైద్యం ఎక్కడ చేయిస్తున్నారు అతన్ని కాపాడుకోవడానికి ఏం చేయొచ్చు అన్న విషయాలపై ఆరా తీశారు. ధైర్యంగా ఉండాలని భగవంతుడి ఆశీస్సులు బాబుకి ఉంటాయని చెప్పి కుటుంబ సభ్యులకు మనో ధైర్యం నింపారు. శ్రీ వెంకటేశ్వరస్వామి వారి తీర్థ ప్రసాదాలు అందించి భగవంతుని ఆశీస్సులు ఉండాలని ఆకాంక్షించారు. వైద్య ఖర్చుల నిమిత్తం రూ.లక్ష ఆర్థిక సాయం అందజేశారు. నిరంజన్ ఆరోగ్యం కోసం వరంగల్ విఖ్యాత భద్రకాళి అమ్మవారి ఆలయంలో ప్రత్యేకంగా పూజలు చేయిస్తానని తెలిపారు. చలించిపోయిన పవన్ కళ్యాణ్ నిరంజన్ ను చూసేందుకు వచ్చిన పవన్ కళ్యాణ్ ఆతనితో చాలా సమయం గడిపారు.ఇంట్లోకి వచ్చిన పవన్ కళ్యాణ్ లేవలేని స్థితిలో ఉన్న అభిమానిని చూసి చలించిపోయారు.అతని మంచంపై కూర్చుని ఆత్మీయంగా హత్తుకున్నారు. నుదిటిపై ముద్దు పెట్టి ఆప్యాయంగా పలకరించారు. చిన్ననాటి నుంచి మీరంటే అభిమానం అని నిరంజన్ చెప్పిన మాటలు విని కదలిపోయారు.

తిరుమల శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయం నుంచి తెప్పించిన వస్త్రాన్ని అతనికి కప్పి,కళ్యాణం అక్షతలు ఇచ్చి ఆశీర్వదించారు.భద్రకాళి అమ్మవారి వెండి ప్రతిమకు ఆలయంలో పూజ చేయించి కుటుంబ సభ్యులకు అందజేస్తానని తెలిపారు.నిరంజన్ ఆరోగ్యంగా ఉన్న సమయంలో పవన్ కళ్యాణ్ ని అనుకరిస్తూ చేసిన డాన్సుల తాలూకు వీడియోలు, ఫొటోలను తిలకించారు. అంతా తనని చోటా గబ్బర్ సింగ్ అని పిలుస్తారని నిరంజన్ చెప్పాడు. ఈ సందర్భంగా నిరంజన్ ఓ కుక్క పిల్ల బొమ్మ చూపి పెంచుకోవాలని ఉందని చెప్పగా కొని పంపుతానని హామీ ఇచ్చారు.కుక్కను పెంచుకోవడానికి ఇంటి ఓనర్స్ అనుమతి కావాలని నిరంజన్ తండ్రి చెప్పగా స్వయంగా ఆ ఇంటి ఓనర్స్ ని పిలిపించి మాట్లాడారు. నిరంజన్ తల్లిదండ్రులు వృత్తి వివరాలు అడిగి తెలుసుకున్నారు. గతంలో కాకతీయ ఆసుపత్రి



క్యాంటిన్లో పని చేసేవారమని చెప్పగా, వారి జీవనోపాధి మెరుగుపర్చేందుకు క్యాంటిన్ పెట్టించాలని జనసేన తెలంగాణ రాష్ట్ర నాయకులకి దిశానిర్దేశం చేశారు.నిరంజన్ పరామర్శ పూర్తయిన వెంటనే పవన్ కళ్యాణ్ నేరుగా వరంగల్ భద్రకాళి అమ్మవారి ఆలయానికి బయలుదేరి వెళ్లారు.పవన్ కళ్యాణ్ తోపాటు జనసేన పార్టీ తెలంగాణ ఇంఛార్జ్ శంకర్ గౌడ్, పార్టీ ప్రధాన కార్యదర్శి రామ్ తాళ్లూరి,పార్టీ నాయకులు రాధారం రాజలింగం, ఆర్ కె సాగర్ తదితరులున్నారు.

# సమాజం నుండి డ్రగ్స్ మహమ్మారిని తరిమి కొట్టాలి

**- పటాన్‌చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి**

**- జిన్నారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పాఠ్యపుస్తకాల పంపిణీ**

జిన్నారం జూన్ 17 భారత శక్తి ప్రస్తుత సమాజాన్ని పట్టిపీడిస్తున్న డ్రగ్స్ మహమ్మారిని అరికట్టడంలో విద్యార్థులు కీలకపాత్ర పోషించాలని పటాన్‌చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. బుధవారం జిన్నారం మున్సిపల్ కేంద్రంలో గల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటుచేసిన పాఠ్యపుస్తకాల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత దేశ భవిష్యత్తుకు



వెన్నెముకలని, కళాశాల స్థాయి నుంచే డ్రగ్స్ వంటి మత్తు పదార్థాల వినియోగాన్ని పూర్తిగా నిర్మూలించేందుకు సమిష్టిగా కృషి చేయాలని సూచించారు విద్యార్థులు చదువుతో పాటు మంచి విలువలను అలవర్చుకొని, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని కోరారు. ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి



యువత ముందుండాలని పిలుపునిచ్చారు. విద్యార్థుల కోరిక మేరకు అతి త్వరలో బెంచీలు అందచేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిన్నారం మున్సిపల్ చైర్మన్ జనార్ధన్, వైస్ చైర్మన్ ప్రతాప్ రెడ్డి, సీనియర్ నాయకులు వెంకటేష్ గౌడ్, కళాశాల ప్రిన్సిపాల్ కళింగ కృష్ణ కుమార్, ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

# మునగ ఉత్పత్తులతో ఆరోగ్య విప్లవానికి శ్రీకారం

**ప్రజల ఆరోగ్యమే లక్ష్యంగా యువ పారిశ్రామికవేత్త నిఖిల్ కంధూరి వినూత్న ప్రయత్నం**



కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) జూన్ 17: కామారెడ్డి పట్టణానికి చెందిన సీపీఎం నాయకులు చంద్రశేఖర్ కుమారుడు నిఖిల్ కంధూరి హోటల్ మేనేజ్‌మెంట్‌లో పట్టా పొంది, అనంతరం ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీలో మాస్టర్స్ పూర్తి చేశారు. విద్యాభ్యాసం అనంతరం అంతర్జాతీయ క్రూయిజ్ లైన్స్‌లో ఉద్యోగం చేసి విలువైన అనుభవాన్ని సంపాదించారు. విదేశాల్లో పనిచేసిన సమయంలో ఆరోగ్యకరమైన ఆహార ఉత్పత్తుల ప్రాధాన్యతను గుర్తించిన ఆయన, ఆ అనుభవాన్ని ప్రజల ఆరోగ్యానికి ఉపయోగపడే విధంగా మలచాలనే సంకల్పంతో స్వదేశానికి వచ్చి "నిఖిల్ డీహైడ్రేటెడ్ ఫుడ్స్" ఆధ్వర్యంలో "కంధూరీస్ ఫామ్ ప్రొడక్ట్స్"లి సంస్థను ప్రారంభించారు. ఈ సంస్థ ప్రారంభోత్సవ కార్యక్రమానికి కామారెడ్డి జిల్లా కలెక్టర్ శ్రీ ఆశిష్ సంగ్వాన్ ముఖ్య అతిథిగా హాజరై శుభాకాంక్షలు తెలిపారు. పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ శ్రీ లాలు నాయక్ సంస్థను ప్రారంభించి, యువత స్వయం ఉపాధి రంగంలో ముందుకు రావాలని సూచించారు, రచన మేడం ప్రాజెక్టు సక్సెస్ కావడానికి పూర్తి సహకారాన్ని అందించారు. ప్రస్తుతం ప్రజలు ఫాస్ట్ ఫుడ్, ప్రాసెస్డ్ ఆహారాల వైపు ఎక్కువగా మొగ్గు చూపుతున్న నేపథ్యంలో ఆరోగ్యకరమైన ప్రత్యామ్నాయంగా మునగ ఆధారిత ఉత్పత్తులను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు నిఖిల్ కంధూరి తెలిపారు. మునగలో సమృద్ధిగా ఉండే విటమిన్లు, ఖనిజ లవణాలు, ప్రోటీన్లు, యాంటీఆక్సిడెంట్లు రోగనిరోధక శక్తిని పెంపొందించడంతో పాటు శరీరానికి అవసరమైన పోషకాలను అందిస్తాయని పేర్కొన్నారు. ఈ సంస్థ ద్వారా మునగ ఆకు పౌడర్, మునగ ఆకు పప్పుల పొడి మిక్స్, మునగ ఆకు కారం పొడి మిక్స్ వంటి ఆరోగ్యకర ఉత్పత్తులను ప్రజలకు అందిస్తున్నారు. "ఫ్రమ్ అవర్ ఫార్మ్ టు యువర్ ఫ్యామిలీ" అనే నినాదంతో నాణ్యమైన, సహజసిద్ధమైన ఆహార ఉత్పత్తులను ప్రతి ఇంటికి చేరవేయడమే తమ లక్ష్యమని తెలిపారు. ఆరోగ్యకరమైన ఆహార అలవాట్లను ప్రజల్లో పెంపొందించడం, రోగనిరోధక శక్తిని పెంచే సహజ ఉత్పత్తులను అందించడం, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడం తమ భవిష్యత్ లక్ష్యాలని నిఖిల్ కంధూరి తెలిపారు. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు, కుటుంబ సభ్యులు, స్నేహితులు నిఖిల్ కంధూరికి శుభాకాంక్షలు తెలియజేసి, విదేశాల్లో ఉద్యోగ అవకాశాలు ఉన్నప్పటికీ స్వస్థలంలో ఆరోగ్యకర ఆహార ఉత్పత్తుల పరిశ్రమను స్థాపించడం అభినందనీయమని కొనియాడారు.

## నిర్ణీత గడువులోగా వంద శాతం ఈ-కేవైసీ పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్.




నిర్మల్ జిల్లా ప్రతినిధి, జూన్ 17 (భారత శక్తి )జిల్లాలో ఎల్‌పీజీ వినియోగదారుల ఈ-కేవైసీ ప్రక్రియ నిర్వహణపై అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, సంబంధిత అధికారులు, ఎల్పీజీ సరఫరాదారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ నెల 30వ తేదీలోగా ఈ-కేవైసీ ప్రక్రియ పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఇప్పటివరకు పూర్తిచేసిన ఈ-కేవైసీ ప్రక్రియ వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటివరకు ఈ-కేవైసీ పూర్తి చేయని వినియోగదారులను గుర్తించి వారి కోసం ప్రత్యేక డ్రైవ్‌లు చేపట్టాలని సూచించారు. సమాచారాన్ని ఎప్పటికప్పుడు ఎస్ఎంఎస్ ల ద్వారా వినియోగదారులకు తెలియజేయాలన్నారు. ప్రతి వినియోగదారుడు సులభంగా ఈ-కేవైసీ చేయించుకునేలా వీలు కల్పించాలని పేర్కొన్నారు. నిర్ణీత గడువు తేదీ లోపు ప్రక్రియను పూర్తి చేయని ఎల్‌పీజీ సంస్థలపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో జిల్లా పౌర సరఫరాల అధికారి రాజేందర్, ఇతర అధికారులు, సిబ్బంది, ఎల్పీజీ డీలర్లు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు ఎరువుల పంపిణీ విధానంపై అవగాహన కల్పించేందుకు పోస్టర్ల విడుదల



వై ఎస్ ఆర్ కడప, జూన్ 17(భారత శక్తి ): రైతులకు ఎరువుల పంపిణీ విధానం, APAIMS యాప్ వినియోగం,యూరియా, డీఏపీ పంపిణీ నిబంధనలు తదితర అంశాలపై అవగాహన కల్పించేందుకు రాష్ట్ర వ్యవసాయ శాఖ రూపొందించిన సమాచార పోస్టర్లను కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో జిల్లా ఇంచార్జి మంత్రి సవిత, జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి,ప్రభుత్వ విప్, జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ రైతులు APAIMS యాప్ ద్వారా తమ పంటల వివరాలను నమోదు చేసుకోవడం, రైతు సేవా కేంద్రాలు (RSK\T) ద్వారా ఎరువులు పొందడం, ఎరువుల పంపిణీలో పారదర్శకతను పెంపొందించడం వంటి అంశాలపై పోస్టర్ల ద్వారా విస్తృత అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. రైతులు ప్రభుత్వ మార్గదర్శకాలను అనుసరించి ఎరువులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు, సంబంధిత విభాగాల అధికారులు పాల్గొన్నారు.

# ఎరువుల విత్తనాలు విక్రయించే దుకాణాలను మ్యాపింగ్ చేయాలి కలెక్టర్ రాహుల్ శర్మ

భూపాలపల్లి ప్రతినిధి, జూన్ 17 (భారత శక్తి) జిల్లాలోఎరువులు, విత్తనాలు విక్రయించే అన్ని దుకాణాలను మ్యాపింగ్ చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ వ్యవసాయ అధికారులను ఆదేశించారు. బుధవారం ఐడీఓసీ కార్యాలయంలో ఎరువులు, విత్తనాల విక్రయాలు, మ్యాపింగ్, రైతు రిజిస్ట్రీ తదితర అంశాలపై వ్యవసాయ, సహకార, పంచాయతీ రాజ్ తదితర శాఖల అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రస్తుతం అందుబాటులో ఉన్న 38 రైతు వేదికల ద్వారా ఎరువులు, విత్తనాల విక్రయాలు చేపట్టాలని స్పష్టం చేశారు. ఇప్పటివరకు 15 రైతు వేదికల మ్యాపింగ్ పూర్తయిందని, మిగిలిన 23 రైతు వేదికల మ్యాపింగ్‌ను యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి విక్రయాలు ప్రారంభించాలని ఆదేశించారు. రైతులు యూరియాను యాప్ ద్వారా బుకింగ్ చేసుకుని పొందేలా వారికి విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. ప్రభుత్వం సూచించిన ధాన్యం సాగు విధానాలపై రైతుల్లో అవగాహన పెంచేందుకు డిపిఆర్ఓ ద్వారా కళాజాత ప్రదర్శనలు నిర్వహించాలని కలెక్టర్ తెలిపారు.

**- నకిలీ విత్తనాలపై ఉక్కుపాదం**

నకిలీ విత్తనాల విక్రయదారులపై అత్యంత కఠినంగా వ్యవహరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఎక్కడైనా నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు, పోలీసు కేసులు నమోదు చేసి, వారి లైసెన్సులను తక్షణమే రద్దు చేయాలని ఆదేశించారు. విక్రయ కేంద్రాల వద్ద పటిష్టమైన పర్యవేక్షణ ఉండాలని, ప్రతి విక్రయ కేంద్రంలో మండల స్థాయి అధికారి మరియు పోలీసు పర్యవేక్షణ తప్పనిసరిగా ఉండాలని స్పష్టం చేశారు. ఈ ఎరువుల విక్రయాల ప్రక్రియ మొత్తాన్ని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పర్యవేక్షిస్తారని కలెక్టర్ వివరించారు.

**- ఫార్మర్ రిజిస్ట్రీ పూర్తి చేయాలి**

మండలాల వారీగా ఫార్మర్ రిజిస్ట్రీ నమోదు ప్రక్రియను సమీక్షించిన కలెక్టర్, జిల్లాలో ప్రస్తుత నమోదు కేవలం 66.77 శాతం మాత్రమే కావడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. మిగిలిన శాతాన్ని వీలైనంత త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. వీటితో పాటు సాంప్రదాయ యూరియాకు ప్రత్యామ్నాయంగా నానో యూరియా వినియోగం వల్ల కలిగే



ప్రయోజనాలను రైతులకు వివరించాలని సూచించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, జిల్లా వ్యవసాయ అధికారి బాబూరావు, సహకార శాఖ అధికారి వాలియా నాయక్, వ్యవసాయ శాఖ ఏడీఏలు రమేష్, శ్రీపాల్ మరియు అన్ని మండలాల వ్యవసాయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పేద ప్రజల పట్ల ప్రభుత్వ చిత్తశుద్ధికి సంక్షేమ పథకాలే నిదర్శనం.

**-దేశంలో ఎక్కడా లేని సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం.**
**-గత 15ఏళ్ళు ఎమ్మెల్యేగా ఉన్న వ్యక్తి ఎం ఒరగబెట్టాడు.**
**-కడియం శ్రీహరి అంటే అభివృద్ధి అని చెప్పుకునే విధంగా నా పని తీరు ఉంటుంది.**
**-మీరు అభివృద్ధికి సహకరిస్తే అభివృద్ధి చేసి చూపించే బాధ్యత నాది.**
**- మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి**



జనగామ(భారత శక్తి)జూన్ 17: స్టేషన్ ఘనపూర్ మండలం రంగరాయగూడెం, ఇప్పగూడెం గ్రామాలలో పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవానికి ఎమ్మెల్యే కడియం శ్రీహరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రంగరాయగూడెం గ్రామంలో 33.48లక్షలతో నిర్మించనున్న సిసి రోడ్లు, మహిళా భవనం, ప్రాథమిక పాఠశాల ప్రహరీ గోడ నిర్మాణానికి శంకుస్థాపన, ఇందిరమ్మ ఇండ్ల ప్రారంభోత్సవంతో పాటు 8మంది ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాలను పంపిణి చేశారు. అలాగే ఇప్పగూడెం గ్రామంలో కోటి 10లక్షలతో నిర్మించిన సిసి రోడ్ల ప్రారంభోత్సవం, కోటి 23లక్షల కుడా నిధులతో నిర్మించనున్న సిసి రోడ్డు పనులకు శంకుస్థాపన, ఇందిరమ్మ ఇండ్ల ప్రారంభోత్సవంతో పాటు 40మంది ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాలను పంపిణి చేశారు.
ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశాలలో ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేనటువంటి ప్రజా సంక్షేమ పథకాలను అమలు చేస్తూ పేద ప్రజల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వానికి ఉన్న చిత్త శుద్ధిని చాటుకుంటుందని తెలిపారు. గ్రామాల్లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను చుస్తే చాలా సంతోషంగా ఉందని ఆనందం వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో గత 15ఏళ్ళు ఎమ్మెల్యేగా ఉన్న వ్యక్తి ఎం ఒరంగబెట్టారో మీ అందరికీ తెలుసని అన్నారు. పని చేయని వారు, పైసకు కోరగాని వారే ఎక్కువగా మాట్లాడుతారని విమర్శించారు. తాగి, తిని తిరిగే వారు ఎవరో... నిజాయితీగా పని చేసే వారు ఎవరో ప్రజలు గమనించాలని కోరారు. రాజకీయాలకు అతీతంగా గ్రామాల అభివృద్ధికి మీరందరు సహకరిస్తే ప్రతీ గ్రామాన్ని అభివృద్ధి చేసి చూపించే బాధ్యత నాదని వెల్లడించారు. కడియం శ్రీహరి అంటేనే అభివృద్ధి అని చెప్పుకునే విధంగా చేసి చూపెడుతానని స్పష్టం చేశారు. రంగరాయగూడెం గ్రామాన్ని ప్రత్యేక దృష్టితో అభివృద్ధి చేస్తానని అన్నారు. ఇప్పటికే గ్రామంలో కోటి 50లక్షలతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు వెల్లడించారు. గ్రామ పంచాయతీ భవనానికి 20లక్షలు, రంగరాయగూడెం నుండి కాషాగూడెం వరకు రోడ్డు నిర్మాణానికి అతి త్వరలోనే మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. ఇందిరమ్మ ఇండ్ల మంజూరులో సైతం అధిక



ప్రాధాన్యత ఇస్తానని తెలిపారు. మొదటి విడతలో 19 ఇందిరమ్మ ఇండ్లుమంజూరు చేశానని, ప్రస్తుతం మరో 8మందికి మంజూరు పత్రాలు పంపిణి చేసినట్లు పేర్కొన్నారు. ఇప్పగూడెం గ్రామం రాజకీయ చైతన్యం కలిగిన గ్రామం అని తెలిపారు. గ్రామ అభివృద్ధికి గ్రామ ప్రజల సహకారంతో అభివృద్ధి పనులు చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పగూడెం గ్రామానికి మొదటి విడతలో 54ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసినట్లు, ఇప్పుడు మళ్ళీ 49మందికి మంజూరు పత్రాలను పంపిణి చేస్తున్నట్లు వెల్లడించారు. ఎమ్మెల్యేగా ఎన్నికైన ఈ రెండున్నర ఏళ్ల కాలంలో 4కోట్ల 70లక్షలతో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం, కోటి 10లక్షలతో సిసి రోడ్లు, కోటి 23లక్షల కుడా నిధులతో మరో సిసి రోడ్డు నిర్మాణం మొత్తం దాదాపు 7కోట్ల అభివృద్ధి పనులను ఒక్క ఇప్పగూడెం గ్రామంలోనే చేపట్టినట్లు తెలిపారు. రానున్న రెండేళ్లలో మరో 5కోట్ల నిధులు ఇప్పగూడెం గ్రామ అభివృద్ధికి కేటాయిస్తానని హామీ ఇచ్చారు. నెల రోజుల్లో ముదిరాజ్, ఎస్సి కమ్యూనిటీ హాళ్లకు మంజూరు చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ లు జూలుకుంట్ల శిరీష్ రెడ్డి, మందపురం రాణి అనిల్, మార్కెట్ కమిటీ చైర్మన్ లావణ్య శిరీష్ రెడ్డి, పంచాయతీ రాజ్, హౌసింగ్ శాఖ అధికారులు, ఇతర ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# ఇన్వెస్ట్మెంట్ డెస్టినేషన్ సెంటర్" గా మార్చేందుకు కృషి

**- జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి**



వై ఎస్ ఆర్ కడప,జూన్ 17(భారత శక్తి ): జిల్లాను "ఇన్వెస్ట్మెంట్ డెస్టినేషన్ సెంటర్" గా మార్చేందుకు కృషి చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి జిల్లా ఇంచార్జి మంత్రి సవిత కు వివరించారు. బుధవారం కలెక్టరేట్లో పీజిఆర్ఎస్ హాల్ నందు డిఆర్ సి సమావేశం అనంతరం కలెక్టరేట్లో "ఇన్వెస్ట్ కడప సెంటర్" ను ఏర్పాటు పనులను మంత్రి తో కలెక్టర్ పరిశీలించి జిల్లాలో పెట్టుబడులకు ముందుకొచ్చే ఇన్వెస్టర్లకు ప్రత్యేకమైన సూచనలు, సలహాలు, మార్గదర్శకాలను అందిస్తూ పెట్టుబడుల ప్రారంభం నుండి ఆదాయాన్ని పొందేవరకు కూడా ఒక జిల్లా స్థాయి అధికారి పర్యవేక్షణలో ముందుకు సాగనున్నట్లు మంత్రి కి వివరించారు.

# ప్రత్యేక ఓటర్ జాబితా సవరణకు రాజకీయ నాయకులు సహకరించాలి

**-జిల్లా కలెక్టర్ - తేజస్ నంద్ లాల్ పవార్**




సూర్యాపేట (భారత శక్తి ప్రతినిధి) జూన్ 17: రాజకీయ పార్టీల ప్రతినిధులు క్షేత్రస్థాయిలో బీఎల్ఓలతో సమన్వయం చేసుకుంటూ, ఓటర్ల జాబితా ప్రక్షాళన విజయవంతం అయ్యేలా సహకరించాలని కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ కోరారు. బుధవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ పై సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ పారదర్శకంగా నిర్వహించేందుకు అధికారులకు రాజకీయ నాయకులు సహకరించాలని కోరారు. జూన్ 18న బూత్ లెవెల్ అధికారులు, అసెంబ్లీ నియోజకవర్గ స్థాయి అధికారులకు క్షేత్రస్థాయి సన్నాహక శిక్షణ ఇస్తారని వివరించారు. జూన్ 25 - జూలై 24వరకు బీఎల్ఓలు ప్రతి ఇంటికీ తిరిగి ఎన్యుమరేషన్ ఫారాలను పంపిణీ చేసి వివరాలను సేకరిస్తారని, 2002 ఓటర్ల జాబితా ఆధారంగా కుటుంబ సభ్యుల వివరాలను ఇందులో నమోదు చేయాల్సి ఉంటుందని తెలిపారు. జూలై 24 - 30వరకు ప్రతి పోలింగ్ కేంద్రంలో గరిష్టంగా 1,200 మంది ఓటర్లు ఉండేలా పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ ప్రక్రియ చేపడతారన్నారు. ఓటర్ల ముసాయిదా జులై 31న జాబితా ప్రచురించి, అభ్యంతరాల స్వీకరణ అనంతరం అక్టోబర్ 1న తుది ఓటర్ల జాబితాను అధికారికంగా విడుదల చేస్తారని అన్నారు. ఎవరైనా తప్పు సమాచారం ఇస్తే నేరుగా పేరు తొలగించకుండా, ముసాయిదా జాబితా తర్వాత నోటీసు ఇచ్చి, విచారణ జరిపి చర్యలు తీసుకుంటారని పేర్కొన్నారు. వలస వెళ్లిన వారు, మరణించిన వారు, మరియు డూప్లికేట్ ఓటర్లను గుర్తించి జాబితా నుండి తొలగించడం జరుగుతుందని స్పష్టం చేశారు. ప్రజాప్రాతినిధ్య చట్టం, 1950 లోని సెక్షన్ 31 ప్రకారం, ఓటర్ల జాబితాలో పేరు నమోదు కోసం ఉద్దేశపూర్వకంగా తప్పుడు సమాచారం లేదా తప్పుడు డిక్లరేషన్ ఇస్తే ఒక సంవత్సరం జైలు శిక్ష, జరిమానా లేదా రెండు విధించే అవకాశం ఉందని తెలిపారు.ప్రస్తుత జాబితాలో పేరు లేని కొత్త ఓటర్లు తప్పనిసరిగా ఫామ్-6 ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఓటర్ల జాబితా ప్రచురణ తేదీ అయిన 01-10-2026 నాటికి 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవడానికి అర్హులని వెల్లడించారు. ఒక ప్రాంతం నుండి మరో ప్రాంతానికి మారిన వారు ఫామ్-8 ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.కార్యక్రమం లో అదనపు కలెక్టర్ బి. హరిసింగ్, జిల్లా రెవిన్యూ అధికారి డి. ప్రేమ్ రాజ్, రాజేశ్వర్ రావు, అంజాద్, ఐ ఎన్ సి, కరుణాకర్ రెడ్డి, సత్యనారాయణ బిఆర్ఎస్, బి జె పి అభిద్, గోపి సి పి ఐ (ఎం) స్టాలిన్ బి ఎస్ పి తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాలల్లో ఆధార్ నమోదు కేంద్రాలు ఏర్పాటు




బూర్గంపహాడ్, జూన్ 17 (భారతశక్తి): జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలు పునఃప్రారంభం కావడంతో మండలంలో ఆయా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ఆధార్ నమోదు కేంద్రాలను ఏర్పాటు చేయడం జరుగుతుందని బూర్గంపహాడ్ మండల ఎంఈవో యదుసింహరాజు తెలిపారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం ఆధారనమోదు కేంద్రం ఏర్పాటు చేశామని ఈ నమోదు కేంద్రాలను విద్యార్థులు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎంఈఓ యదసింహారాజు ఆదేశాల మేరకు ఎంఐఎస్ కోఆర్డినేటర్ కిషన్ ఆధార్ కేంద్రాన్ని సందర్శించారు. కాగా జిల్లా వ్యాప్తంగా 34 ఆధార్ నమోదు కేంద్రాలు ఉన్నాయని.. ప్రతి మండలంలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో వీటిని సద్వినియోగం చేసుకోవచ్చన్నారు. ఆధార్ నమోదు కేంద్రంలో డెమోగ్రఫిక్, బయోమెట్రిక్, మ్యాండటరీ బయోమెట్రిక్, న్యూ ఎన్రోల్మెంట్( కొత్త ఆధార్), పుట్టిన తేదీ, పేరు, అడ్రస్ మార్పు సేవలు అందుబాటులో ఉంటాయని, 5 ఏళ్లు, 15 ఏళు దాటిన పిల్లలు, పెద్దలు వేలిముద్రలు ద్వారా అప్డేట్ ఖచ్చితంగా చేసుకోవాలని సూచించారు.

# నకిలీ విత్తన వ్యాపారులపై పోలీసుల ఉక్కుపాదం




మంచిర్యాల ప్రతినిధి, జూన్ 17( భారత శక్తి):రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని మంచిర్యాల జిల్లా తాండూర్,భీమారం పోలీస్ స్టేషన్ల పరిధిలోని గ్రామాలకు నకిలీ పత్తి విత్తనాలను సరఫరా చేస్తున్న విక్రేతపై బుధవారం పీడీ చట్టాన్ని అమలు చేసినట్లు రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఒక ప్రకటనలో తెలిపారు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ప్రకాశం జిల్లా గిద్దలూరు గ్రామానికి చెందిన వూస సుబ్బారావు రామగుండం కమిషనరేట్ పరిధిలోని తాండూర్, భీమిని,భీమారం, బెల్లంపల్లి-2 టౌన్, తాళ్లగురిజాల, నెన్నెల,చెన్నూర్ మండలాల్లో ఏజెంట్లను నియమించుకుని నకిలీ పత్తి విత్తనాలను విక్రయిస్తున్నట్లు పేర్కొన్నారు.ఈ ఏడాదిలో వూస సుబ్బారావుపై రెండు కేసులు నమోదైనట్లు తెలిపారు.సులభంగా డబ్బు సంపాదించేందుకు అక్రమ మార్గాలను అనుసరిస్తున్నట్లు వెల్లడించారు.తాండూర్ సీఐ దేవయ్య,ఎస్ఐ ప్రసాద్ నిందితుడికి పీడీ ఉత్తర్వులను అందజేసి చర్లపల్లి కేంద్ర కారాగారానికి తరలించారు.సీపీ మాట్లాడుతూ,వూస సుబ్బారావు 2021 నుంచి 2025 వరకు గత ఐదు సంవత్సరాలుగా నకిలీ పత్తి విత్తనాల రవాణా,నిల్వ, విక్రయాలకు సంబంధించిన అనేక క్రిమినల్ కేసుల్లో పాలుపంచుకున్నాడని తెలిపారు. నిందితునిపై 10-06-2021న పీడీ చట్టం అమలు చేయగా, దానిని ప్రభుత్వం ధృవీకరించిందని పేర్కొన్నారు.పీడీ చట్టం అమలైన తర్వాత కూడా తన వైఖరిని మార్చుకోకుండా అదే తరహా నేరాలకు పాల్పడుతూ రామగుండం పోలీస్ కమిషనరేట్, మంచిర్యాల జిల్లా, కొమురంభీం-ఆసిఫాబాద్ జిల్లా పరిధిలో మొత్తం తొమ్మిది కేసుల్లో నిందితుడిగా ఉన్నాడని తెలిపారు.రామగుండం పోలీస్ కమిషనరేట్, కొమురంభీం-ఆసిఫాబాద్ జిల్లా పరిధిలోని అమాయక రైతులను నకిలీ పత్తి విత్తనాలను అసలు విత్తనాలుగా నమ్మించి మోసం చేస్తున్నాడని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ నుంచి నకిలీ విత్తనాలను తీసుకువచ్చి రైతులను మోసం చేస్తున్నాడని తెలిపారు.ఏడాది వ్యవధిలో రెండుసార్లు పట్టుబడినట్లు వివరించారు.నకిలీ విత్తనాల అక్రమ వ్యాపారం చేస్తూ చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులు తమ ప్రవర్తనను మార్చుకోకుండా కొనసాగితే ఎంతటి వారినైనా ఉపేక్షించబోమని, వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, అవసరమైతే పీడీ చట్టాన్ని అమలు చేస్తామని హెచ్చరించారు.నకిలీ విత్తనాల తయారీ, అక్రమ సరఫరాకు పాల్పడిన నేరస్తుడిపై పీడీ చట్టం అమలుకు కృషి చేసిన బెల్లంపల్లి ఏసీపీ కిరణ్ కుమార్, తాండూర్ సీఐ దేవయ్య, ఎస్ఐ ప్రసాద్‌లను సీపీ అభినందించారు.

# కానిస్టేబుల్ కుటుంబానికి చెక్కును అందజేసిన జిల్లా ఎస్పీ రోహిత్ రాజు



భద్రాద్రి జిల్లా బ్యూరో, జూన్ 17 (భారతశక్తి): జిల్లా ఆర్మడ్ రిజర్వ్ విభాగంలో విధులు నిర్వరస్తూ అనారోగ్యంతో ఇటీవల మరణించిన ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ రాజ్ మహమూద్ కుటుంబానికి బుధవారం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు తన కార్యాలయంలో చెక్కు రూపంలో రూ. 1,00,000/- (లక్ష రూపాయల) నగదును అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ శాఖలో నిరంతరం విధులు నిర్వర్తించే అధికారులు, సిబ్బంది తమ ఆరోగ్యాల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. మరణించిన పోలీసుల కుటుంబాలకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని ఎస్పీ తెలిపారు. ప్రభుత్వం తరఫున మరణించిన పోలీసు అధికారుల కుటుంబాలకు అందవలసిన అన్ని రకాల ప్రతిఫలాలను త్వరితగతిన అందేలా చర్యలు చేపట్టాలని జిల్లా పోలీస్ కార్యాలయ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యాలయ ఏవో మంజ్యా నాయక్, పోలీస్ అధికారుల సంఘం సభ్యుడు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

# అన్ని రంగాల్లో జిల్లాను అగ్రస్థానంలో నిలపాలి

**-జిల్లా ఇన్చార్జి మంత్రి ఆ రాష్ట్ర వెనుకబడిన తరగతులు,బలహీన వర్గాల సంక్షేమ శాఖ, చేనేత జౌళి శాఖామంత్రి శ్రీమతి ఎస్.సవిత**

**-జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి ఆధ్వర్యంలో జరిగిన జిల్లా స్థాయి సమీక్షా కమిటీ సమావేశంలో పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు.**




వై ఎస్ ఆర్ కడప,జూన్ 17(భారత శక్తి ప్రతినిధి ) : రాష్ట్ర ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా అభివృద్ధి సాధనతో పాటు జిల్లాను అన్ని రంగాల్లో అగ్రస్థానంలో నిలిపేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయం తో, సమిష్టిగా పాటుపడాలని జిల్లా ఇన్చార్జి మంత్రి మరియు రాష్ట్ర వెనుకబడిన తరగతులు,బలహీన వర్గాల సంక్షేమ శాఖ, చేనేత జౌళి శాఖామంత్రి,జిల్లా ఇన్చార్జి మంత్రి ఎస్.సవిత అన్నారు.బుధవారం స్థానిక కలెక్టరేట్ లోని పిజిఆర్ఎస్ హాలులో జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి ఆధ్వర్యంలో రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ, చేనేత జౌళి శాఖామంత్రి, జిల్లా ఇన్చార్జి మంత్రి ఎస్.సవిత అధ్యక్షతన అన్ని శాఖల అధికారులతో జిల్లా స్థాయి సమీక్షా కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో జిల్లా ఇన్చార్జి మంత్రి సవిత మాట్లాడుతూ ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారసులుగా ఉన్న అధికారులు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న పథకాలు, కార్యక్రమాలను ప్రజల్లోకి పూర్తిస్థాయిలో అందేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రంలో అన్ని రంగాల్లో అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్న రాష్ట్రముఖ్యమంత్రి రాష్ట్రంలో పేదరికాన్ని సమూలంగా తుడిచి పెట్టే లక్ష్యంతో అనేక అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేయాలన్నారు. జిల్లా లో అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందాలన్నారు.అందుకు అనుగుణంగా అధికారులు క్షేత్రస్థాయిలోబాధ్యతాయుతంగా కృషి చేయాలన్నారు. పారదర్శకత, అవినీతి రహిత పాలనే లక్ష్యంగా నడుస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గత ప్రభుత్వంలో జరిగిన అక్రమాలపై ప్రక్షాళన చేస్తున్నారన్నారు. ప్రజలకు ఒక జవాబుదారీతనంతో సుపరిపాలన అందిస్తూ స్వర్ణాంధ్ర ప్రదేశ్ లక్ష్య సాధన కు కృషి చేస్తున్నారన్నారు. ప్రభుత్వ ఆశయ సాధనలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని కోరారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఒకవైపు సంక్షేమ పథకాలను సంతృప్తి స్థాయిలో ప్రజలకు అందిస్తూనే రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించడం జరుగుతోందన్నారు. ప్రజాస్వామ్య బద్ధంగా ప్రజల కోసం ప్రభుత్వం పని చేస్తోందని..జిల్లా సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా ప్రజా ప్రతినిధులు,అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు.రెండేళ్ల సుపరిపాలనలో అభివృద్ధి,సంక్షేమం, ప్రజలకు పారదర్శక పాలన ను అందించడమే ప్రధాన లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వెళుతోంది. భవిష్యత్తులో కూడా ముఖ్యమంత్రి ఆలోచనా విధానాన్ని అందుకుని స్వర్ణాంధ్ర 2047 విజన్ సాకారం దిశగా వైఎస్ఆర్ కడప జిల్లాను అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు అధికారులు,ప్రజాప్రతినిధులు సమన్వయంతో కృషి చేద్దామన్నారు. రాష్ట్రాభివృద్ధికి ముఖ్యమంత్రి ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న కార్యక్రమాలను జిల్లా స్థాయి లో సక్రమంగా,విజయవంతం గా అమలు చేయడం అధికారుల బాధ్యత అన్నారు.ప్రభుత్వంలో భాగస్వాములైన జిల్లా కలెక్టర్ నుంచి అధికారులు, ఎమ్మెల్సీలు,ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు అందరూ జిల్లా అభివృద్ధిలో భాగస్వాములై అర్హులైన వారందరికీ సంక్షేమ ఫలాలు అందేలా కృషి చేయాలి.ప్రజా ప్రతినిధులు,అధికారులు ఇరువురూ సమన్వయంతో పనిచేసి పారదర్శకంగా సంక్షేమ కార్యక్రమాలు అందించాలన్నారు.

**ప్రస్తుతం జరుగుతున్న ఎస్.ఐ.ఆర్. కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ బాధ్యతా యుతంగా స్వీకరించి వారి వివరాలను నమోదు చేయాలన్నారు.**

స్వర్ణాంధ్ర--2047 లక్ష్యాల సాధనలో భాగంగా జిల్లాలో అమలు చేస్తున్న 10 సూత్రాల పురోగతిని, వైఎస్సార్ కడప జిల్లాలో ప్రాధాన్యతా రంగాల వారీగా అమలవుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, సాధించిన పురోగతి, భవిష్యత్ లక్ష్యాలు, పెట్టుబడులు, ఉపాధి అవకాశాలపై జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా జిల్లా ఇన్చార్జి మంత్రి సవితకు క్షుణ్ణంగా వివరించారు. 2025-26 ప్రాథమిక అంచనాల ప్రకారం జిల్లా స్థూల జిల్లా ఉత్పత్తి విలువ (+ణఖా) రూ.79,627 కోట్లు కాగా, రాష్ట్రంలో 8వ స్థానంలో ఉందని కలెక్టర్ వివరించారు. జిల్లా స్థూల విలువ జోడింపు (+వాా) రూ.73,405 కోట్లు నమోదైందన్నారు. జిల్లాలో తలసరి ఆదాయం రూ.2,83,734 ఉండగా, రాష్ట్రంలో 12వ స్థానంలో ఉన్నట్లు తెలిపారు.ఆర్థిక వ్యవస్థలో సేవారంగం అత్యధికంగా రూ.28,212 కోట్లతో 38.43 శాతం, పరిశ్రమల రంగం రూ.23,830 కోట్లతో 32.46 శాతం, వ్యవసాయ మరియు అనుబంధ రంగాలు రూ.21,363 కోట్లతో 29 శాతం వాటా కలిగి ఉన్నాయని మంత్రి దృష్టికి తీసుకువచ్చారు.జిల్లాలో పరిశ్రమలు, సేవారంగం, వ్యవసాయ రంగాలు సమతుల్యంగా అభివృద్ధి చెందుతున్నాయని పేర్కొన్నారు.స్వర్ణాంధ్ర--2047 విజన్ కింద జిల్లాను మరింత వేగంగా అభివృద్ధి చేసేందుకు ప్రణాళిక రూపొందించినట్లు కలెక్టర్ తెలిపారు.ప్రస్తుతం రూ.79 వేల కోట్ల స్థాయిలో ఉన్న జిల్లా ఆర్థిక వ్యవస్థను 2047 నాటికి రూ.13.26 లక్షల కోట్ల ఆర్థిక వ్యవస్థగా మార్చడమే లక్ష్యమన్నారు. అలాగే ప్రస్తుతం రూ.2.83 లక్షలుగా ఉన్న తలసరి ఆదాయాన్ని వ్యవసాయం, పరిశ్రమలు, సేవారంగాల ద్వారా 15 శాతానికి పైగా వార్షిక వృద్ధితో రూ.34 లక్షలకు పెంచే లక్ష్యంతో పని చేస్తున్నట్లు వివరించారు. 2026-27 సంవత్సరానికి జిల్లా మొత్తం +వాా లక్ష్యం రూ.84,482 కోట్లు, +ణఖా లక్ష్యం రూ.91,606 కోట్లుగా నిర్ణయించినట్లు తెలిపారు. ఇందులో వ్యవసాయ, అనుబంధ రంగాల ద్వారా రూ.23,908 కోట్లు, పరిశ్రమల ద్వారా రూ.27,821 కోట్లు, సేవారంగం ద్వారా రూ.32,753 కోట్లు సాధించేందుకు కార్యాచరణ అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. మహిళా సాధికారత లో 29,224 స్వయం సహాయక సంఘాలు, 2.86 లక్షల మహిళా సభ్యులు, రూ.2,355.90 కోట్ల జీవనోపాధి ప్రణాళిక, రూ.1,323.29 కోట్ల రుణ ప్రణాళిక అమలవుతున్నట్లు తెలిపారు.మత్స్యరంగంలో రూ.300.25 లక్షల సబ్సిడీ, 511 లైసెన్సులు, 538 పెన్షన్ లబ్ధిదారులు, పట్టణాభివృద్ధిలో రూ.52.78 కోట్లతో 520 టన్నుల సామర్థ్య మౌలిక వసతుల నిర్మాణం కొనసాగుతున్నట్లు వివరించారు.జిల్లా ఆర్థిక వృద్ధి లో ప్రధానంగా ఉద్యానవనం, గనులు, తయారీ పరిశ్రమలు, నిర్మాణ రంగం, రవాణా, రియల్ ఎస్టేట్, సేవారంగం కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. ముఖ్యంగా జేఎస్‌డబ్ల్యూ ఉక్కు పరిశ్రమ, స్టార్టప్ కడప, పారిశ్రామిక పార్కులు, ఉద్యాన పంటల ఎగుమతులు,నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు భవిష్యత్‌లో జిల్లా ఆర్థిక వ్యవస్థను మరింత బలోపేతం చేయనున్నాయన్నారు.ఈ విధంగా పోషకాహారం, వ్యవసాయం,జల సంరక్షణ, పరిశ్రమలు, పెట్టుబడులు, స్టార్టప్‌లు, మహిళా సాధికారత, ఉపాధి, మత్స్యరంగం, మౌలిక వసతుల అభివృద్ధి వంటి 10 సూత్రాల అమలులో జిల్లా రాష్ట్రంలో ముందంజలో ఉందని కలెక్టర్ మంత్రి దృష్టికి తీసుకువచ్చారు.జిల్లాను "ఇన్వెస్ట్మెంట్ డెస్టినేషన్ సెంటర్" గాలి మార్చేందుకు కృషి చేస్తున్నామన్నారు. అందులో భాగంగానే కడప కలెక్టరేట్లో "ఇన్వెస్ట్ కడప సెంటర్" ను ఏర్పాటు చేసి జిల్లాలో పెట్టుబడులకు ముందుకొచ్చే ఇన్వెస్టర్లకు ప్రత్యేకమైన సూచనలు, సలహాలు, మార్గదర్శకాలను అందిస్తూ పెట్టుబడుల ప్రారంభం నుండి ఆదాయాన్ని పొందేవరకు కూడా ఒక జిల్లా స్థాయి అధికారి పర్యవేక్షణలో ముందుకు సాగనుందన్నారు. స్మార్ట్ కిచెన్ వ్యవస్థలి ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పరిశుభ్రమైన, పోషకాహార భోజనం అందించేందుకు జిల్లాలో అమలు చేస్తున్న స్మార్ట్ కిచెన్ వ్యవస్థ గురించి మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ప్రస్తుతం 5 స్మార్ట్ కిచెన్లు పనిచేస్తుండగా, మరో 33 కిచెన్లు ఏర్పాటు చేసి మొత్తం 38 కిచెన్ల ద్వారా జిల్లాలోని 1,778 పాఠశాలలు, కళాశాలలకు చెందిన 1,00,091 మంది విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించే ప్రణాళికను వివరించారు. ఇందుకోసం 95 వాహనాలు, 112 డెలివరీ మార్గాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. స్టార్టప్ కడప -- ఎంటర్‌ప్రెన్యూర్ సెంటర్ జిల్లాలో యువతకు ఉపాధి, స్వయం ఉపాధి అవకాశాలు కల్పించేందుకు నిర్మిస్తున్న 'స్టార్టప్ కడప' ఎంటర్‌ప్రెన్యూర్ సెంటర్ పనులు తుది దశకు చేరుకున్నాయని కలెక్టర్ తెలిపారు. 30 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మితమవుతున్న ఈ కేంద్రం ద్వారా 50కి పైగా స్టార్టప్ సంస్థలకు ప్రోత్సాహం లభించడంతో పాటు రూ.500 కోట్లకు పైగా పెట్టుబడులు ఆకర్షించేందుకు, 500 మందికి పైగా ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి అవకాశాలు కల్పించేందుకు లక్ష్యంగా పెట్టుకున్నట్లు వివరించారు. జూన్ 2026 నాటికి కేంద్రం ప్రారంభానికి సిద్ధమవుతోందని పేర్కొన్నారు. 2026-27 సంవత్సరానికి వ్యవసాయ, అనుబంధ రంగాల్లో రూ.23,908 కోట్ల స్థూల విలువ జోడింపు (+వాా) సాధించే లక్ష్యంతో కార్యాచరణ అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఖరీఫ్-2026 సీజన్‌కు జిల్లాలో 76,496 హెక్టార్లలో పంటల సాగు లక్ష్యంగా నిర్ణయించగా ఇప్పటికే 4,908 హెక్టార్లలో విత్తనాలు వేశారని కలెక్టర్ వివరించారు. రైతులకు యాంత్రీకరణ పరికరాల పంపిణీ, సబ్సిడీ విత్తనాల సరఫరా, ప్రకృతి వ్యవసాయం, పంటల బీమా, అన్నదాత సుఖీభవ--పీఎం కిసాన్ పథకాల అమలు పురోగతిని వివరించారు. జిల్లాలో 1.94 లక్షల మంది రైతులకు రూ.388 కోట్లకు పైగా ఆర్థిక సాయం అందించినట్లు తెలిపారు.ఉద్యానవన రంగం జిల్లాలో 70,888 హెక్టార్లలో ఉద్యాన పంటలు సాగవుతున్నాయని, సీతాఫలం, అరటి, మామిడి, నిమ్మ, దానిమ్మ,ఉల్లి, టమాట తదితర పంటల ద్వారా సంవత్సరానికి 23 లక్షల మెట్రిక్ టన్నులకు పైగా ఉత్పత్తి లభిస్తున్నట్లు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. వీ×ణఎ, =ఖవ్ పథకాల ద్వారా రూ.1,617 కోట్ల లక్ష్యంతో తోటల అభివృద్ధి, నీటి వనరుల సృష్టి, యాంత్రీకరణ, మార్కెటింగ్ మౌలిక వసతుల అభివృద్ధి చేపడుతున్నట్లు తెలిపారు. సూక్ష్మ సాగునీటి పథకాలు, అధిక విలువ కలిగిన పంటల ప్రోత్సాహం, పంటల విస్తరణ ద్వారా రైతుల ఆదాయాన్ని పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు.

పశుసంవర్ధక, పాల ఉత్పత్తి, మత్స్యరంగాల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. రైతులకు సబ్సిడీ పరికరాలు, నాణ్యమైన విత్తనాలు, పంటల బీమా, ప్రకృతి వ్యవసాయం, రైతు భరోసా--పీఎం కిసాన్ వంటి పథకాల ద్వారా ఆర్థిక భద్రత కల్పిస్తున్నట్లు తెలిపారు.సాగునీటి వనరులు జిల్లా లోని గండికోట, పైడిపాలెం, వెలిగల్లు, మైలవరం, చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ తదితర ప్రధాన ప్రాజెక్టుల్లో ప్రస్తుతం 47.18 టీఎంసీల నీటి నిల్వలు ఉన్నాయని కలెక్టర్ వివరించారు. రైతులకు సాగునీరు అందించేందుకు వివిధ కాలువల ద్వారా నీటి విడుదల షెడ్యూల్ సిద్ధం చేసినట్లు తెలిపారు.పరిశ్రమలు -- పెట్టుబడులు జిల్లాలో పారిశ్రామికాభివృద్ధికి అనుకూల వాతావరణం కల్పిస్తూ కొత్త పరిశ్రమల స్థాపన, పెట్టుబడుల ఆకర్షణ, యువ పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహం అందిస్తున్నట్లు తెలిపారు. తయారీ రంగం, మైనింగ్, నిర్మాణ రంగాల ద్వారా జిల్లాలో పరిశ్రమల వాటా రూ.27,821 కోట్లకు చేరిందని వివరించారు.నైపుణ్యాభివృద్ధి -- ఉపాధి యువతకు మార్కెట్ అవసరాలకు అనుగుణంగా నైపుణ్య శిక్షణలు అందిస్తూ ఉద్యోగ అవకాశాలు పెంచేందుకు ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. స్టార్టప్ కడప, పరిశ్రమల అనుసంధానం, నైపుణ్యాభివృద్ధి కేంద్రాల ద్వారా స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంపై దృష్టి సారించినట్లు చెప్పారు.గ్రామీణాభివృద్ధి -- సంక్షేమం డ్వామా, డీఆర్‌డీఏ, మెప్మా, ఉపాధి హామీ పథకం, సామాజిక భద్రతా పింఛన్లు, మహిళా సాధికారత కార్యక్రమాల అమలు పురోగతిని మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. అర్హులైన లబ్ధిదారులకు సంక్షేమ పథకాల ప్రయోజనాలు పారదర్శకంగా అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.విద్య -- వైద్యం పాఠశాలల మౌలిక వసతుల అభివృద్ధి, కొత్త భవనాల నిర్మాణం, ప్రహరీ గోడలు, అదనపు తరగతి గదుల ఏర్పాటు, సమగ్ర శిక్ష కార్యక్రమాల పురోగతిని వివరించారు. అలాగే ప్రొద్దుటూరు జిల్లా ఆసుపత్రి నిర్మాణం, వైద్య సేవల విస్తరణ, ఆరోగ్య రంగంలో చేపడుతున్న కార్యక్రమాలపై మంత్రి సమీక్షకు నివేదిక సమర్పించారు.ఆర్అండ్‌బీ శాఖ పరిధిలో వివిధ రహదారుల విస్తరణ, బలోపేతం, వంతెనల నిర్మాణ పనులు పురోగతిలో ఉన్నాయన్నారు. జాతీయ రహదారి--67 (కడప--రాయచోటి--చెన్నై కారిడార్), ఎన్‌హెచ్--40 (కర్నూలు--కడప--చిత్తూరు మార్గం), ఎన్‌హెచ్--340 రహదారుల విస్తరణ, ఫోర్‌లేనింగ్, భూసేకరణ పనులు వేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు. జిల్లాలో రహదారుల అభివృద్ధికి సంబంధించిన పలు ప్రాజెక్టులపై రూ.1,000 కోట్లకు పైగా విలువైన పనులు వివిధ దశల్లో ఉన్నాయని, వీటివల్ల పారిశ్రామిక రవాణా, వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్, ప్రయాణ సౌకర్యాలు మరింత మెరుగుపడనున్నాయని వివరించారు.అలాగే జిల్లాలోని ప్రధాన రహదారుల ద్వారా జేఎస్‌డబ్ల్యూ ఉక్కు పరిశ్రమ, పారిశ్రామిక పార్కులు, వ్యవసాయ మార్కెట్లు జాతీయ రహదారులతో అనుసంధానమవుతున్నాయని,దీంతో పెట్టుబడులు, ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు లాజిస్టిక్స్ ఖర్చులు తగ్గనున్నాయన్నారు. గ్రామీణ నీటిసరఫరా వ్యవస్థ ద్వారా.. జిల్లాలో మొత్తం 2,666 గ్రామీణ ఆవాసాలు, 617 గ్రామ పంచాయతీలు, 3,477 పీడబ్ల్యూఎస్/ఎంపీడబ్ల్యూఎస్ పథకాలు, 18 సీపీడబ్ల్యూఎస్ పథకాలు, 8,094 హ్యాండ్ పంపులు ద్వారా తాగునీటి సరఫరా జరుగుతోందని తెలిపారు. నీటి ఎద్దడి ప్రాంతాలకు ప్రత్యేకంగా 193 తాగునీటి పనులు రూ.73.77 కోట్ల అంచనా వ్యయంతో మంజూరయ్యాయని, టెండర్ల ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు. వీటిలో అత్యధికంగా రాజంపేట నియోజకవర్గంలో 103 పనులు రూ.33.25 కోట్లతో, జమ్మలమడుగులో 44 పనులు రూ.20.42 కోట్లతో చేపడుతున్నట్లు వివరించారు. అలాగే పులివెందుల నియోజకవర్గానికి రూ.480 కోట్లతో వాటర్ గ్రిడ్ ప్రాజెక్టు అమలవుతుండగా, మొత్తం 227 నీటి నిల్వ నిర్మాణాల్లో 213 పూర్తయ్యాయి. దాదాపు 1,169 కిలోమీటర్ల పైప్‌లైన్ పనుల్లో 1,089 కిలోమీటర్లకు పైగా పూర్తయ్యాయి. జిల్లాలో ప్రజాపంపిణీ వ్యవస్థ (ాణఖా)ను సమర్థవంతంగా అమలు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి మంత్రి సవితకు వివరించారు. జిల్లాలో మొత్తం 1,379 ఫెయిర్ ప్రైస్ షాపులు ఉండగా, వీటిలో 1,338 ఆన్‌లైన్ షాపులు పనిచేస్తున్నాయి. జిల్లాలో 6,59,288 బీపీఎల్ రైస్ కార్డులు, అందులో 6,18,560 పీహెచ్‌హెచ్ కార్డులు, 40,728 అంత్యోదయ అన్న యోజన (ూూఫ్) కార్డులు ఉన్నాయని తెలిపారు. అలాగే 14 ఎంఎల్ఎస్ పాయింట్లు, 59 గ్యాస్ ఏజెన్సీలు, 215 పెట్రోల్ బంకులు సేవలు అందిస్తున్నట్లు వివరించారు.రీ సర్వే కి సంబంధించి జిల్లాలో మొత్తం 802 గ్రామాలు ఉండగా, మున్సిపాలిటీల్లో విలీనమైన 53 గ్రామాలు, జలాశయాల్లో మునిగిన 39 గ్రామాలను మినహాయించి 710 గ్రామాలు రీసర్వేకు అనుకూలంగా గుర్తించారు. వీటిలో ఇప్పటికే 379 గ్రామాల్లో రీసర్వే పూర్తికాగా, మరో 202 గ్రామాల్లో పనులు కొనసాగుతున్నాయి. మిగిలిన 129 గ్రామాల్లో రీసర్వే పూర్తి చేయాల్సి ఉంది. రీసర్వే ద్వారా జిల్లాలో మొత్తం 41.18 లక్షల సర్వే నంబర్లలో 41.00 లక్షలకుపైగా సర్వే రికార్డులు ధృవీకరణ పూర్తి కాగా, వేలాది మంది రైతులకు డిజిటల్ భూ రికార్డులు, నవీకరించిన సరిహద్దు వివరాలు అందుబాటులోకి వచ్చాయని వివరించారు. భూ వివాదాల పరిష్కారం, ఖచ్చితమైన భూ హక్కుల నమోదు, నూతన పట్టాదారు పాస్ పుస్తకాల జారీ ప్రక్రియను వేగవంతం చేస్తున్నట్లు తెలిపారు.

గృహ నిర్మాణ శాఖకు సంబంధించి గ్రామీణ ప్రాంతాల్లో మొత్తం 98,374 ఇళ్లకు అనుమతులు మంజూరు చేయగా, 50,352 ఇళ్లు పూర్తయ్యాయి. మరో 48,022 ఇళ్లు వివిధ దశల్లో నిర్మాణంలో ఉండగా, మొత్తం పురోగతి 49 శాతంగా నమోదైంది. ఇందుకోసం ఇప్పటివరకు రూ.1,328.92 కోట్లు వ్యయం చేసినట్లు తెలిపారు. అలాగే పీఎంఏవై (అర్బన్) 2.0 కింద జిల్లాలోని పట్టణ ప్రాంతాల్లో 1,918 ఇళ్లకు అనుమతులు మంజూరు చేయగా, 1,784 ఇళ్లు గ్రౌండింగ్ దశకు చేరుకున్నాయి. వీటిలో 1,223 ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభమై 68.6 శాతం పురోగతి సాధించాయి. ఇప్పటివరకు రూ.480.5 లక్షలు లబ్ధిదారులకు చెల్లించినట్లు కలెక్టర్ వివరించారుఈ సమీక్షా సమావేశంలో ప్రభుత్వ విప్,జమ్మలమడుగు శాసన సభ్యులు ఆదినారాయణ రెడ్డి,జేసి డా.నిధి మీనా, ఎమ్మెల్సీ రామ్ గోపాల్ రెడ్డి, ప్రొద్దుటూరు, కమలాపురం, మైదుకూరు శాసనసభ్యులు నంద్యాల వరద రాజుల రెడ్డి, పుత్తా కృష్ణ చైతన్య రెడ్డి, పుట్టా సుధాకర్ యాదవ్, రాజంపేట సబ్ కలెక్టర్ భావన,డిఆర్ఓ మల్లికార్జునుడు, జిల్లా స్థాయి అధికారులు, ఆర్డీఓలు, పలు కార్పోరేషన్ ల డైరెక్టర్లు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# కరీంనగర్ జిల్లాలో జర్నలిస్టుల పిల్లలకు 100% ఫీజు రాయితీ

**-జిల్లా విద్యాశాఖ అధికారుల కీలక ఆదేశాలు.**

**-అక్రిడిటెడ్ వర్కింగ్ జర్నలిస్టుల కుటుంబాలకు ఊరట.**

కరీంనగర్, భారత శక్తి ప్రతినిధి, జూన్ 17:కరీంనగర్ జిల్లాలోని అక్రిడిటెడ్ వర్కింగ్ జర్నలిస్టుల పిల్లలకు 2026-27 విద్యా సంవత్సరానికి ప్రైవేట్ గుర్తింపు పొందిన పాఠశాలల్లో 100 శాతం ఫీజు రాయితీ కల్పించాలని జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈఓ) కీలక ఆదేశాలు జారీ చేశారు.తెలంగాణ స్టేట్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఖఔజీ-×జీఖ) కరీంనగర్ జిల్లా అధ్యక్షులు గాండ్ల శ్రీనివాస్ చేసిన వినతిపత్రాన్ని పరిశీలించిన అనంతరం జిల్లా విద్యాశాఖ ఈ నిర్ణయం తీసుకుంది. జర్నలిస్టులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో వారి పిల్లలకు విద్యాభారం తగ్గించే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు.డీఈఓ జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం, కరీంనగర్ జిల్లాలోని అన్ని ప్రైవేట్ గుర్తింపు పొందిన పాఠశాలల యాజమాన్యాలు మానవతా దృక్పథంతో అక్రిడిటెడ్ వర్కింగ్ జర్నలిస్టుల పిల్లలకు 100 శాతం ఫీజు రాయితీ కల్పించాలని సూచించారు.ఈ నిర్ణయం జర్నలిస్టుల కుటుంబాలకు గణనీయమైన ఉపశమనం కలిగించనుందని, విద్యా హక్కు ప్రతి చిన్నారికి అందుబాటులో ఉండాలనే లక్ష్యంతో ఈ చర్యలు తీసుకున్నట్లు అధికారులు తెలిపారు.జిల్లాలోని అన్ని మండల విద్యాశాఖ అధికారులకు కూడా ఈ ఉత్తర్వుల ప్రతులు పంపించగా, అమలుపై తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.జర్నలిస్టుల సంక్షేమం కోసం తీసుకున్న ఈ నిర్ణయాన్ని మీడియా వర్గాలు స్వాగతిస్తున్నాయి.


# ఆరోగ్యంపై అవగాహన, కుష్టు వ్యాధి నిర్మూలన కార్యక్రమాలు అమలు చేయాలి.

**-జిల్లా వైద్య అండ్ ఆరోగ్య అధికారి డా. తుకారాం రాథోడ్**



భద్రాద్రి జిల్లా బ్యూరో, జూన్ 17 (భారతశక్తి): జిల్లా వైద్య అండ్ ఆరోగ్య శాఖ కార్యాలయంలో జిల్లా వైద్యాధికారి అధికారి డా. తుకారాం రాథోడ్ అధ్యక్షతన జిల్లా కుష్టు నిర్మూలన కార్యక్రమాల పైడిపిఎంఓలు (లెప్రసీ) హెల్త్ ఎడ్యుకేటర్ల తో బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు.
ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ మాట్లాడుతూ జిల్లాలో కుష్టు వ్యాధి నిర్మూలన కోసం చేపడుతున్న కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. కుష్టు వ్యాధి అనుమానితులను త్వరితగతిన గుర్తించి పరీక్షలు నిర్వహించి, నిర్ధారణ అయిన వారికి వెంటనే మల్టీ డ్రగ్ థెరపీ చికిత్స ప్రారంభించి పూర్తిస్థాయిలో పూర్తి చేయించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా ప్రతి ఆరోగ్య కేంద్ర పరిధిలో యాక్టివ్ కేస్ సెర్చ్, కాంటాక్ట్ సర్వేలు, ఫాలోఅప్ పర్యవేక్షణను క్రమం తప్పకుండా నిర్వహించాలని తెలిపారు. కుష్టు వ్యాధి పట్ల ప్రజల్లో ఉన్న అపోహలను తొలగిస్తూ అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, వ్యాధి లక్షణాలు కనిపించిన వెంటనే సమీప ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించేలా ప్రజలను చైతన్యపరచాలని హెల్త్ ఎడ్యుకేటర్లకు సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న ఉచిత చికిత్స, వైకల్య నివారణ చర్యలు, స్వీయ సంరక్షణ (సెల్ఫ్ కేర్) పద్ధతులపై విస్తృత ప్రచారం నిర్వహించాలని తెలిపారు. పాఠశాలలు, గ్రామ సభలు, స్వయం సహాయక సంఘాలు, గ్రామ ఆరోగ్య పారిశుద్ధ్య, పోషణ కమిటీ సమావేశాల ద్వారా ఆరోగ్య విద్యను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. అంతేకాకుండా ఐఈసీ, బీసీసీ కార్యక్రమాలను బలోపేతం చేయడం, క్షేత్రస్థాయిలో రికార్డులు, నివేదికలను సకాలంలో నవీకరించడం, నిర్దేశిత లక్ష్యాలను పూర్తిస్థాయిలో సాధించేందుకు సమన్వయంతో పనిచేయాలని అధికారులను ఆదేశించారు. గ్రామాలలో చేతబడి, బాణమతి క్షుద్ర పూజలు, మూఢనమ్మకాలపై ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించి చైతన్యం తీసుకురావాలని ఆరోగ్య విద్యా బోధకులకు ఆదేశించారు. ఈ సమావేశంలో డా. ప్రతాప్ ప్రోగ్రాం ఆఫీసర్, భద్రూ పీజీయోతెరపిస్ట్, మోహన్, శ్రీనివాస్, హెల్త్ ఎడ్యుకేటర్లు జయలక్ష్మి, రమాదేవి ,బేబీ , వినయ్ కుమార్, బద్రు, ప్రతిభ, సంబంధిత జిల్లా ఆరోగ్య శాఖ అధికారులు పాల్గొన్నారు.

# తెలంగాణ బడి వెబ్‌సైట్‌ను ప్రారంభించిన మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్



జగిత్యాల, జూన్ 17 (భారత శక్తి ప్రతినిధి): రాష్ట్ర విద్యార్థులు, ఉపాధ్యాయుల సౌకర్యార్థం డిజిటల్ విద్యా విధానాన్ని ప్రోత్సహించే లక్ష్యంతో రూపొందించిన "తెలంగాణ బడి" విద్యా వెబ్‌సైట్‌ను రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ప్రారంభించారు. తెలంగాణ రాష్ట్ర తెలుగు పాఠ్యాంశాలకు సంబంధించిన డిజిటల్ పాఠాలు, ఫార్మేటివ్ అసెస్‌మెంట్ ప్రశ్నపత్రాలు, ఇంటరాక్టివ్ క్విజ్‌లు, వ్యాకరణ అంశాలను విద్యార్థులకు ఉచితంగా అందుబాటులో ఉంచే ఉద్దేశంతో ఈ వెబ్‌సైట్‌ను రూపొందించారు. ఈ డిజిటల్ వేదికను రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, జగిత్యాల జిల్లా ధర్మపురికి చెందిన తెలుగు ఉపాధ్యాయుడు డాక్టర్ గొల్లపెల్లి గణేష్ రూపొందించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా సాంకేతికతను వినియోగిస్తూ తెలుగు భాషా బోధనలో డాక్టర్ గొల్లపెల్లి గణేష్ చేస్తున్న కృషిని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సంగనభట్ల దినేష్, జిల్లా సంక్షేమ శాఖ అధికారి ఆడెపు భాస్కర్, కాంగ్రెస్ నాయకులు సుముఖ్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా దిగ్రేన్ అండ్ సీడ్స్ మర్చంట్స్ అసోసియేషన్ ప్రమాణ స్వీకారం

**గంజ్ వ్యాపారులకు ఎప్పుడూ అండగా ఉంటా..**

**తాండూరుకు ఆధునిక మార్కెట్ యార్డ్ తీసుకువస్తాం"**

**ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి**




వికారాబాద్ జూన్ 17 భారత శక్తి తాండూరు ది గ్రేన్ అండ్ సీడ్స్ మర్చంట్స్ అసోసియేషన్ 2026-28 నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం ఘనంగా జరిగింది. బుధవారం తాండూరు పట్టణంలోని సల్లా గార్డెన్‌లో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంకు ముఖ్య అతిథిగా స్థానిక ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి హాజరై కార్యవర్గ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. అసోసియేషన్ నూతన అధ్యక్షులుగా కట్కం వీరేందర్, ఉపాధ్యక్షులుగా బానకారి క్రిష్ణ, కార్యదర్శిగా దర్మీది ప్రభు, సహాయ కార్యదర్శులుగా నాగారం జగదీశ్వర్, కోశాధికారిగా సీహెచ్ భోజిరెడ్డి ప్రమాణ స్వీకారం చేసి బాధ్యతలు చేపట్టారు. అలాగే కార్యవర్గం సభ్యులైన ఎన్. జైపాల్ రెడ్డి, కల్వ రాధాకృష్ణ, బంటారం సుధాకర్, చామ్‌కూర్ విశ్వనాథ్, బిక్కుమల్ల శ్రీధర్, రాజేష్ సోని, దీనేష్ సింగ్, మంకాల రవీందర్, టి. బాలేశ్వర్ గుప్త, మల్లేపల్లి మధుసూదన్ లు ప్రమాణం చేశారు. ఈ క్రమంలో నూతన అధ్యక్షులు కట్కం వీరేందర్, కార్యదర్శి దర్మీది ప్రభులు మాట్లాడుతూ.. అసోసియేషన్ అభివృద్ధి కి కృషి చేస్తామని, ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి పనిచేస్తామని తెలిపారు. ఈ సందర్భంగ ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి మాట్లాడుతూ తాండూరు గంజ్ వ్యాపారులతో నాకు మంచి స్నేహం అనుబంధాలు ఉన్నాయని తెలిపారు. వ్యాపారులకు ఎలాంటి సమస్య వచ్చినా పరిష్కారానికి ముందుంటానని హామీ ఇచ్చారు. వ్యాపారుల సౌకర్యార్థం కోసం తాండూరులో ఆధునిక మార్కెట్ యార్డును అందుబాటులోకి తీసుకొనివస్తామని అన్నారు. అనంతరం అసోసియేషన్ సభ్యులు ఎమ్మెల్యే మనోహర్ రెడ్డిని గజమాలతో ఘనంగా సన్మానించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షులు ధారాసింగ్, మున్సిపల్ చైర్‌పర్సన్ పట్లోళ్ల నీరజా బాల్‌రెడ్డి, మాజీ చైర్‌పర్సన్ స్వప్న పరిమళ్, మార్కెట్ కమిటీ చైర్మన్ పట్లోళ్ల నర్సింలు, టీపీసీసీ ప్రచార కార్యదర్శి కరణం పురుషోత్తం రావు, మున్సిపల్ వైస్ చైర్మన్ అబ్దుల్ రజాక్, బీసీ కమిషన్ మాజీ సభ్యులు శుభప్రద్ పటేల్, కౌన్సిలర్లు, అసోసియేషన్ మాజీ సభ్యులు, వ్యాపారులు, ప్రముఖులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# యువత ఆకాంక్షలు

## భారతదేశానికి శాశ్వత ఉపాధి కల్పన ఎందుకు ముఖ్యం?



పేద ఆర్థిక వ్యవస్థలు ఎలా సంపన్న దేశాలుగా మారతాయో వివరించడానికి 1954లో సర్ ఆర్థర్ లూయిస్ ఒక సిద్ధాంతాన్ని ప్రతిపాదించారు. ఆయన అభివృద్ధి ప్రక్రియలో అసలైన కీలకాంశం మూలధనాన్ని కూడబెట్టడం కాదని, శ్రామికులు కేవలం పొట్టకూటి కోసం చేసే వ్యవసాయం నుండి మరింత ఎక్కువ ఆదాయాన్నిచ్చే పరిశ్రమలు, సేవా రంగాల వైపు వలస వెళ్లడమేనని గుర్తించారు. పారిశ్రామికీకరణలో వెనుకబడిన ప్రతి దేశ భవిష్యత్తును ఈ మార్పే శాసిస్తుందని ఆయన సరిగ్గా అంచనా వేశారు. భారతదేశం ప్రస్తుతం ఖచ్చితంగా అదే పరిస్థితిలో నిలిచి ఉంది. ఇప్పుడు విధాన నిర్ణేతల ముందున్న ప్రశ్న.. తగినన్ని ఉద్యోగాలు ఉన్నాయా? లేదా? అనేది కాదు; అంతకంటే క్లిష్టమైన ప్రశ్న---మన ఆర్థిక వ్యవస్థ తగిన సంఖ్యలో, సాంప్రదాయక స్వభావం కలిగి, యువ కార్మికుడికి జీవితాంతం పెరుగుతున్న ఉత్పాదకత, భద్రతను ఇచ్చేంత స్థిరమైన ఉపాధిని సృష్టించగలదా? లేదా? అనేది. ఈ సవాలు తీవ్రతను మనం ఖచ్చితమైన గణాంకాలతో అర్థం చేసుకోవచ్చు. ఆర్థిక సర్వే 2023-24, 'పిరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే' (ఫాఫ్సీ) జనాభా అంచనాల ప్రకారం---మన ఆర్థిక వ్యవస్థ ఈ దశాబ్దంలో ప్రతి సంవత్సరం దాదాపు 78.5 లక్షల వ్యవసాయేతర ఉద్యోగాలను సృష్టించాల్సి ఉంది. ఈ అవసరం రెండు రకాల ఒత్తిళ్ల వల్ల ఏర్పడుతోంది. ఒకటి, కార్మిక శక్తిలో భాగస్వామ్యం నిరంతరం పెరుగుతుండటం; రెండు, వ్యవసాయ రంగం నుండి శ్రామికులను ఇతర రంగాల వైపు మళ్లించాల్సిన నిర్మాణాత్మక మార్పు. ప్రస్తుతం ఉపాధిలో వ్యవసాయ రంగం వాటా దాదాపు 46 శాతంగా ఉంది, దీనిని 2047 నాటికి పావు వంతుకు తగ్గించాల్సి ఉంది. ఈ లోటును భర్తీ చేయడానికి కేంద్ర మంత్రిమండలి జూలై 2025లో ఆమోదించి, మరుసటి నెల నుండి అమలులోకి తెచ్చిన అత్యంత ఆలోచనాత్మకమైన ప్రయత్నమే "ప్రధాన మంత్రి వికసిత్ భారత్ రోజ్గార్ యోజన". ఈ పథకం ద్వారా ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ (ఇపిఎఫ్ఓ) ద్వారా రూ. 99,446 కోట్లను వెచ్చించి, జూలై 2027 నాటికి అంటే రెండు సంవత్సరాలలో 3.5 కోట్లకు పైగా సాంప్రదాయక ఉద్యోగాలను ప్రోత్సహించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఒక ఈపీఎఫ్ఓ నమోదిత సంస్థలో మొదటిసారి చేరి, నెలకు రూ. 1 లక్ష కంటే తక్కువ వేతనం పొందే కార్మికుడు రెండు విడతల్లో రూ. 15,000 వరకు పొందడానికి అర్హత సాధిస్తాడు. ఇందులో రెండవ విడత సొమ్ము ఆర్థిక అక్షరాస్యత కోర్సును పూర్తి చేయడంపై ఆధారపడి ఉంటుంది, దీనిని పొదుపు ఖాతాలో ఉంచుతారు. అదే సమయంలో, ఒక నిర్ణీత పరిమితికి మించి తమ ఉద్యోగుల సంఖ్యను పెంచే యజమానులకు, ప్రతి కొత్త కార్మికుడిపై నెలకు రూ. 3,000 చొప్పున ప్రభుత్వం అందిస్తుంది. చిన్న సంస్థలు సైతం ఈ పథకం నుండి దూరం కాకుండా, లబ్ధి పొందేలా నిబంధనలను రూపొందించారు. సాధారణంగా ఇచ్చే సబ్సిడీ పథకాల కంటే ఈ పథకం భిన్నమైనది, ఉన్నతమైనది. ఎందుకంటే, మొదటి విడత ప్రయోజనం అందాలంటే ఉద్యోగి కనీసం ఆరు నెలల పాటు నిరంతరాయంగా ఉపాధిలో కొనసాగాలి అనే నిబంధనను పెట్టారు. ఒక కొత్త ఉద్యోగిని చేర్చుకోవడం వల్ల సంస్థకు ఉపయోగం ఉండాలంటే, ఆ ఉద్యోగి కొంతకాలం ఉండి ఉత్పాదకతను సాధించాలి. ఈ నిబంధన వల్ల యాజమాన్యానికి శిక్షణ ఖర్చులు కలిసిరావడమే కాకుండా, ఉద్యోగికి కూడా నిజమైన నైపుణ్యాలు, నమ్మకమైన సేవా రికార్డును నిర్మించుకోవడానికి తగిన సమయం దొరుకుతుంది. అందువల్ల, ఇది కేవలం ఉద్యోగ నియామకాన్ని మాత్రమే కాకుండా, ఉద్యోగ నిలుపుదలను ప్రోత్సహిస్తుంది. దీనివల్ల కార్మికుడికి ఎక్కడికైనా తీసుకెళ్లగలిగే ఉపాధి రికార్డు లభిస్తుంది. ఈ పథకం తయారీ రంగానికి మరింత ఎక్కువ ప్రాధాన్యతనిచ్చింది. ఇక్కడ యజమానులకు ఇచ్చే ప్రోత్సాహక కాల పరిమితిని రెండు సంవత్సరాల నుండి నాలుగు సంవత్సరాలకు పెంచారు. పారిశ్రామిక సామర్థ్యాన్ని పెంచడానికి ఎక్కువ సమయం పడుతుందనే వాస్తవాన్ని గుర్తించి, యాజమాన్యాలు శ్రామికులకు బదులుగా ముందస్తుగానే ఆటోమేషన్ వైపు వెళ్లకుండా మానవ వనరులను పెంచుకునేలా చేయడానికి ఈ నిర్ణయం తీసుకున్నారు. భారతదేశాన్ని ప్రపంచ తయారీ కేంద్రంగా మార్చాలనే ఆకాంక్షకు ఈ నిర్ణయం ఎంతో అవసరమని ప్రభుత్వం గుర్తించింది. ఈపీఎఫ్ఓ ద్వారా ఈ పథకంలో చేరిన ప్రతి కార్మికుడికి ఒక 'యూనివర్సల్ అకౌంట్ నంబర్' (యూఏఎన్), అసంఘటిత రంగ కార్మికులకు దొరకని సామాజిక భద్రత లభిస్తాయి. దీని ప్రాథమిక ఫలితాలు ఎంతో ఆశాజనకంగా ఉన్నాయి. పథకం ప్రారంభమైనప్పటి నుండి దాదాపు 60 లక్షల మంది మొదటిసారి ఉద్యోగులు ఇందులో చేరారు, వీరిలో అత్యధికులు 30 ఏళ్ల లోపు వారే. ఇందులో 18 లక్షల మందికి పైగా మహిళలు ఉన్నారు. అలాగే అసంఘటిత స్వభావం ఎక్కువగా ఉండే చిన్న సంస్థలతో కూడిన దాదాపు 1.77 లక్షల సంస్థలు, ఇప్పటివరకు 66 లక్షలకు పైగా అవకాశాలను సృష్టించాయి. అయితే, ఒక మంచి ప్రారంభాన్ని చూసి లక్ష్యం పూర్తిగా నెరవేరినట్లు భావించలేము. ఈ పథకంలో మోసాలకు తావులేకుండా పటిష్టమైన రక్షణ చర్యలను ఏర్పాటు చేశారు. మోసపూరిత చరిత్ర ఉన్న సంస్థలను మినహాయించడం, కేవలం కాగితాల మీద కాకుండా నిజంగానే ఉపాధి కొనసాగుతుందని నిర్ధారించడానికి ప్రతి ఆరు నెలలకొకసారి ఎలక్ట్రానిక్ రిటర్న్ దాఖలు చేయడం, ఆటోమేటెడ్ పద్ధతిలో నిధుల విడుదల వంటి జాగ్రత్తలు ఇందులో ఉన్నాయి. ఎలాగైనా జరిగే సాధారణ నియామకాలకు ప్రభుత్వ నిధులు వృథా కాకుండా ఈ జాగ్రత్తలు ఉపయోగపడతాయి. ఈ పథకం నిజమైన విజయం మొదటి సంవత్సరం నమోదైన సంఖ్యలలో లేదు; ప్రభుత్వం ఇచ్చే ప్రోత్సాహకాలు ముగిసిన తర్వాత కూడా ఆ ఉద్యోగాలు నిలబడతాయా లేదా అనేదానిపైనే ఆధారపడి ఉంటుంది. అలాగే, సృష్టించబడే ఉద్యోగాల డిమాండ్కు తగ్గట్టుగా నైపుణ్యం కలిగిన యువత సరఫరా ఉండాలి. అందుకే, ఈ పథకం విజయం అనేది నైపుణ్యాభివృద్ధిలో మనం పెట్టే పెట్టుబడులతో ముడిపడి ఉంది. ఉద్యోగం లేకపోవడం అనేది కేవలం ఆదాయాన్ని మాత్రమే దెబ్బతీయదు; అది మనిషి నైపుణ్యాలను, ఆత్మగౌరవాన్ని, సమాజంలో వారి స్థానాన్ని కూడా దెబ్బతీస్తుంది. ప్రసిద్ధ తత్వవేత్త వోల్టైర్ తన 'కాండీడ్' గ్రంథంలో చెప్పినట్లు---శ్రమ అనేది మనిషిని మూడు పెద్ద చెడుల నుండి దూరంగా ఉంచుతుంది; అవి బద్ధకం, వ్యసనం, పేదరికం. ఈ పథకం ఉపాధి పూర్తి అర్థాన్ని గ్రహించింది కాబట్టే దీనికి ఇంత విలువ ఉంది. ఇది ఒక సాంప్రదాయక ఉద్యోగాన్ని కేవలం ఒక గణాంకంగా చూడకుండా, ఒక కార్మికుడి జీవిత భద్రతకు పునాదిగా భావిస్తుంది. భారతదేశం 2047 నాటికి అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థగా మారాలని లక్ష్యంగా పెట్టుకున్న తరుణంలో, మన ప్రధానమంత్రి జాతీయ ప్రాజెక్టులో కేంద్ర బిందువుగా ఉంచిన యువత ఉపాధి కల్పనను కేవలం ఒక సీజన్ ప్రోత్సాహకాలతో ముగించకుండా---ఒక పూర్తి తరం పాటు స్థిరమైన, ఉత్పాదకతతో కూడిన, గౌరవప్రదమైన పనిగా మార్చడమే మన ముందున్న అసలైన బాధ్యత.

**- డాక్టర్ వి. అనంత నాగేశ్వరన్**

**(రచయిత భారత ప్రభుత్వ ప్రధాన ఆర్థిక సలహాదారు)**

# యూరియా బుకింగ్ యాప్‌ను ప్రారంభించిన కలెక్టర్ అంకిత్

**-ప్రతి రైతుకు తగినంత ఎరువులు అందించడమే ప్రభుత్వ లక్ష్యం:ఎమ్మెల్యే కోరం కనకయ్య**





భద్రాద్రి జిల్లా బ్యూరో, జూన్ 17 (భారతశక్తి): రైతులు ఇంటి వద్ద నుంచే యూరియాను సులభంగా బుక్ చేసుకునే విధంగా రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన ఫెర్టిలైజర్ బుకింగ్ యాప్‌ను జిల్లా కలెక్టర్ అంకిత్ బుధవారం టేకులపల్లి మండలంలోని బేతంపూడి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఇల్లందు శాసనసభ్యులు కోరం కనకయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ జిల్లాలో వ్యవసాయ అవసరాల కోసం సుమారు 40 వేల మెట్రిక్ టన్నుల యూరియా అవసరమవుతుందని, ప్రస్తుతం 15 వేల మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందని తెలిపారు. రైతులకు అవసరమైన మేరకు యూరియా సరఫరా చేసేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు చేపడుతోందన్నారు. యూరియాను అవసరానికి మించి వినియోగించడం వల్ల భూసార సాంద్రత తగ్గిపోవడంతో పాటు భవిష్యత్తులో అధిక మొత్తంలో ఎరువులు వినియోగించాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని పేర్కొన్నారు. రైతులు వ్యవసాయ శాఖ అధికారులు సూచించే శాస్త్రీయ పద్ధతులను పాటిస్తూ సమతుల్య ఎరువుల వినియోగంపై దృష్టి సారించాలని సూచించారు. జిల్లాలో ఈ ఏడాది రికార్డు స్థాయిలో మొక్కజొన్న సాగు జరిగిందని, ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తక్కువగా నమోదయ్యే అవకాశాలు ఉన్నందున రైతులు పంటల వైవిధ్యీకరణ, పంట మార్పిడి పద్ధతులను అవలంబించాలని కలెక్టర్ సూచించారు. రైతులకు ఫెర్టిలైజర్ బుకింగ్ యాప్‌పై విస్తృత అవగాహన కల్పించాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. టేకులపల్లి మండలంలో ఐదు రైతు వేదికల ద్వారా యూరియా అందుబాటులో ఉంచుతున్నట్లు తెలిపారు. రైతుల సౌకర్యార్థం ప్రభుత్వం ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నంబర్ 18001237157 సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

**- ప్రతి రైతుకు ఎరువులు అందిస్తాం**

ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య మాట్లాడుతూ ప్రతి రైతుకు తగినంత ఎరువులు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. రైతులకు ఎరువుల కొరత తలెత్తకుండా ప్రభుత్వం నిరంతరం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. గత సీజన్‌లో రికార్డు స్థాయిలో మొక్కజొన్నను 2400 మద్దతు ధరకు కొనుగోలు చేసి, 1800 కు ప్రభుత్వం విక్రయించిందని నష్టాన్ని ప్రభుత్వమే భరించి రైతులకు అండగా నిలిచినట్లు తెలిపారు. అయినప్పటికీ ప్రభుత్వంపై కొందరు తప్పుడు ప్రచారాలు చేపడుతున్నారు. రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోందని, ఫెర్టిలైజర్ బుకింగ్ యాప్ ద్వారా రైతులు ఇంటి నుంచే యూరియాను బుక్ చేసుకునే అవకాశం కల్పించడం కూడా అందులో భాగమేనన్నారు. రైతులు సంప్రదాయ పంటలతో పాటు ప్రత్యామ్నాయ పంటలను సాగు చేస్తూ ఆదాయాన్ని పెంచుకోవాలని సూచించారు. అనంతరం ఫెర్టిలైజర్ బుకింగ్ యాప్ ద్వారా యూరియా బుక్ చేసుకున్న రైతులకు యూరియా బస్తాలను జిల్లా కలెక్టర్ అంకిత్, ఎమ్మెల్యే కోరం కనకయ్య చేతుల మీదుగా అందజేశారు. టేకులపల్లి పర్యటనలో భాగంగా ఏ కాలనీలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇండ్ల పురోగతిని జిల్లా కలెక్టర్ అంకిత్, ఎమ్మెల్యే కోరం కనకయ్యతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా లబ్ధిదారురాలు ధారావత్ చుక్కి, భర్త టిక్లీ నిర్మిస్తున్న ఇంటిని సందర్శించి నిర్మాణ పనుల పురోగతి, నిధుల విడుదల తదితర అంశాలపై వివరాలు తెలుసుకున్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను నాణ్యతతో, వేగవంతంగా పూర్తి చేసి లబ్ధిదారులు త్వరగా గృహ ప్రవేశం చేసుకునేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్ లక్కినేని సురేంద్ర, మార్కెట్ కమిటీ చైర్మన్ రాంబాబు, సర్పంచ్ బోడ బాలు, కొత్తగూడెం ఆర్‌డీఓ మధు, సహకార శాఖ అధికారి శ్రీనివాస్, వ్యవసాయ శాఖ అధికారి బాబురావు, ప్రజాప్రతినిధులు, అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# యూసీడీ ఆధ్వర్యంలో ఇందిరా మహిళా శక్తి కేంద్రాల ఎగ్ కార్ట్‌ల ప్రారంభం

ఎల్బీనగర్, జూన్ 17 (భారత శక్తి) సరూర్‌నగర్ సర్కిల్ యూసీడీ విభాగం ఆధ్వర్యంలో ఇందిరా మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా స్వయం ఉపాధి అవకాశాలను ప్రోత్సహించే లక్ష్యంతో ఏర్పాటు చేసిన 3 ఎగ్ కార్ట్‌లను సర్కిల్ డిప్యూటీ కమిషనర్ సిహెచ్. శ్రీకాంత్ ప్రారంభించారు. ఈ సందర్భంగా డిప్యూటీ కమిషనర్ మాట్లాడుతూ, పొదుపు సంఘాల సభ్యులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకొని, బ్యాంకుల ద్వారా రుణాలు పొంది చిన్న వ్యాపారాలు ప్రారంభించి ఆర్థికంగా అభివృద్ధి చెందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో భాగంగా భవానీ నగర్‌లోని శ్రీ విఘ్నేశ్వర పొదుపు సంఘం, జీబీఆర్ హాస్పిటల్ ఎదురుగా ఉన్న శ్రీకృష్ణ పొదుపు సంఘం, మరియు శ్రీ లలితాంబికా పొదుపు సంఘం సభ్యులకు ఎగ్ కార్ట్‌లను అందజేసి ప్రారంభించారు. యూసీడీ విభాగం ప్రాజెక్ట్ అధికారి విక్రాంత్ రెడ్డి మాట్లాడుతూ, మహిళా సంఘాల సభ్యులు స్వయం ఉపాధి ద్వారా వ్యాపార రంగంలో ముందుకు సాగి, ఆర్థిక స్వావలంబన సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ ఆర్గనైజర్లు జి. సహదేవ్, సైదులు, శ్రీమతి శోభన, ఆర్‌పీలు పరమేశ్వరి, శిల్ప, సమాఖ్య అధ్యక్షురాలు జ్యోతి, నాగలక్ష్మి మరియు వివిధ పొదుపు సంఘాల సభ్యులు పాల్గొన్నారు.



## స్ట్రామ్ వాటర్ నాలా పనులను

# వెంటనే నిలిపివేయాలి

### సామ రంగారెడ్డి ఆధ్వర్యంలో బీజేపీ నేతల ధర్నా



ఎల్బీనగర్, జూన్ 17 (భారత శక్తి): ఎల్బీనగర్ నియోజకవర్గంలోని లింగోజిగూడ ప్రాంతంలో జనప్రియ అపార్ట్మెంట్స్ పక్కన భాగంలో జిహెచ్ఎంసి అధికారుల కనుసన్నల్లో కొందరు ప్రైవేట్



వ్యక్తులు చేపడుతున్న స్ట్రామ్ వాటర్ నాలా డైవర్షన్ పనులను వెంటనే నిలిపివేయాలని బీజేపీ ఎల్బీనగర్ నియోజకవర్గ ఇంచార్జ్ సామ రంగారెడ్డి ఆధ్వర్యంలో స్థానిక బీజేపీ నాయకులు, ప్రజలతో కలిసి,ఎల్బీనగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ కార్యాలయం వద్ద నిరసనతో కూడిన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు, వివిధ డివిజన్ నాయకులు స్థానిక ప్రజలు పాల్గొని లింగోజిగూడ ప్రాంత ప్రజలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా బీజేపీ నేత, మాజీ కార్పొరేటర్ బద్దం ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ, ప్రభుత్వ నిధులతో సుమారు రూ.4 కోట్ల వ్యయంతో నిర్మించిన స్ట్రామ్ వాటర్ నాలాను కొందరు ప్రైవేట్ వ్యక్తుల ప్రయోజనాల కోసం మళ్లించే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. ఈ నాలా డైవర్షన్ కారణంగా లింగోజిగూడ ప్రాంత ప్రజలు భవిష్యత్తులో భారీ ముంపు సమస్యలను ఎదుర్కొనే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.ప్రస్తుతం జరుగుతున్న నాలా డైవర్షన్ పనులను వెంటనే నిలిపివేయాలని, ఇప్పటికే ఉన్న నాలాను యథాతథంగా కొనసాగిస్తూ డీసిల్టేషన్ పనులను తక్షణమే ప్రారంభించాలని అధికారులను డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఈఈ) కార్తీక్ ని కలిసి వినతిపత్రం అందజేశారు.దీనిపై స్పందించిన ఈఈ కార్తీక్, జరుగుతున్న నాలా పనులకు సంబంధించి వెంటనే నోటీసులు జారీ చేసి పనులను నిలిపివేస్తామని హామీ ఇచ్చారు. అలాగే ప్రస్తుతం ఉన్న నాలాలో డీసిల్టేషన్ పనులను కూడా అత్యవసరంగా ప్రారంభిస్తామని సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.ప్రజల ప్రయోజనాలకు భంగం కలిగించే ఎలాంటి చర్యలనైనా బీజేపీ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని, లింగోజిగూడ ప్రాంత ప్రజలకు అన్యాయం జరిగితే పార్టీ ప్రజల పక్షాన నిలబడి పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తుందని బద్దం ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి హెచ్చరించారు.

## ఖాజిపల్లి జిఎంఆర్ కాలనీలో

# ప్రజలకు సకల సౌకర్యాలు..

### పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



జిన్నారం జూన్ 17 భారత శక్తి గడ్డ పోతారం మున్సిపల్ పరిధిలోని ఖాజిపల్లి జిఎంఆర్ కాలనీలో ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందించేందుకు కృషి చేస్తున్నామని.. త్వరలోనే అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టబోతున్నట్లు పటాన్‌చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. బుధవారం



ఉదయం ఖాజిపల్లి పరిధిలోని జిఎంఆర్ కాలనీ, జర్నలిస్ట్ కాలనీలలో ఎమ్మెల్యే జిఎంఆర్ పర్యటించారు. ఈ సందర్భంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా సర్వేనెంబర్ 181 లో ప్రజల సౌకర్యార్థం గుడి, మసీదు, చర్చి, స్మశాన వాటిక, అంగన్వాడి, చట్ పూజ ఘాట్, క్రీడా మైదానం, ప్రాథమిక పాఠశాల నిర్మాణాలకు త్వరలో స్థలాలు కేటాయించి..భవన నిర్మాణాల పనులు ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. జర్నలిస్ట్ కాలనీలో సీసీ రోడ్డు, అంతర్గత మురుగునీటి కాలువల నిర్మాణాలకు నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం జిఎంఆర్ కాలనీలో గ్రామ దేవత గుడి నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు.
ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సుష్మ శ్రీకాంత్, తహసిల్దార్ ఆంథోనీ, మాజీ జెడ్పీటీసీ బాల్ రెడ్డి, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, బి ఆర్ ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## జేఈఈ మెయిన్స్‌లో ప్రతిభ కనబర్చిన ధర్పల్లి.

# త్రిశాంక్ రెడ్డికి మంత్రి శ్రీధర్ బాబు అభినందనలు

### జాతీయ ఇంజనీరింగ్ ప్రవేశ పరీక్షలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థిని ప్రశంసించిన రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి

హైదరాబాద్: జూన్ 17 భారత శక్తి జాతీయ స్థాయి ఇంజనీరింగ్ ప్రవేశ పరీక్ష (జేఈఈ మెయిన్స్) ఫలితాల్లో అద్భుతమైన ప్రతిభ కనబర్చిన దర్పల్లి త్రిశాంక్‌ను రాష్ట్ర సమాచార సాంకేతిక (ఐటీ), పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు అభినందించారు. లింగోజిగూడ మాజీ కార్పొరేటర్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు దర్పల్లి రాజశేఖర్ రెడ్డి కుమారుడైన త్రిశాంక్ నివాసానికి మంత్రి స్వయంగా వెళ్ళి, అతడిని ప్రత్యేకంగా అభినందించి శు భాకాంక్షలు తెలిపారు.

**- విద్యార్థి విజయం ప్రశంసనీయం: మంత్రి శ్రీధర్ బాబు**

ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ... జాతీయ స్థాయిలో అత్యంత కఠినమైన పరీక్షల్లో ఒకటిగా భావించే ఈ ప్రవేశ పరీక్షలో త్రిశాంక్ సాధించిన విజయం ఎంతో ప్రశంసనీయమని కొనియాడారు. సాంకేతిక రంగంలో దేశ విదేశాల్లో రాణించేందుకు ఇటువంటి ఫలితాలు ఎంతగానో దోహదపడతాయని పేర్కొన్నారు. భవిష్యత్తులో త్రిశాంక్ మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించి, అటు కుటుంబానికి, ఇటు సమాజానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. నేటి తరం విద్యార్థులకు త్రిశాంక్ విజయం ఒక స్ఫూర్తిగా



నిలుస్తుందని మంత్రి ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. "లక్ష్య సాధన కోసం నిరంతరం శ్రమిస్తే ఉన్నత శిఖరాలను అధిరోహించడం అసాధ్యమేమీ కాదు."

**- మంత్రికి కృతజ్ఞతలు తెలిపిన కుటుంబ సభ్యులు**

మంత్రి శ్రీధర్ బాబు తమ నివాసానికి విచ్చేసి, కుమారుడిని



ప్రత్యేకంగా అభినందించడం పట్ల త్రిశాంక్ తండ్రి దర్పల్లి రాజశేఖర్ రెడ్డి హర్షం వ్యక్తం చేస్తూ మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతో శ్రమిస్తే అనుకున్న లక్ష్యాలను సులువుగా చేరుకోవచ్చని ఆయన పేర్కొన్నారు. తమ కుమారుడి ప్రతిభను గుర్తించి ప్రోత్సహించినందుకు కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు.

# ముంపు ముప్పునకు శాశ్వత చెక్

## రంగంలోకి హైడ్రా రంగనాథ్ ఉన్నతాధికారుల బృందం!

**- మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో విస్తృత పర్యటన.. వరద నివారణ చర్యలపై ప్రభుత్వ సలహాదారు సుదర్శన్‌రెడ్డి సమీక్ష**



హైదరాబాద్ జూన్ 17 భారత శక్తీ, మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ (ఎంఎంసీ) పరిధిలోని ముంపు ప్రాంతాల్లో బుధవారం హై లెవెల్ కమిటీ విస్తృతంగా పర్యటించింది. ప్రభుత్వ సలహాదారు సుదర్శన్‌రెడ్డి నేతృత్వంలో సాగిన ఈ పర్యటనలో డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ) సీవీ ఆనంద్, హైడ్రా (హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ) కమిషనర్ ఏవీ రంగనాథ్, జలమండలి మేనేజింగ్ డైరెక్టర్ (ఎండీ) అశోక్‌రెడ్డి, ఎంఎంసీ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి, మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ సుమతి, హైడ్రా అదనపు డైరెక్టర్ వర్ల పాపయ్య సహా ఇరిగేషన్, మున్సిపల్, పోలీస్ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. గత వర్షాకాలంలో ముంపునకు గురైన ప్రాంతాల్లో ప్రస్తుత పరిస్థితులను క్షేత్రస్థాయిలో పరిశీలించిన బృందం, వరద ముప్పునకు గల కారణాలను విశ్లేషించి, తక్షణ ప్రత్యామ్నాయాలపై చర్చించింది.

**- ప్రకాష్‌నగర్, బేగంపేటల్లో మారిన చిత్రపటం:**

**హైడ్రా పనులకు సత్ఫలితాలు**



అధికారుల బృందం మొదట ప్రకాష్‌నగర్ మెట్రో స్టేషన్ సమీపంలోని ప్రధాన రహదారితో పాటు చికోటీ గార్డెన్స్ పరిసరాలను పరిశీలించింది. గతంలో స్వల్ప వర్షానికే ప్రకాష్‌నగర్ మెట్రో స్టేషన్ ప్రాంతం జలమయమయ్యేదని, అయితే గత ఏడాది హైడ్రా ఆధ్వర్యంలో భూగర్భ డ్రైనేజీలో పెద్ద ఎత్తున పూడికతీత పనులు చేపట్టడం వల్ల ఇప్పుడు పరిస్థితి మెరుగైందని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ వివరించారు. బేగంపేట విమానాశ్రయం నుండి పోటెత్తే వరదను నియంత్రించేందుకు అక్కడ 40 లక్షల లీటర్ల సామర్థ్యంతో నిర్మించిన సంరక్షణ చెరువు (రిటెన్షన్ పాండ్) మంచి ఫలితాలను ఇస్తోందని ఆయన తెలిపారు. హుస్సేన్‌సాగర్‌లో నీటిమట్టాన్ని ముందస్తుగా తగ్గిస్తే ఈ ప్రాంతంలో ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని కమిషనర్ పేర్కొన్నారు.

**- ఉప్పల్, ఎల్‌బీనగర్‌లలో ముమ్మర తనిఖీలు:**

ఉప్పల్ క్రాస్‌రోడ్స్ సంపు పరిశీలన: ఉప్పల్ చౌరస్తాలో రహదారులు జలమయం కాకుండా నిరోధించేందుకు ఏర్పాటు చేసిన 5 లక్షల లీటర్ల సామర్థ్యమున్న నీటి నిల్వ సంపును (వాటర్ సంప్) అధికారులు తనిఖీ చేశారు. ఈ సంపు వల్ల చౌరస్తాలో వరద నీరు నిల్వ ఉండకుండా వేగంగా తరలిపోతోందని జలమండలి అధికారులు వెల్లడించారు. అలాగే ఉప్పల్ నల్లచెరువు పునరుద్ధరణ పనుల వల్ల ఆ చుట్టుపక్కల ప్రాంతాలకు వరద ముప్పు తప్పిందని స్పష్టం చేశారు.

**- ఎల్‌బీనగర్ కాలువల అనుసంధానం:** ఎల్‌బీనగర్ క్రాస్‌రోడ్స్ బస్ స్టాప్ సమీపంలో బైరాముల్‌గూడ చెరువుకు వెళ్లే వరద కాలువల (స్టార్మ్ వాటర్ డ్రెయిన్స్) స్థితిగతులను బృందం



పరిశీలించింది. చంద్రపురి కాలనీ - గుంటి జంగయ్య కాలనీలను కలుపుతూ ప్రధాన రహదారిలో 900 మిల్లీమీటర్ల (ఎంఎం) వరద కాలువ నిర్మిస్తే ఇక్కడి సమస్య పరిష్కారమవుతుందని అధికారులు అభిప్రాయపడ్డారు. ఈ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని సుదర్శన్‌రెడ్డి ఆదేశించారు.

**- విజయవాడ జాతీయ రహదారిపై ప్రత్యేక నాలాల నిర్మాణం**

వనస్థలిపురంలోని కేఎల్‌ఎమ్ షాపింగ్ మాల్‌కు ఎదురుగా జాతీయ రహదారి (నేషనల్ హైవే) నిర్మాణ సంస్థలు ఏర్పాటు చేసిన నాలాలను, వరద కాలువల అనుసంధాన ప్రక్రియను ఉన్నతాధికారులు పరిశీలించారు. విజయవాడ హైవేకు అడ్డంగా సొరంగం (టన్నెల్) తరహాలో తవ్వకాలు జరిపి, గత ఏడాది ఏర్పాటు చేసిన పైపులైన్లను తనిఖీ చేశారు.

**మరో పైపులైన్‌కు ప్రతిపాదన:**

ఎఫ్‌సీఐ కాలనీ, ప్రశాంత్‌నగర్, అభ్యుదయ నగర్, చింతలకుంట గ్రామాల నుండి భారీగా వచ్చే వరద నీరు జాతీయ రహదారిని దాటి మన్సూరాబాద్ పెద్ద చెరువుకు చేరేలా మరో 1000 మిల్లీమీటర్ల (ఎంఎం) పైపులైను నిర్మించాల్సిన అవసరం ఉందని అధికారులు ప్రభుత్వ సలహాదారు దృష్టికి తీసుకెళ్లారు. గతంలో తీవ్రంగా ఉన్న ఈ సమస్య, ఇప్పటికే 1.10 మీటర్ల పైపులైన్ వేయడంతో చాలా వరకు తగ్గిందని, అదనంగా మరో లైన్ నిర్మిస్తే ముంపు సమస్యకు శాశ్వతంగా తెరపడుతుందని అధికారులు నివేదించారు.

## సురక్షిత సమాజ నిర్మాణంలో

# ప్రజల భాగస్వామ్యం కీలకం

### ఎల్బీనగర్ డీసీపీ డాక్టర్ బి. అనురాధ ఐపిఎస్ సూచనలు

ఎల్బీనగర్, జూన్ 17 (భారత శక్తి): సమాజంలో శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, ప్రజల భద్రత కోసం పోలీసులతో పాటు ప్రజల భాగస్వామ్యం కూడా అత్యంత ముఖ్యమని ఎల్బీనగర్ జోన్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ డాక్టర్ బి. అనురాధ పేర్కొన్నారు. సమాజాన్ని మరింత సురక్షితంగా తీర్చిదిద్దేందుకు ప్రతి పౌరుడు బాధ్యతాయుతంగా వ్యవహరించి పోలీసులకు సహకరించాలని ఆమె పిలుపునిచ్చారు. మంగళవారం రాత్రి నాగోల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కోఆపరేటివ్ బ్యాంక్ కాలనీ సంక్షేమ సంఘం కార్యాలయంలో నాగోల్ సీఐ మహమ్మద్ మక్బూల్ జానీ ఆధ్వర్యంలో నిర్వహించిన 'మీ సురక్ష' అవగాహన కార్యక్రమానికి డీసీపీ డాక్టర్ బి. అనురాధ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.ఇటీవల నగరంలోని పలు అపార్ట్‌మెంట్లు, నివాస గృహాల్లో చోటుచేసుకుంటున్న చోరీలు, హత్యలు వంటి ఘటనలను దృష్టిలో ఉంచుకుని మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్ పరిధిలో మే నెల నుంచి 'మీ సురక్ష' కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రతి కాలనీ, అపార్ట్‌మెంట్, నివాస ప్రాంతాల్లో పనిచేసే సెక్యూరిటీ సిబ్బంది, హౌస్ కీపింగ్ సిబ్బంది, గృహ సహాయకులు, డ్రైవర్లు తదితర సేవకుల వివరాలను సేకరిస్తున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఎల్బీనగర్ జోన్ పరిధిలో ఇప్పటి వరకు ప్రజల సహకారంతో 2223 మంది పోలీసుల ద్వారా 9,940 మంది సేవకుల వివరాలను నమోదు చేసినట్లు వెల్లడించారు. ఈ సమాచారంతో ఏదైనా నేర ఘటన జరిగినప్పుడు అనుమానితులను గుర్తించడం, దర్యాప్తు వేగవంతం చేయడం, నేర నియంత్రణలో మెరుగైన ఫలితాలు సాధించడం సాధ్యమవుతుందని తెలిపారు.ప్రజలు తమ ప్రాంతాల్లో జరిగే అనుమానాస్పద కార్యకలాపాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించిన డీసీపీ, మాదకద్రవ్యాల అక్రమ రవాణా, మహిళలపై వేధింపులు, అసాంఘిక కార్యకలాపాలు లేదా అనుమానాస్పద వ్యక్తుల సంచారం గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ప్రజల నుంచి వచ్చే సమాచారం నేరాల నియంత్రణలో కీలక పాత్ర పోషిస్తుందని చెప్పారు.ప్రస్తుతం సైబర్ నేరాలు వేగంగా పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు మరింత జాగ్రత్తగా ఉండాల్సిన అవసరం ఉందని ఆమె హెచ్చరించారు. గుర్తు తెలియని వ్యక్తులకు ఓటీపీలు, బ్యాంకు ఖాతా వివరాలు, ఏటీఎం పిన్‌లు లేదా వ్యక్తిగత సమాచారం ఎట్టి పరిస్థితుల్లోనూ ఇవ్వకూడదని సూచించారు. సైబర్ మోసగాళ్ల వలలో చిక్కుకుని అనేక మంది ఆర్థిక నష్టాలను ఎదుర్కొంటున్నారని, అనుమానాస్పద ఫోన్ కాల్స్, మెసేజ్‌లు, లింక్‌ల పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఈ సందర్భంగా కార్యక్రమంలో పాల్గొన్న ట్రాఫిక్ డీసీపీ పి.శ్రీనివాసులు మాట్లాడుతూ, రహదారి ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ నియమ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. రాంగ్ రూట్ డ్రైవింగ్, నిర్లక్ష్యంగా వాహనాల పార్కింగ్, ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనల వల్ల ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని పేర్కొన్నారు. ట్రాఫిక్ క్రమశిక్షణ పాటించని వారిపై కఠిన చర్యలు తీసుకుంటూ తగిన జరిమానాలు




విధిస్తున్నామని తెలిపారు. ప్రజలు స్వచ్ఛందంగా ట్రాఫిక్ నియమాలను పాటించడం ద్వారా ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్బీనగర్ జోన్ డిప్యూటీ కమిషనర్ కోటేశ్వరరావు, ఎల్బీనగర్ ఏసీపీ కృష్ణయ్య, నాగోల్ సీఐ మహమ్మద్ మక్బూల్ జానీ, పలువురు సీఐలు, ఎస్సైలు, షీ టీం సిబ్బంది, కాలనీల సంక్షేమ సంఘాల ప్రతినిధులు, మహిళలు, యువతతో పాటు పెద్ద సంఖ్యలో స్థానిక ప్రజలు పాల్గొన్నారు.ప్రజల భాగస్వామ్యంతో పోలీసు వ్యవస్థ మరింత బలోపేతమవుతుందని, సురక్షితమైన, నేరరహిత సమాజ నిర్మాణం అందరి సహకారంతోనే సాధ్యమవుతుందని డీసీపీ డాక్టర్ బి. అనురాధ స్పష్టం చేశారు. ఈ అవగాహన కార్యక్రమం ప్రజల్లో భద్రత, సైబర్ జాగ్రత్తలు, ట్రాఫిక్ నియమాల పట్ల చైతన్యం పెంపొందించడంలో ఉపయోగపడిందని పాల్గొన్న వారు అభిప్రాయపడ్డారు.

## భోగాపురం ఎయిర్ పోర్టుకు బస్సులు

**శ్రీకాకుళం,** భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయ నిర్మాణం తుది దశకు చేరుకుంది. మరి కొద్ది రోజుల్లో ప్రజలకు అందుబాటులోకి రానుంది. జూలై నుంచి అధికారికంగా విమాన రాకపోకలు ప్రారంభం కానున్నాయి. అయితే విశాఖ నగరం నుంచి భోగాపురం ఎయిర్పోర్ట్ కు చాలా రహదారులు ఉన్నాయి. 52 కిలోమీటర్ల దూరం కాగా.. ట్రాఫిక్ ఇబ్బందులతో దాదాపు రెండు గంటల సమయం పట్టే అవకాశం ఉంటుంది. ఈ ఇబ్బందులను అధిగమించి నేరుగా విశాఖ నగరం నుంచి ఎయిర్పోర్ట్ కు రహదారులను మెరుగుపరిచేందుకు అన్ని ఏర్పాట్లు జరుగుతున్నాయి. అయితే విశాఖ నుంచి భోగాపురం వెళ్లడానికి విమాన ప్రయాణికులకు ఎదురయ్యే ఇబ్బందుల పరిష్కారం పై.. ఆంధ్రప్రదేశ్ విమాన ప్రయాణికుల సంఘం జిఎంఆర్ సంస్థకు ప్రత్యేకంగా విజ్ఞప్తి చేసింది. విమాన ప్రయాణికులు తమ సొంత కార్లపై భోగాపురం వెళితే ట్రాఫిక్ మరింత ఇబ్బందికరంగా మారుతుందని.. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని విజ్ఞప్తి చేసింది.విశాఖ నుంచి వచ్చే విమాన ప్రయాణికులకు ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా జిఎంఆర్ సంస్థ సరికొత్త ఆలోచన చేసింది. విశాఖ నగరంలో 9 చోట్ల వెయిటింగ్ లాంజ్ లు ఏర్పాటు చేయనుంది. దేశంలోనే తొలిసారి ఇటువంటి ఏర్పాట్లు చేయడం. తొలి విడతలో ఐదు లాంజ్ లు అందుబాటులోకి తెచ్చేందుకు ప్రయత్నంలో ఉంది. ఇందుకోసం జిఎంఆర్ గ్రూపు ముంబైలో ప్రత్యేకంగా కంటైనర్లను తయారుచేస్తోంది. 40 అడుగుల వెడల్పు, పది అడుగుల పొడవు కలిగిన కంటైనర్లు లాంజ్ రూపంలో అందుబాటులోకి రానున్నాయి. భోగాపురం వెళ్లాల్సిన విమాన ప్రయాణికులు వారికి సమీపంలో ఉన్న కంటైనర్ల వద్దకు చేరుకుంటే.. అక్కడి నుంచి ఆర్టీసీ నడిపే ఎలక్ట్రిక్ బస్సుల్లో భోగాపురం ఎయిర్పోర్ట్ వెళ్ళవచ్చు. దీనివల్ల విమానాశ్రయ మార్గంలో ట్రాఫిక్ రద్దీ తగ్గుతుంది. తక్కువ చార్జీలతో విమానాశ్రయానికి చేరుకోవచ్చు. భారతదేశంలోనే తొలిసారిగా విమాన ప్రయాణికుల కోసం కంటైనర్ లాంజ్ అందుబాటులోకి వస్తుండడం విశేషం.విశాఖ మహా నగరానికి ప్రభుత్వం 50 ఎలక్ట్రిక్ బస్సులను కేటాయించింది. వాటిలో తొలి విడత 20 బస్సులు నాలుగు రోజుల్లో విశాఖకు రానున్నాయి. మరోవైపు చార్జింగ్ స్టేషన్ల నిర్మాణం కూడా చురుగ్గా సాగుతోంది. బస్సులు రాగానే ట్రైల్ రన్ కూడా నిర్వహిస్తారు. వీటిలో పది బస్సులు గాజువాక నుంచి జాతీయ రహదారిలో ఆనందపురం మీదుగా భోగాపురం వరకు తిరుగుతాయి. మరో 10 బస్సులు గాజువాకలో బయలుదేరి నగరంలోని ముఖ్యమైన ప్రాంతాల మీదుగా భోగాపురం విమానాశ్రయానికి వెళ్తాయి. ట్రయల్ రన్ లో భాగంగా చెక్ ఇన్ కౌంటర్లు, లగేజీ స్కానింగ్ వంటి వాటికి సంబంధించి ప్రక్రియను నిర్వహిస్తున్నారు. మరోవైపు జూలై 5న అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవానికి ముహూర్తం గా నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. దీనిపై కేంద్ర ప్రభుత్వం నుంచి రాష్ట్ర ప్రభుత్వానికి సమాచారం రావాల్సి ఉంది. అప్పుడే రద్దీ విజయనగరం జిల్లాలో నిర్మించిన భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం పనులు తుది దశకు చేరుకున్నాయి. నెలల కిందట ప్రధాన పనులు జరగడంతో రాయల్ రన్ కూడా జరిగింది. ఢిల్లీ నుంచి వచ్చిన తొలి ఎయిర్ ఇండియా వాలిడేషన్ ఫ్లైట్ భోగాపురం విమానాశ్రయం రన్ వే పై దిగింది. అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా భారీ విమానాలు కూడా ల్యాండ్ అయ్యేలా భోగాపురం ఎయిర్పోర్ట్ రన్ వేను ప్రత్యేకంగా డిజైన్ చేశారు. ఈ ట్రయల్ రన్ విజయంతో రన్ వే సామర్థ్యం, భద్రత ప్రమాణాలపై అధికారులకు ఒక స్పష్టమైన అవగాహన వచ్చింది. దాదాపు పెండింగ్ పనులన్నీ తుది దశకు చేరుకున్నట్లు తెలుస్తోందిరాష్ట్ర విభజన హామీల్లో భాగంగా ఈ అంతర్జాతీయ విమానాశ్రయాన్ని నిర్మించారు. ఈ ఎయిర్పోర్ట్ అందుబాటులోకి వస్తే విజయనగరం, విశాఖపట్నం, శ్రీకాకుళం జిల్లాలకు మాత్రమే కాకుండా ఒడిస్సా సరిహద్దు ప్రాంతాలకు కూడా ఇది ప్రధాన విమాన కేంద్రంగా మారనుంది. ఉత్తరాంధ్ర ప్రాంత ప్రజలకు విశాఖపట్నం ఉన్న విమాన ప్రయాణ భారం తగ్గడంతో పాటు.. ఈ అంతర్జాతీయ విమానాశ్రయం తో ప్రయాణికులకు మరింత సౌకర్యవంతమైన విమాన సేవలు లభించనున్నాయి. ప్రస్తుతం ఎయిర్పోర్ట్ నిర్మాణ పనులు తుది దశకు చేరుకోవడంతో సందర్శకులతో కిటకిటలాడుతోంది. విశాఖకు వచ్చే పర్యాటకులు సైతం భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయాన్ని చూసేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. ప్రస్తుతం భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం రద్దీగా మారడం విశేషం.

## రంగంలోకి మోపిదేవి వారసుడు...

**గుంటూరు,** ఉమ్మడి గుంటూరు జిల్లా లోని రేపల్లె అసెంబ్లీ నియోజకవర్గం రాజకీయంగా ఎప్పుడూ ఆసక్తికరంగా ఉండే ప్రాంతంగా గుర్తింపు పొందింది. రాజకీయ చైతన్యం ఎక్కువగా ఉండే ఈ ప్రాంతంలో ఎన్నికల ఫలితాలు తరచూ రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారుతుంటాయి. ప్రస్తుతం ఇక్కడ తెలుగుదేశం పార్టీ బలమైన స్థితిలో ఉండగా, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మళ్లీ పుంజుకోవడానికి ప్రయత్నాలు ముమ్మరం చేస్తోంది.రేపల్లెలో గత మూడు ఎన్నికల్లో వరుస విజయాలు సాధించిన అనగాని సత్యప్రసాద్ తన ప్రభావాన్ని కొనసాగిస్తున్నారు. ప్రస్తుతం ఆయన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో రెవెన్యూ శాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. స్థానికంగా కూడా ఆయనకు గణనీయమైన ప్రజాభిమానం ఉందని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. దీంతో 2029 ఎన్నికల్లో ఆయనకు గట్టి పోటీ ఇవ్వాలంటే ప్రత్యేక వ్యూహం అవసరమని వైసీపీ భావిస్తున్నట్లు తెలుస్తోంది.గతంలో కాంగ్రెస్ పార్టీ తరఫున మోపిదేవి వెంకటరమణ ఇక్కడ విజయం సాధించి మంత్రిగా కూడా పనిచేశారు. అనంతరం ఆయన వైసీపీలో చేరి రాజకీయ ప్రస్థానాన్ని కొనసాగించారు. ఎన్నికల్లో ఓడినా ఎమ్మెల్సీ, మంత్రి, తరువాత రాజ్యసభ సభ్యునిగా అవకాశాలు పొందారు. అయితే ఇటీవల ఆయన తెలుగుదేశం పార్టీలో చేరడంతో రేపల్లె రాజకీయ సమీకరణాలు మారిపోయాయి.ఇదిలా ఉంటే, వైసీపీ కొత్త వ్యూహంతో ముందుకు సాగుతోంది. రేపల్లెలో గౌడ , కాపు సామాజిక వర్గాలు ఎన్నికల్లో కీలక పాత్ర పోషిస్తాయని విశ్లేషకులు చెబుతున్నారు. ఈ రెండు వర్గాల మద్దతు సాధించిన అభ్యర్థికి విజయావకాశాలు ఎక్కువగా ఉంటాయని అంచనా. అందుకే పార్టీ సామాజిక సమీకరణాలపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు సమాచారం.ఈ క్రమంలో మోపిదేవి శ్రీనివాస్ ను పార్టీలో చేర్చుకోవడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఆయనకు భవిష్యత్తులో కీలక బాధ్యతలు లేదా టికెట్ దక్కే అవకాశాలు ఉన్నాయన్న ప్రచారం కూడా జరుగుతోంది. మరోవైపు ప్రస్తుతం నియోజకవర్గ ఇన్చార్జిగా వ్యవహరిస్తున్న పీట నాగ మోహన్ కృష్ణ కూడా పార్టీ కార్యక్రమాలను చురుకుగా నిర్వహిస్తున్నారు.అయితే ఈ ఇద్దరు నాయకులు ఒకే వేదికపై కలిసి పనిచేస్తారా అనే విషయంపై స్పష్టత లేదు, ప్రస్తుతం వేర్వేరు కార్యక్రమాల్లో పాల్గొంటున్నారనే చర్చ స్థానికంగా సాగుతోంది. దీంతో పార్టీ శ్రేణుల్లో కొంత అయోమయం నెలకొన్నట్లు తెలుస్తోంది. ఒక వర్గం మోపిదేవి శ్రీనివాస్‌కు మద్దతు ఇస్తుండగా, మరో వర్గం పీట నాగ మోహన్ కృష్ణ నాయకత్వాన్నే బలపరుస్తోంది.ఈ పరిస్థితుల్లో రేపల్లెలో వైసీపీ అంతర్గత సమన్వయం కీలకంగా మారింది. పార్టీ నాయకత్వం ఈ విభేదాలను పరిష్కరించి అందరినీ ఒకే తాటిపైకి తీసుకురాగలిగితేనే వచ్చే ఎన్నికల్లో బలమైన పోటీ ఇవ్వగలదని రాజకీయ పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు. లేదంటే ఇప్పటికే బలంగా ఉన్న అనగాని సత్యప్రసాద్‌కు మరోసారి అనుకూల పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉందని భావిస్తున్నారు.

## పవన్ నార్త్‌పై గురి

**విజయవాడ,** ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ లో జాతీయ భావాలు ఎక్కువ. ఆయన ప్రాంతీయవాదానికంటే జాతీయ సమైక్యతకు ఎక్కువగా ప్రాధాన్యత ఇస్తారు. ఆ భావనతోనే నిన్న ఢిల్లీలో ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటు చేసి స్పష్టమైన సంకేతాలు పంపారు. తన రాజకీయ పరిధిని మరింత విస్తృతం చేసుకోవాలన్న ఆలోచన పవన్ లో కనిపించింది. కేవలం ప్రాంతీయ రాజకీయాలకే పరిమితం కాకుండా? ఢిల్లీ వేదికగా జాతీయ రాజకీయాల్లో ఒక స్పష్టమైన, కీలకమైన పాత్ర పోషించాలనే సంకల్పం పవన్ కళ్యాణ్ లో స్పష్టంగా కనిపిస్తోంది. ప్రధానంగా పవన్ నోటి నుంచి పదేపదే జాతీయవాదం రావడం వెనుక పక్క వ్యూహం ఉన్నట్లు అర్థమవుతోందిపవన్ కళ్యాణ్ రాజకీయ ప్రస్థానం చూస్తే ఆయన ఆరాటం అధికారం కోసం కాదు. నిర్దిష్టమైన సిద్ధాంతాలతో పాటు దేశభక్తి పట్ల ఉన్న నిబద్ధతను తెలియజేస్తుంది. భారతీయత అనే ఉమ్మడి సూత్రం, బలమైన జాతీయవాద భావజాలం ఆయనలో కనిపిస్తుంది. ఢిల్లీ సమావేశంలో ఆయన ప్రసంగించిన తీరు, ఎంచుకున్న అంశాలు తీసుకుంటే ఒక ప్రాంతీయ పార్టీ నేతగా కాకుండా? దేశ విశాల ప్రయోజనాల దృక్పథం ఉంది. అయితే జనసేన తాజా సంకేతాలు చూస్తే మాత్రం పవన్ కళ్యాణ్ అడుగులు జాతీయస్థాయి వైపు వేస్తున్నట్లు స్పష్టంగా తెలుస్తోంది.ఎన్డీఏ లో కీలక భాగస్వామిగా ఉన్నారు పవన్ కళ్యాణ్. ఏపీలో సైతం బిజెపి తెలుగుదేశం పార్టీతో జత కట్టడానికి ప్రధాన కారణం పవన్ కళ్యాణ్. ప్రధాని మోదీ మూడోసారి అధికారంలోకి రావడానికి ప్రధాన కారణం పవన్ కళ్యాణ్. అందుకే మోడీతో పాటు అమిత్ షా పవన్ కళ్యాణ్ విషయంలో ప్రత్యేక గౌరవంతో ఉంటారు. అందుకే త్వరలో నరేంద్ర మోడీ పవన్ కళ్యాణ్ కు దేశవ్యాప్తంగా ఒక బాధ్యత కట్టబెడతారని పొలిటికల్ వర్గాల్లో ప్రచారం ఉంది. దేశవ్యాప్తంగా సనాతన ధర్మ రక్షణ, సామాజిక సమతుల్యం, యువతను దేశ నిర్మాణం వైపు మళ్లించడం వంటి అజెండాలతో.. జనసేన ను జాతీయస్థాయిలో బలోపేతం చేయాలని పవన్ భావిస్తున్నట్లు తెలుస్తోంది.సాధారణంగా దక్షిణాది రాష్ట్రాల నుంచి జాతీయస్థాయి రాజకీయాల్లో రాణించాలనుకునేవారు చాలా తక్కువ. ఒకవేళ వారు వెళ్లిన ప్రాంతీయ ప్రయోజనాల కోణంలోనే చూస్తుంటారు తప్ప.. సమైక్య భావనతో కాదు. ఆ శూన్యతను భర్తీ చేయాలనుకుంటున్నారు పవన్ కళ్యాణ్. హిందీ తో పాటు ఇంగ్లీష్ లో ఉన్న పట్టు, ఉత్తరాది రాష్ట్రాల్లో ఆయనకున్న క్రేజ్, సనాతన ధర్మంపై ఆయనకు ఉన్న స్పష్టమైన స్టాండ్, జాతీయస్థాయిలో ఉన్న పలుకుబడి, ఏపీ ప్రజల మద్దతు వెరసి.. దేశ రాజకీయాలను ప్రభావితం చేయగల సామర్థ్యం పవన్ కళ్యాణ్ సొంతం. పవన్ కళ్యాణ్ కేవలం ఏపీ డిప్యూటీ సీఎం పదవితో ఆగిపోకుండా.. దేశ రాజకీయ గమనంలో తనదైన ముద్ర వేయడానికి సిద్ధం కావడం జనసైనికుల్లో జోష్ నింపుతోంది. ఢిల్లీ పెద్దలతో ఆయనకు వ్యూహాత్మక సంబంధాలు జాతీయ నాయకుడిగా తీర్చిదిద్దుతాయని జనసైనికులు బలంగా భావిస్తున్నారు. చూడాలి మరి ఏం జరుగుతుందో?

# అనిత వర్సెస్ అమర్నాథ్..

**విశాఖపట్టణం** టీడీపీ మంత్రి? అండ్ వైసీపీ పశ్చిమ గోదావరి జిల్లా సమన్వయకర్త. ఈ ఇద్దరు నేతల కేరాఫ్ అడ్రస్ అనకాపల్లి జిల్లానే. రాజకీయంగా టామ్ అండ్ జెర్రీ ఫైటింగే. రెండు పార్టీలకు చెందిన మిగిలిన నేతలు కాస్త అటో ఇటో సంయమనం పాటించినా.. ఈ ఇద్దరిది మాత్రం ఛాన్స్ దొరికితే రప్పా.. రప్పానే..! తాము ప్రతిపక్ష నేతగా.. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు పదునైన వ్యాఖ్యలతో విరుచుకుపడే వారు అనిత. ఆమెకు కౌంటర్ ఇవ్వడానికి అమర్నాథ్ ఘాటుగానే స్పందించే వారు. ఇక కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఉమ్మడి విశాఖ జిల్లా నుంచి ఏకైక మంత్రి అయ్యారు అనిత. అందులోనూ? హోం లాంటి పవర్ ఫుల్ శాఖకు మంత్రి కావడంతో ఆమె మీద అటెన్షన్ పెరిగింది. టీడీపీ అధిష్టానానికి దగ్గరగా ఉండటం, కీలక కమిటీల్లో సభ్యురాలు అవడం వంటి కారణాలతో అనిత ప్రాధాన్యత బాగా పెరిగిందన్నది విస్తృతాభిప్రాయం. అదే సమయంలో హోం మంత్రి రాజకీయంగా చేసే విమర్శలు ఇటీవల ఘాటెక్కాయి. మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిని ఉద్దేశించి చేసే వ్యాఖ్యలపై ఆ పార్టీ నేతలు మండి పడుతూ ఉంటారు. ఈ క్రమంలో అనిత దూకుడుకు బ్రేకులు వేయాల్సిందేనని డిసైడ్ అయ్యారట వైసీపీ లీడర్స్. తమ అధినేత, ఆయన కుటుంబ సభ్యుల పట్ల హోం మంత్రి వాడే భాష సరిగా లేదంటూ ఆమెకు.. ఆ భాషలోనే సమాధానం చెబుతామని హెచ్చరిస్తుంటారు ప్రతిపక్ష నాయకులు చాలామంది.అయితే? ఆ విషయంలో అందరికంటే ముందుగా కుండబద్దలు కొట్టేశారు మాజీ మంత్రి అమర్నాథ్. వెన్నుపోటుకు రెండేళ్ళు పేరుతో చోడవరంలో భారీ బైక్ ర్యాలీ చేశారు అమర్నాథ్. ఈ సందర్భంగా ఆయన చేసిన వ్యాఖ్యలు రాజకీయ కాక రేపాయి. జిల్లాలో ఒక మేకప్ మంత్రి ఉన్నారంటూ మొదలుపెట్టి.. మాజీ మినిస్టర్ చేసిన వ్యాఖ్యలు దుమారం రేపుతున్నాయి. మా మేడంను అంత మాట అంటారా అంటూ పాయకరావుపేట టీడీపీ నాయకులు ముందు గళం విప్పారు. ఆ తర్వాత తెలుగు మహిళలు తెరపైకి వచ్చి తమదైన శైలిలో నిరసన వ్యక్తం చేశారు. కోడిగుడ్లతో అమర్నాథ్ ఫ్లెక్సీ మీద కొట్టి దిష్టి బొమ్మ దగ్ధం చేసి ఆగ్రహం వ్యక్తం చేశారు. కానీ? అదంతా దిగువ స్థాయిలోనే. కానీ.. ఉమ్మడి విశాఖ జిల్లాకు చెందిన ఏకైక మంత్రిని ఉద్దేశించి మాజీ మంత్రి చేసిన వ్యాఖ్యలపై ఎమ్మెల్యేలు పెద్దగా ఎందుకు రియాక్ట్ అవలేదన్నది బిగ్ క్వశ్చన్. విశాఖ జిల్లాలో టీడీపీ పూర్తి ఆధిపత్యం ప్రదర్శిస్తోంది. అయినా ఎమ్మెల్యేల స్థాయిలో రియాక్షన్స్ లేకపోవడానికి కారణాలను వెదుకుతున్నాయి రాజకీయ వర్గాలు. అమర్నాథ్ చోడవరంలో అలాంటి అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారు కాబట్టి? మీ అభిప్రాయం ఏంటని మీడియా అడిగితే స్థానిక ఎమ్మెల్యే రాజు స్పందించారు. రాజకీయాల్లో భాష హుందాగా ఉండాలని, అమర్ వ్యాఖ్యలను ఖండిస్తున్నామని ముక్తసరిగా చెప్పి వదిలేశారు.ఇక మూడు రోజుల తర్వాత పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ స్పందించారు. అమర్నాథ్ బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అంతకు మించి మిగతా కూటమి ఎమ్మెల్యేలు ఎవ్వరూ కిక్కురుమనలేదు. మాట్లాడిన ఇద్దరూ కూడా ఏదో తప్పదన్నట్టు స్పందించారన్న అభిప్రాయం ఉంది. మామూలుగా అయితే.. రాష్ట్ర హోం మంత్రి, అందునా పార్టీ పొలిట్ బ్యూరో సభ్యురాలిని ఉద్దేశించి ఆ స్థాయిలో మాజీ మంత్రి వ్యాఖ్యలు చేసినప్పుడు ఎదురు దాడి నెక్స్ట్ లెవల్‌లో ఉండాలి. పార్టీ నాయకత్వం మొత్తం మూకుమ్మడిగా విరుచుకుపడితేందా అనే భావన ప్రజల్లోకి, పార్టీ శ్రేణుల్లోకి బలంగా వెళ్ళాలి. కానీ ఇక్కడ అలాంటివేం జరక్కపోగా.. తప్పదన్నట్టుగా ఇద్దరు స్పందించారు. మిగతా వాళ్ళంతా మాకేం సంబంధం అన్నట్టుగా ఎందుకు ఉన్నారంటూ ఆరా తీస్తున్నారు పొలిటికల్ పరిశీలకులు. కూటమిగా కాకపోయినా కనీసం టీడీపీ సీనియర్ ఎమ్మెల్యేలుగా అయినా మాజీ మంత్రికి గట్టి కౌంటర్ ఇవ్వవచ్చుగానీ.. ఆ పని కూడా చేయలేకపోవడానికి ప్రత్యేక కారణాలు ఏవైనా ఉన్నాయా అంటూ ఎంక్వైరీ చేస్తున్నారు. ఈ పరిస్థితికి మంత్రి, ఎమ్మెల్యేల మధ్య సమన్వయ లోపమే ప్రధాన కారణం అన్న చర్చ స్థానికంగా జరుగుతోంది. అనితతో పోలిస్తే ఇక్కడ కూటమిలో ఉన్న ఎమ్మెల్యేలంతా రాజకీయంగా సీనియర్లు. అలాంటి చాలా మందికి అవకాశాలు ఆలస్యంగా వస్తే.. అనిత దశాబ్ద కాలంలోనే రెండు సార్లు ఎమ్మెల్యేగా, మంత్రిగా ఛాన్స్ దక్కించుకున్నారు.కేబినెట్‌తో పాటు హైకమాండ్ దగ్గర లభిస్తున్న ప్రయారిటీ కారణంగా ఆమె జిల్లా ఎమ్మెల్యేలను సమన్వయం చేసుకునే విషయంలో కాస్త అలసత్వం ప్రదర్శించారని, ఇంకా చెప్పాలంటే నాకేంటి అన్నట్టు వ్యవహరిస్తున్నారన్న మాటలు వినిపిస్తున్నాయి. విశాఖ సిటీ శాసనసభ్యులు అయితే స్థానిక వ్యవహారాల్లో మంత్రిగా అనిత జోక్యాన్ని అస్సలు అంగీకరించడం లేదన్న గుసగుసలు ఉన్నాయి. అందుకే శాఖాపరమైన అంశాల మీద తప్ప విశాఖ నగరానికి సంబంధించిన వ్యవహారాల్లో ఆమె ప్రమేయం బాగా తగ్గిందని అంటున్నారు. ఇక్కడ తగ్గింది అనడం కంటే తగ్గించారనడమే కరెక్ట్ అన్నది చాలామంది ఫీలింగ్. ఇక అనకాపల్లి జిల్లా ఎమ్మెల్యేలతోనూ దాదాపు ఇదే వ్యవహార శైలి ఉందట. జిల్లాకు సంబంధించిన అంశాల మీద ఎమ్మెల్యేలతో సమావేశాలు పెట్టడంగానీ, వాళ్ళ అభిప్రాయాలు తీసుకుని అందుకు అనుగుణంగా నిర్ణయాలు అమలు చేయడం కానీ లేదట. అన్నింటికి కేరాఫ్ హైకమాండ్ అంటున్నారని.. అలాంటప్పుడు ఆమెను ఎవరో ఏదో అంటే.. మేం రాజకీయ ఎదురుదాడికి ఎందుకు వెళ్ళాలని ఓ సీనియర్ నేత అన్నారట. దీంతో.. ఉమ్మడి విశాఖ జిల్లాలో హోం మంత్రి ఒంటరి అయ్యారా అన్న సందేహాలు వస్తున్నాయట పరిశీలకులకు. ఈ ఎపిసోడ్ తర్వాత అది క్లియర్‌గా కనిపిస్తోందన్నది వాళ్ళ ఒపీనియన్.

## 19న కూటమి సక్సెస్ రీ సౌండ్

**విశాఖపట్టణం :** ఏపీలో టీడీపీ కూటమి రెండేళ్ళ పాలన పూర్తి అయిన సందర్భంగా విజయోత్సవాలను నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా తొలి సభను రాయలసీమ రీజియన్ లో నిర్వహించారు. అది బ్రహ్మాండమైన తీరులో సక్సెస్ అయింది అని కూటమి నేతలు అంతా ఫుల్ ఖుషీగా ఉన్నారు. ఈ నేపథ్యంలో విశాఖలో రెండవ సభకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ వారాంతంలో విశాఖలో పెద్ద ఎత్తున సభను నిర్వహించి ఉత్తరాంధ్రాలో కూటమి సక్సెస్ మీద రీసౌండ్ చేయాలని భావిస్తున్నారు.ఈసారి విశాఖలో నిర్వహించే సభకు కేంద్ర మంత్రులు పలువురు హాజరవుతారని అంటున్నారు. అలాగే ఏపీలోని కీలక మంత్రులు అంతా ఈ సభకు వస్తారని చెబుతున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, జనసేన అధినేత పవన్ కళ్యాణ్, బీజేపీ ఏపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, మంత్రి నారా లోకేష్ తో పాటు కేంద్ర మంత్రులు అశ్విని వైష్ణవ్ రామ్మోహన్ నాయుడు సహా అంతా ప్రసంగించబోతున్నారు. కేంద్రంలో నరేంద్ర మోడీ పాలనకు 12 ఏళ్ళు పూర్తి కావడంతో ఆ సంబరాలను అలాగే ఏపీలో కూటమి రెండేళ్ళ విజయోత్సవాలను కలిపి నిర్వహిస్తామని చెబుతున్నారు ఈ నెల 19న విశాఖలోని ఆంధ్రా యూనివర్సిటీ ఇంజనీరింగ్ కాలేజ్ మైదానంలో నిర్వహించే ఈ సభకు ఏర్పాట్లు జోరుగా చేస్తున్నారు. వేలాదిగా ప్రజానీకం ఈ సభకు హాజరవుతుందని అంచనా వేస్తున్నారు. ఉత్తరాంధ్రాలో కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధి కార్యక్రమాలను ఈ సందర్భంగా కూటమి నేతలు తెలియ చేస్తారని అంటున్నారు. రెండేళ్ళలో పెద్ద ఎత్తున పరిశ్రమలు విశాఖ సహా మూడు జిల్లాలకు వచ్చిన సంగతిని కూడా గుర్తు చేస్తున్నారు. కూటమికి ఉత్తరాంధ్రాలో ఇప్పటికే రాజకీయంగా మంచి పట్టు ఉంది. దానిని మరింతగా బిగించేందుకు ఈ విజయోత్సవ సభను ఉపయోగించుకుం టారని అంటున్నారు. రానున్న కాలంలో స్థానిక సంస్థలు జరగనున్నాయి. దాంతో ఆ ఎన్నికల కోసం కూడా ఈ తరహా సభని వినియోగించుకోవాలన్న ప్రణాళికతో కూటమి పెద్దలు ముందుకు సాగుతున్నారు. 2024లో జరిగిన ఎన్నికల్లో ఏక పక్షంగా ఉత్తరాంధ్ర కూటమికి జై కొట్టింది. ఏజెన్సీలో రెండు సీట్లు తప్ప మొత్తం అన్నీ కూటమి పార్టీలే గెలుచుకున్నాయి. ఇపుడు తాము అభివృద్ధి చేసి చూపిస్తున్నామని కూటమి నేతలు చెబుతున్నారు. మొత్తం మీద చూస్తే ఈ నెల 19న జరిగే సభ అదిరిపోయే లెవెల్ లో ఉంటుందని కూటమి నాయకులు చెబుతున్నారు. తిరుపతి సభను మించేలా జరపాలని చూస్తున్న కూటమి నేతల ప్రయత్నాలు ఒక ఎత్తు అయితే విశాఖ సభ చేసే రీ సౌండ్ పొలిటికల్ గా ఏపీలో ఎలాంటి పరిణామాలకు దారి తీస్తుంది అన్నది చర్చగా ఉంది. చూడాలి మరి ఈ సభలో చంద్రబాబు పవన్ లోకేష్ ఇచ్చే స్పీచ్ ల వేడి వాడి ఎలా ఉండబోతోందో.

## మళ్లీ యాక్టివ్ కానున్న భార్గవ్ రెడ్డి

**విజయవాడ,** అధికారం పోయాక అగ్రెసివ్నెస్ పోయింది.. టూ-ఫ్యాక్టర్ అథెంటికేషన్ పెట్టడం మరచిపోయి అకౌంట్‌నే పోగొట్టుకున్నారా? వైసీపీ సోషల్ మీడియాకు పట్టిన 'హ్యాకింగ్' గ్రహణాన్ని వీడించాలంటే.. మళ్లీ ఆ 'భార్గవ' రాముడే రావాలా? ఇప్పుడు నెట్టింట ఇదే చర్చ నడుస్తోంది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా విభాగంలో ఇటీవల జరిగిన ఒక పరిణామం రాజకీయ వర్గాల్లో తీవ్ర కలకలం రేపుతోంది. వైసీపీ అధికారిక ఫేస్‌బుక్ అకౌంట్ హ్యాక్‌కు గురికావడం.. అందులో హ్యాకర్లు అసభ్యకరమైన కంటెంట్‌ను పోస్ట్ చేయడంతో మెటా యాజమాన్యం ఆ పేజీని బ్లాక్ చేసింది. ఈ ఘటన పార్టీ శ్రేణులను తీవ్రగ్భ్రాంతికి గురిచేయడమే కాకుండా వైసీపీ సోషల్ మీడియా విభాగ నిర్వహణలో ఉన్న లోపాలను ఎత్తిచూపుతోంది. ప్రస్తుతం నెటిజన్లు, పార్టీ మద్దతుదారుల మధ్య ఒకే ఒక చర్చ నడుస్తోంది.. "వైసీపీ సోషల్ మీడియా మళ్లీ పూర్వవైభవం సాధించాలంటే సజ్జల భార్గవ్ రెడ్డి మళ్లీ బాధ్యతలు చేపట్టాల్సిందేనా? అన్న చర్చ సాగుతోంది. సాధారణంగా ఒక ప్రధాన రాజకీయ పార్టీకి సంబంధించిన అధికారిక సోషల్ మీడియా ఖాతాలకు అత్యున్నత స్థాయి భద్రత ఉండాలి. కానీ తాజా హ్యాకింగ్ ఘటన చూస్తుంటే అడ్మిన్లు కనీస జాగ్రత్తలు తీసుకోలేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సైబర్ నిపుణుల అభిప్రాయం ప్రకారం అడ్మిన్లలో ఎవరో ఒకరు అనుమానాస్పద లింక్‌లను క్లిక్ చేయడం... సిస్టమ్ లేదా అకౌంట్ పాస్‌వర్డ్‌లను చాలా సాదాసీదాగా ఉంచడం... టూ-ఫ్యాక్టర్ ఆథెంటికేషన్ వంటి ప్రాథమిక భద్రతా ప్రమాణాలను ఎనేబుల్ చేయకపోవడం.. ఇలాంటి సాంకేతిక నిర్లక్ష్యం వల్లే లక్షలాది మంది ఫాలోవర్లు ఉన్న అధికారిక పేజీ హ్యాకర్ల చేతుల్లోకి వెళ్ళిపోయిందని.. ఇది పార్టీ ప్రతిష్టకు భంగం కలిగించే అంశమని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.ఆ తర్వాత మందగమనం వైసీపీ 2014 నుండి 2019 వరకు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు దాని సోషల్ మీడియా వింగ్ అత్యంత 'ఆర్గానిక్'గా పకడ్బందీగా పనిచేసింది. అప్పట్లో ప్రత్యర్థులపై డిజిటల్ వేదికలపై వైసీపీ సాధించిన పైచేయి పార్టీని అధికారంలోకి తీసుకురావడంలో కీలక పాత్ర పోషించింది. అయితే 2019లో అధికారంలోకి వచ్చిన తర్వాత వైసీపీ సోషల్ మీడియాలో ఆ పాత దూకుడు కనిపించలేదు. ప్రభుత్వంలో బిజీ అయిపోవడం వల్లో..లేదా సరైన లీడర్‌షిప్ లేకపోవడం వల్లో కానీ డిజిటల్ వేదికలపై పార్టీ పట్టు సడలిందనేది వాస్తవం.అగ్రెసివ్ పాలిటిక్స్ ఈ క్రమంలోనే సజ్జల భార్గవ్ రెడ్డి వైసీపీ సోషల్ మీడియా బాధ్యతలను స్వీకరించారు. ఆయన ఎంట్రీతో సీన్ పూర్తిగా మారిపోయింది. భార్గవ్ రెడ్డి తన టీమ్‌తో కలిసి సోషల్ మీడియాను అత్యంత వ్యూహాత్మకంగా, అగ్రెసివ్‌గా మార్చారు. కార్యకర్తల అభిప్రాయం ప్రకారం .. "భార్గవ్ రెడ్డి ఉన్నప్పుడు ప్రతిపక్షాల విమర్శలను తిప్పికొట్టడంలో సోషల్ మీడియా సైన్యం క్షణం కూడా ఆలస్యం చేయలేదు. టెక్నికల్ సెక్యూరిటీతో పాటు పొలిటికల్ కౌంటర్లలోనూ ఆయన టీమ్ పర్ఫెక్ట్ సిస్టమాటిక్ అప్రోచ్‌ను ఫాలో అయ్యింది. అయితే ఇటీవల ప్రభుత్వం దిగిపోయిన తర్వాత భార్గవ్ రెడ్డి, ఆయన కోర్ టీమ్ వైసీపీ సోషల్ మీడియా బాధ్యతల నుంచి తప్పుకున్నారు.

వారు పక్కకు తప్పుకున్న కొద్ది రోజులకే ఇలాంటి భారీ భద్రతా లోపం జరగడం.. ఏకంగా ఫేస్‌బుక్ పేజీనే కోల్పోవాల్సి రావడం ఇప్పుడు చర్చనీయాంశమైంది. ప్రస్తుతం సోషల్ మీడియా వేదికల్లో వైసీపీ అభిమానులు, కార్యకర్తలు ఒకే విషయాన్ని డిమాండ్ చేస్తున్నారు. మళ్లీ భార్గవ్ రెడ్డినే రంగంలోకి దించాలని కోరుతున్నారు. ఆయన వస్తేనే సోషల్ మీడియా మళ్లీ గాడిలో పడుతుందని.. ప్రత్యర్థులకు గట్టి కౌంటర్లు ఇవ్వడం సాధ్యమవుతుందని గట్టిగా నమ్ముతున్నారు. వ్యక్తుల మార్పు కంటే సోషల్ మీడియా నిర్వహణకు బలమైన సైబర్ భద్రతా వ్యవస్థలు అవసరమని నిపుణులు చెబుతున్నప్పటికీ రాజకీయాల్లో వ్యూహాలు ప్రతివ్యూహాలు నడపడానికి సమర్థుడైన లీడర్ అవసరం.

### చైతన్యపురిలో పోలీస్
## అభ్యర్థుల మహా ధర్నా

**హైదరాబాద్** పోలీస్ నియామకాల్లో వయోపరిమితి పెంపుతో పాటు పెండింగ్లో ఉన్న నోటిఫికేషన్లను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ పోలీస్ అభ్యర్థుల జేఏసీ ఆధ్వర్యంలో చైతన్యపురిలో మహా ధర్నా నిర్వహించారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో పోలీస్ అభ్యర్థులు ఈ కార్యక్రమానికి హాజరై తమ నిరసనను వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా అభ్యర్థులు మాట్లాడుతూ, 19/20 పే స్కేల్ ఉద్యోగాల భర్తీకి సంబంధించిన నోటిఫికేషన్లను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. అలాగే కానిస్టేబుల్ పోస్టులకు 36 సంవత్సరాలు, ఎస్ఐ పోస్టులకు 38 సంవత్సరాల వయోపరిమితి కల్పించాలని డిమాండ్ చేశారు.
నిరుద్యోగ యువత భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. తమ న్యాయమైన డిమాండ్లపై స్పందించి వెంటనే చర్యలు చేపట్టాలని కోరారు.

### అక్రమ ఇసుక మాఫియాపై
## మైనింగ్ విజిలెన్స్ ఉక్కుపాదం..!

**- ఇందిరమ్మ ఇండ్ల పేరుతో సాగిన ఇసుక దందా బట్టబయలు**

**వికారాబాద్** వికారాబాద్ జిల్లా తాండూర్ నియోజకవర్గంలో అక్రమ ఇసుక మాఫియాపై మైనింగ్ విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ శాఖ కొరడా ఝుళిపించింది. ఇందిరమ్మ ఇండ్లు, నేషనల్ హైవే పనుల పేరుతో అక్రమంగా కొనసాగుతున్న ఇసుక రవాణాపై మంగళవారం ఆకస్మిక దాడులు నిర్వహించి మొత్తం 15 ట్రాక్టర్లను స్వాధీనం చేసుకుంది.విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ డీజీ డి.ఎస్. చౌహాన్, హైదరాబాద్ రూరల్ ఎస్పీ అశోక్ ఆదేశాల మేరకు ప్రత్యేక బృందాలు యాలాల, తాండూర్ ప్రాంతాల్లో విస్తృత తనిఖీలు చేపట్టాయి. ఈ సందర్భంగా అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను గుర్తించి అడ్డుకున్నారు.విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహిస్తున్న విషయం తెలుసుకున్న డ్రైవర్లు, కూలీలు ట్రాక్టర్లను అక్కడికక్కడే వదిలేసి పరారయ్యారు. స్వాధీనం చేసుకున్న వాహనాల్లో 9 ట్రాక్టర్లపై కేసులు నమోదు చేసిన అధికారులు, మిగిలిన వాహనాల యజమానులు, నిర్వాహకుల వివరాలను సేకరిస్తున్నారు.ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం, నేషనల్ హైవే పనుల పేరుతో కొందరు అక్రమంగా ఇసుకను తరలిస్తూ ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండికొడుతున్నారని అధికారులు గుర్తించారు. ఇలాంటి అక్రమ కార్యకలాపాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని విజిలెన్స్ అధికారులు హెచ్చరించారు.తాండూర్, యాలాల మండలాల్లో గత కొంతకాలంగా విస్తృతంగా కొనసాగుతున్న ఇసుక దందాపై విజిలెన్స్ శాఖ చేపట్టిన ఈ సడెన్ ఆపరేషన్తో ఇసుక మాఫియాలో కలకలం రేగింది. భవిష్యత్తులో కూడా అక్రమ ఇసుక రవాణాపై ప్రత్యేక నిఘా కొనసాగుతుందని అధికారులు స్పష్టం చేశారు.

### ప్రజా సమస్యలపై
## నిత్యం పోరాడేది కమ్యూనిస్టులే

**హనుమకొండ** ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలని, లేకపోతే ప్రజల్లో తీవ్ర అసంతృప్తి పెరిగి ప్రభుత్వంపై తిరుగుబాటు అనివార్యమవుతుందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు హెచ్చరించారు.హనుమకొండ జిల్లా గుండ్లసింగారం భూపోరాట కేంద్రంలో నిర్మించిన "సురవరం సుధాకర్ రెడ్డి నగర్" సిపిఐ కార్యాలయాన్ని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావుతో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి తోట బిక్షపతి అధ్యక్షతన జరిగిన సభలో ఆయన ప్రసంగించారు.ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు, ప్రభుత్వ భూములపై గుడిసెలు వేసుకుని నివసిస్తున్న పేదలకు జీవో 58 ప్రకారం పట్టాలు ఇస్తామని హామీ ఇచ్చిందని, అయితే అధికారంలోకి వచ్చిన తరువాత ఆ హామీల అమలులో నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందని విమర్శించారు.రాష్ట్రంలో లక్షలాది మంది నిరుపేదలకు ఇప్పటికీ సొంత ఇల్లు లేదని, స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు గడిచినా పేదల జీవన పరిస్థితుల్లో ఆశించిన మార్పు రాలేదని అన్నారు. సిపిఐ ఆధ్వర్యంలో అనేక ప్రాంతాల్లో భూపోరాటాలు నిర్వహించి గుడిసెలు వేసుకుని నివసిస్తున్న పేదలందరికీ ప్రభుత్వం వెంటనే పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడేది కమ్యూనిస్టు పార్టీలేనని, పాలకులు పేదల సంక్షేమాన్ని విస్మరించి కార్పొరేట్ శక్తులకు అనుకూల విధానాలు అమలు చేస్తున్నారని విమర్శించారు. కమ్యూనిస్టుల పోరాటాల వల్లే తెలంగాణ విముక్తి సాధ్యమైందని, ప్రజా హక్కుల పరిరక్షణలో కమ్యూనిస్టుల పాత్ర చారిత్రాత్మకమని పేర్కొన్నారు.గుండ్లసింగారం కాలనీవాసులు ఎంతో దీక్ష, పట్టుదలతో కాలనీ నిర్మించుకుని ఆదర్శంగా నిలిచారని అభినందించారు. కాలనీలో నివసిస్తున్న పేదలందరికీ ఇండ్ల పట్టాలు వచ్చేలా అధికారులతో, స్థానిక ఎమ్మెల్యేతో, అవసరమైతే ముఖ్యమంత్రితో కూడా మాట్లాడుతానని హామీ ఇచ్చారు.సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ, గుడిసెవాసుల హక్కుల సాధన కోసం సిపిఐ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని అన్నారు. కాలనీలో విద్యుత్, తాగునీరు, రహదారులు, పారిశుధ్యం తదితర మౌలిక సదుపాయాలు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు.
ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, జిల్లా సహాయ కార్యదర్శులు తోట బిక్షపతి, మద్దెల ఎల్లేష్, రాష్ట్ర సమితి సభ్యులు అదరి శ్రీనివాస్, మండ సదాలక్ష్మి, ఎఐవైఎఫ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు డా. సయ్యద్ వలి ఉల్లా ఖాద్రి, హనుమకొండ మండల కార్యదర్శి ఎన్.ఏ. స్టాలిన్, జిల్లా నాయకులు, కాలనీ ప్రతినిధులు, మహిళా నాయకులు, యువజన నాయకులు, వందలాది మంది కాలనీవాసులు పాల్గొన్నారు.

## తెలంగాణ శాసన సభా పతి
### రైతుల మీద కేసులు పెట్టి జైలుకు పంపుతారా?

**- డాక్టర్ మెతుకు ఆనంద్**

**వికారాబాద్** అమ్మ పెట్టదు అడుక్కోనివ్వదు అన్న చందంగా కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తుంది. హామీలను నెరవేర్చకుంటే ప్రభుత్వంపై తిరుగుబాటు తప్పదని బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు అనంద్ అన్నారు.

మర్పల్లి మండలం, తుమ్మలపల్లి గ్రామంలో అభివృద్ధిని అడ్డుకుంటున్న స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ రోడ్డు పక్కన గ్రామంలో గుంతలు ప్రభుత్వం పూల్చడం లేదు, ప్రజలు శ్రమదానం చేసి పూడ్చుకుంటామంటే కేసులు పెడతామంటుండ్రని అన్నారు.
రైతులు పొలాలకు కంతతోవను సాఫ్ చేసుకుంటే వాళ్లను జైలుకు పంపిస్తాం అంటుండు. యథా రాజా తథా ప్రజా అన్నట్టు.. రైతుల విషయంలో రేవంత్ రెడ్డి గారు ఏది చేస్తుందో స్పీకర్ గారు దాన్ని అచరిస్తున్నారు. తుమ్మలపల్లి లో బిఆర్ఎస్ సర్పంచి ఉన్నాడని కక్షగట్టి ఈ విధంగా చేస్తున్నారని ఆరోపించారు.

# ‘రమణి కల్యాణం’ మూవీ రివ్యూ!



సూర్య వశిష్ఠ – దీప్సిక చంద్రన్ ప్రధానమైన పాత్రలను పోషించిన సినిమానే ‘రమణి కల్యాణం’. విజయ్ ఆదిరెడ్డి దర్శకత్వం వహించిన ఈ సినిమా, మే 22వ తేదీన థియేటర్లలో విడుదలైంది. ఈ నెల 12వ తేదీ నుంచి ‘ఈటీవీ విన్’ లో స్ట్రీమింగ్ అవుతోంది. ఈ సినిమా కథేమిటనేది ఇప్పుడు చూద్దాం. సంజన (దీప్సిక) చూపులేని అమ్మాయి. తల్లిదండ్రులను కోల్పోయిన ఆమె, బామ్మ దగ్గరే పెరుగుతుంది. అనాథలైన నలుగురు పిల్లలను దత్తత చేసుకుని వాళ్ల ఆలనా పాలనా చూస్తుంటుంది. ఒక వైపున పబ్ లో సింగర్ గా.. మరో వైపున ఒక ఎఫ్ ఎమ్ రేడియోలో ఆర్జేగా పనిచేస్తుంటుంది. తనకి చూపు లేకపోవడాన్ని ఒక లోపంగా భావించడం ఆమెకి ఎంతమాత్రం ఇష్టం ఉండదు. ఆత్మవిశ్వాసంతో ముందుకు వెళుతుంటుంది. అలాంటి సమయంలోనే ఆమెకి రాజ్ (సూర్య వసిష్ఠ) తారసపడతాడు. రాజ్ మంచి కవి .. అతని రెండు కాళ్లూ పనిచేయవు.అందువలన అతను వీల్ ఛైర్ కి పరిమితమవుతాడు. అనాథగా మిగిలిపోయిన రాజ్ ను అతని స్నేహితులైన కిశోర్ – గీత (శ్రీనివాసరెడ్డి – శ్యామల) దంపతులు చూసుకుంటూ ఉంటారు. రెండు కాళ్లను కోల్పోయిన కారణంగా రాజ్ చాలా డీలాపడిపోతాడు. పోయింది నడక మాత్రమే తప్ప, భవిష్యత్తు కాదనే సంజన మాటలు అతనిలో కొత్త ఆశలను రేకెత్తిస్తాయి. వాళ్లిద్దరి మధ్య పరిచయం ప్రేమగా మారుతుంది. సంజనకి చూపులేని కారణంగా సంబంధాలు రావడమే కష్టమైపోతుంది. వచ్చిన సంబంధాలు ఆమె పెంచుతున్న పిల్లల కారణంగా వెళ్లిపోతుంటాయి. అలాంటి సమయంలో ఆమె రాజ్ ను ప్రేమించడం బామ్మకు ఆనందాన్ని కలిగిస్తుంది. ఇక ఒంటరిగా మిగిలిపోయిన దగ్గర నుంచి కుమిలిపోతున్న రాజ్, సంజన రాకతో సంతోషంగా ఉండటం కిశోర్ దంపతులకు ఆనందాన్ని ఇస్తుంది. సంజన – రాజ్ పెళ్లి చేసుకుందామని అనుకుంటూ ఉండగా ఒక అనూహ్యమైన సంఘటన జరుగుతుంది. అదేమిటి? అది వాళ్ల జీవితాలను ఎలా ప్రభావితం చేస్తుంది? అనేది కథ.చూపులేని అమ్మాయి .. కాళ్లు లేని అబ్బాయి. ఒకరు కవి అయితే .. మరొకరు గాయని. అలాంటి ఈ ఇద్దరి మధ్య నడిచే ప్రేమకథ ఇది. ఇద్దరూ ఆయా సందర్భాలలో తల్లిదండ్రులను కోల్పోయినవారే. అలాంటి ఆ ఇద్దరూ కలిసి నడవాలని అనుకుంటారు .. కలిసి బతకాలని నిర్ణయించుకుంటారు. సన్నిహితులంతా వాళ్ల నిర్ణయం పట్ల హర్షాన్ని వ్యక్తం చేస్తారు. అలాంటి ఆ సమయంలో ఏం జరిగిందనే ఒక అంశం చుట్టూ దర్శకుడు ఈ కథను నడిపించాడు. ఫస్టాఫ్ అంతా హీరో – హీరోయిన్ పరిచయం, ఆ పరిచయం ప్రేమకి దారితీయడం వంటి సన్నివేశాలతో ఈ కథ ముందుకు వెళుతుంది. ఇద్దరి ఫ్లాష్ బ్యాకులు కూడా ఫస్టాఫ్ లోనే వచ్చేస్తాయి. ఈ సమయంలో వచ్చే బ్యాంగ్ తోనే ఇంటర్వెల్ కార్డు పడుతుంది. ఆ తరువాత నుంచి కథలో చోటుచేసుకునే సన్నివేశాలు ఎలా ఉండనున్నాయి? అనే ఒక ఆసక్తి ఆడియన్స్ లో మొదలవుతుంది. ప్రీ క్లైమాక్స్ తో వచ్చే ట్విస్ట్ తో ఈ కథను క్లైమాక్స్ దిశగా పరిగెత్తించారు. చూపులేని హీరోయిన్ .. కాళ్లు లేని హీరో అనగానే, ఎంజాయ్ చేయలేని ప్రేక్షకులు అనే మాటనే ఆ తరువాత వినిపిస్తుంది. చూపులేని వాళ్లను హీరోయిన్ రోడ్డు దాటిస్తుంటే ఆడియన్స్ ముచ్చట పడతారు. కాళ్లు లేనివారికి హీరో సాయం చేస్తే శభాష్ అంటూ మెచ్చుకుంటారు. కానీ హీరోయిన్ కే చూపులేకపోతే, హీరోకే కాళ్లు లేకపోతే .. అనే ఆలోచనకు దృశ్య రూపమే ఈ సినిమా. అయ్యో పాపం ఇద్దరికీ ఇలా అయిందే అనుకుంటూ సర్దుకుపోదామని అనుకుంటే, ఆ ఇద్దరూ తమ తల్లిదండ్రులను వేరు వేరు సంఘటనలలో కోల్పోవడం తాలూకు ఫ్లాష్ బ్యాకులొచ్చి మీద పడతాయి. వాటి బరువు మోయలేక ఆడియన్స్ విలవిలలాడుతూ ఉండగానే, మరో ట్విస్ట్. తెరపై హీరో– హీరోయిన్ లను కోలుకోనీయలేదు .. ఆడియన్స్ ను తేరుకోనీయలేదు. హీరో – హీరోయిన్స్ ను అలా చూడగానే ఆడియన్స్ వినోదం శూన్యమనుకునే కూర్చుంటారు. అయినా ఊహించుకోవచ్చుగదా అన్నట్టుగా పాటలు పెట్టారు. అవి కూడా అంతంత మాత్రమే. చూపులేని అమ్మాయిగా చేయడానికి హీరోయిన్ .. కాళ్లు లేనివాడిగా కనిపించడానికి హీరో చాలా కష్టపడ్డారని అనుకోవడం సహజం. కానీ నిజానికి అసలైన కష్టం ఆడియన్స్ దేనని చెప్పాలి. ఆ ఇద్దరినీ అలా చూస్తూ కూర్చోవడం అంత సామాన్యమైన విశేషమేం కాదు మరి. అరవింద్ తిరుకోవేల ఫొటోగ్రఫీ .. రవితేజ గిరిజాల ఎడిటింగ్ .. సూరజ్ కురుప్ సంగీతం ఓ మాదిరిగా అనిపిస్తాయి.ఇలాంటి కథలు 1980లలో చాలానే వచ్చాయి. సెంటిమెంట్ .. ఎమోషన్స్ తాలూకు కంటెంట్ ను ప్రేక్షకులు ఆదరించిన రోజులవి. కానీ ఇప్పుడు ఈ తరహా కథలతో ఆడియన్స్ ను మెప్పించడం కష్టమనే చెప్పాలి.

హీరో – హీరోయిన్స్ కి శారీరక లోపాలు కలిగించి, వాళ్ల ద్వారా అన్నివైపుల నుంచి పండే వినోదానికి తలుపులు మూసేయడమే ప్రధానమైన లోపం అని చెప్పాలి. కొన్ని కథలు మాత్రమే పుస్తకం నుంచి తెరపైకి వస్తే బాగుంటాయి. కొన్ని కథలు పుస్తకానికి పరిమితమవుతేనే బాగుంటాయి. ఈ రెండో వర్గానికి చెందిన కథలను తెరపైకి తీసుకుని వస్తే ఎలా ఉంటుందనడానికి సమాధానమే ఈ సినిమా. రొటీన్ కంటెంట్ తో రావడం .. వినోదానికి దూరంగా వెళ్లడమే ఈ సినిమా నిరాశపరచడానికి ప్రధాన కారణంగా చెప్పుకోవలసి ఉంటుంది.

# తొలిప్రేమ జ్ఞాపకాల్లో..



తిరుపతి నేపథ్య కథాంశంతో రూపొందిస్తున్న చిత్రం ‘శ్రీనివాస మంగాపురం’. జయకృష్ణ ఘట్టమనేని హీరోగా పరిచయమవుతున్న ఈ సినిమాకు అజయ్‌భూపతి దర్శకుడు. జూలై 9న ప్రేక్షకుల ముందుకురానుంది. మంగళవారం ఈ చిత్రంలోని ‘గుండె పేలిపోతుందే..’ అనే పాటను విడుదల చేశారు. తొలిప్రేమలోని మధురభావాలకు అద్దంపడుతూ, ప్రేమికుల అంతరంగాన్ని అందంగా ఆవిష్కరిస్తూ ఈ పాట సాగింది. జీవీప్రకాష్‌కుమార్ స్వరపరచిన ఈ పాటను చంద్రబోస్ రచించగా, అనురాగ్ కులకర్ణి ఆలపించారు. దేవాలయం నేపథ్యంలో చిత్రీకరించిన విజువల్స్ ఆకట్టుకునేలా ఉన్నాయి. ఈ చిత్రానికి సంగీతం: జీవీ ప్రకాష్ కుమార్, ప్రొడక్షన్ డిజైనర్: సాహి సురేష్, నిర్మాణ సంస్థ: చందమామ కథలు, సమర్పణ: సి.అశ్వినీదత్, రచన-దర్శకత్వం: అజయ్ భూపతి.

## కత్తి పట్టిన ఆధునిక సీత.. అదరగొడుతున్న అలియా భట్ ‘ఆల్ఫా’ ట్రైలర్




బాలీవుడ్ ప్రముఖ నిర్మాణ సంస్థ యశ్‌రాజ్ ఫిలిమ్స్ (వైఆర్‌ఎఫ్) తమ స్పై యూనివర్స్‌లో మరో కొత్త చిత్రాన్ని ప్రకటించింది. అలియా భట్ ప్రధాన పాత్రలో నటిస్తున్న ఈ యాక్షన్ థ్రిల్లర్‌కు ‘ఆల్ఫా’ అనే టైటిల్ ఖరారు చేశారు. ఈ చిత్రానికి సంబంధించిన ట్రైలర్‌ను తాజాగా విడుదల చేయగా, ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటోంది. ఈ సినిమా జులై 3న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి రానుంది.ఈ చిత్రంలో అలియా భట్ ‘సీత’ అనే ఒక పవర్‌ఫుల్ పాత్రలో కనిపిస్తున్నారు. చిన్నతనం నుంచే ఆమె తండ్రి (బాబీ డియోల్) ఒక కఠినమైన సీక్రెట్ ప్రోగ్రామ్‌లో భాగంగా ఆమెను ఒక కిరాయి హంతకురాలిగా తీర్చిదిద్దుతాడు. ఆధునిక కాలపు సీత తనదైన ‘అగ్ని పరీక్ష’ను ఎలా ఎదుర్కొంది అనే థీమ్‌తో ఈ సినిమా సాగనుంది. టీజర్‌లో అలియా భట్ భీకరమైన యాక్షన్ సన్నివేశాల్లో కనిపించారు. కత్తి యుద్ధాలు, ఛేజింగ్ సీన్లు ఆమె పాత్రలోని క్రూరమైన, భీకరమైన కోణాన్ని ఆవిష్కరించాయి. 18వ పుట్టినరోజునే ఆమెను ‘ఆల్ఫా’ అనే ఎలైట్ ఆపరేటివ్‌గా మార్చే సన్నివేశాలు సినిమాపై అంచనాలను పెంచుతున్నాయి.ఈ సినిమాలో అలియా భట్‌తో పాటు మరో నటి శర్వరీ వాఘ్ కూడా ప్రధాన పాత్ర పోషిస్తున్నారు. ఇద్దరు మహిళా ఆపరేటివ్‌లు కలిసి ఒక శక్తివంతమైన శత్రువును ఎలా ఎదుర్కొన్నారు అనేది కథలో కీలకం. సీనియర్ నటుడు అనిల్ కపూర్ ఒక ముఖ్యమైన ఇంటెలిజెన్స్ అధికారి పాత్రలో నటిస్తుండగా, ఈ సినిమాకు అసలైన హైలైట్ హృతిక్ రోషన్ కావడం విశేషం. వైఆర్‌ఎఫ్ స్పై యూనివర్స్‌లోని ‘వార్’ సిరీస్‌లో తను పోషించిన ‘కబీర్’ పాత్రలో హృతిక్ ఇందులో ప్రత్యేక అతిథిగా కనిపించనున్నారు. దీంతో ఈ సినిమా కూడా టైగర్, వార్ ఫ్రాంచైజీల ప్రపంచంలో భాగమని స్పష్టమైంది.
‘ది రైల్వే మెన్’ సిరీస్‌తో విమర్శకుల ప్రశంసలు పొందిన శివ్ రావల్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. ఆదిత్య చోప్రా నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. భారతదేశంలో పూర్తిస్థాయిలో మహిళా ప్రధాన పాత్రలతో వస్తున్న తొలి భారీ యాక్షన్ చిత్రంగా ‘ఆల్ఫా’ నిలవనుంది. పోస్ట్ ప్రొడక్షన్, వీఎఫ్ఎక్స్ పనుల్లో ఆలస్యం కారణంగా పలుమార్లు వాయిదా పడిన ఈ సినిమా జులై 3న విడుదల కానుంది.

# చుక్కలు తెమ్మన్నా.. తెంచుకురానా..



కెరీర్‌పరంగా జయాపజయాలతో సంబంధం లేకుండా మంచి స్టార్‌డమ్‌తో దూసుకుపోతున్నది అచ్చ తెలుగందం శ్రీలీల. చూడముచ్చటైన రూపం, చలాకీ అభినయంతో యువతరంలో ఈ భామ తిరుగులేని ఫాలోయింగ్‌ను సంపాదించుకుంది. అయితే ఇప్పటివరకు ఎక్కువగా వాణిజ్య చిత్రాల్లో గ్లామర్ ప్రధాన పాత్రల్లోనే కనిపించడంతో నటిగా ఆమె పూర్తి సామర్థ్యాన్ని ప్రదర్శించే అవకాశం రావడంలేదన్నది అభిమానుల అభిప్రాయం. ఈ నేపథ్యంలో కెరీర్‌లోనే తొలిసారి ఈ ముద్దుగుమ్మ మహిళా ప్రధాన చిత్రానికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిందని ఫిల్మ్‌నగర్ టాక్.వివరాల్లోకి వెళితే..దర్శకనిర్మాత వేణు ఊడుగుల 1994 మద్యపాన నిషేధం నేపథ్యంలో ఓ మహిళా ప్రధాన చిత్రాన్ని తెరకెక్కించబోతున్నారు. తొలుత ఈ చిత్రంలో కథానాయికగా భాగ్యశ్రీబోర్సే, సాయిపల్లవి పేర్లు వినిపించాయి. వరుస సినిమాలతో వారిద్దరూ బిజీగా ఉండటంతో మేకర్స్ మరో నాయిక అన్వేషణలో పడ్డారని, చివరకు శ్రీలీలను ఖరారు చేశారని సమాచారం. ఈ పీరియాడిక్ చిత్రానికి ‘చుక్కలు తెమ్మన్నా తెంచుకురానా’ అనే టైటిల్‌ను పరిశీలిస్తున్నట్లు తెలిసింది. ఈ చిత్రానికి రమేష్ ఎలిగేటి దర్శకత్వం వహించబోతున్నారని సమాచారం.

## కన్నప్ప మళ్లీ వచ్చేస్తున్నాడు..

### మంచు విష్ణు రీరిలీజ్ పోస్టర్ వైరల్




టాలీవుడ్ యాక్టర్ మంచు విష్ణు టైటిల్ రోల్ పోషించిన చిత్రం కన్నప్ప ముఖేశ్ కుమార్ సింగ్ దర్శకత్వం వహించిన ఈ మూవీ గతేడాది జూన్ 29న గ్రాండ్‌గా విడుదల కాగా.. ఆశించిన స్థాయిలో ప్రేక్షకుల అంచనాలు అందుకోలేకపోయింది. మాలీవుడ్ స్టార్ యాక్టర్ మోహన్ లాల్ కిరాట పాత్రలో నటించగా.. ఈ మూవీలో మోహన్ బాబు, అక్షయ్ కుమార్, మోహన్ లాల్, ప్రభాస్, కాజల్, బ్రహ్మానందం కీ రోల్స్ పోషించారు.ఈ మూవీని మరోసారి ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నారు. కన్నప్ప విడుదలై ఏడాది పూర్తి చేసుకోనున్న సందర్భంగా జూన్ 27న రీరిలీజ్ చేయనున్నారు. లిమిటెడ్ స్క్రీన్లలో రిలీజ్ కాబోతున్న ఈ మూవీ నయా పోస్టర్ ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతోంది. కన్నప్ప చిత్రానికి మెలోడీ బ్రహ్మ మణిశర్మ, స్టీఫెన్ దేవసి మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందించాడు. ఈ మూవీని 24 ఫ్రేమ్స్ ఫ్యాక్టరీ,బ్యానర్లపై సంయుక్తంగా తెరకెక్కిస్తున్నారు.కన్నప్ప మూవీకి పరుచూరి గోపాలకృష్ణ, బుర్రా సాయిమాధవ్, తోట ప్రసాద్ స్క్రీన్‌ప్లే అందిస్తున్నారు. ఈ చిత్రంలోనయనతార, మధుబాల, శరత్‌కుమార్, శివరాజ్‌కుమార్, ఐశ్వర్య ఇతర కీలక పాత్రల్లో నటించారు.


# భారత్‌కు క్రిస్టోఫర్ నోలన్ రాక..

# ముంబైలో ‘ది ఒడిస్సీ’ గ్రాండ్ ప్రీమియర్




ప్రపంచవ్యాప్తంగా ఉన్న సినీ ప్రియులకు, ముఖ్యంగా భారతీయ ప్రేక్షకులకు ఇది ఒక శుభవార్త. ‘ఒపెన్‌హైమర్’, ‘ఇంటర్‌స్టెల్లార్’, ‘ఇన్‌సెప్షన్’, ‘ది డార్క్ నైట్’ వంటి అద్భుతమైన చిత్రాలతో తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్న దిగ్గజ హాలీవుడ్ దర్శకుడు క్రిస్టోఫర్ నోలన్ తొలిసారిగా భారత్‌లో అడుగుపెట్టనున్నారు. తన సరికొత్త చిత్రం ‘ది ఒడిస్సీ’ ప్రీమియర్ కోసం ఆయన జులైలో ముంబైకి రానున్నట్లు యూనివర్సల్ పిక్చర్స్ ఇంటర్నేషనల్ అధికారికంగా ప్రకటించింది.ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమానికి నోలన్‌తో పాటు ఆ చిత్రంలో నటించిన ఆస్కార్ విజేత మ్యాట్ డామన్, ప్రముఖ నటుడు టామ్ హాలండ్, ఆస్కార్ అవార్డు గ్రహీత, నిర్మాత ఎమ్మా థామస్ కూడా హాజరుకానున్నారు. క్రిస్టోఫర్ నోలన్ సినిమా ఒకటి భారతదేశంలో ప్రీమియర్ జరుపుకోవడం ఇదే మొదటిసారి. ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా జులై 17న థియేటర్లలోకి రానుంది.‘ది ఒడిస్సీ’ గ్లోబల్ ప్రీమియర్ టూర్‌లో భాగంగా లండన్, పారిస్, న్యూయార్క్ వంటి ప్రధాన నగరాలతో పాటు ముంబైని కూడా అధికారికంగా ఎంపిక చేయడం భారతీయ మార్కెట్‌కు ఇస్తున్న ప్రాధాన్యతను తెలియజేస్తోంది. హోమర్ రచించిన ఇతిహాసం ‘ఒడిస్సీ’ ఆధారంగా ఈ చిత్రాన్ని నోలన్ తెరకెక్కించారు. ట్రాయ్ పతనం తర్వాత ఒడిస్సియస్ పదేళ్లపాటు తన ఇంటికి తిరిగి వెళ్లే ప్రయాణాన్ని ఈ చిత్రంలో అద్భుతంగా చూపించనున్నారు.ఈ సినిమాకు ఒక ప్రత్యేకత ఉంది. సరికొత్త ఐమ్యాక్స్ (×హీూశ) ఫిల్మ్ టెక్నాలజీని ఉపయోగించి పూర్తిగా ఐమ్యాక్స్ కెమెరాలతో చిత్రీకరించిన మొట్టమొదటి ఫీచర్ ఫిల్మ్ ఇదే కావడం విశేషం. ముంబైలోని ఫీనిక్స్ పల్లాడియంలో ఉన్న పీవీఆర్ ఐకాన్ ఐమ్యాక్స్ థియేటర్‌లో ఈ ప్రీమియర్ వేడుక జరగనుంది.ఈ చిత్రంలో మ్యాట్ డామన్, టామ్ హాలండ్‌లతో పాటు ఆన్ హాత్వే, రాబర్ట్ ప్యాటిన్సన్, లుపిటా యోంగో, జెండాయా, చార్లీజ్ థెరాన్ వంటి భారీ తారాగణం నటించింది. నోలన్, ఎమ్మా థామస్ తమ సింకోపీ బ్యానర్‌పై ఈ చిత్రాన్ని నిర్మించారు. ఇప్పటికే భారతదేశంలోని పలు సినిమా థియేటర్లలో ‘ది ఒడిస్సీ’ ఐమ్యాక్స్ వెర్షన్ కోసం అడ్వాన్స్ టికెట్ల అమ్మకాలు ప్రారంభమయ్యాయి. భారత గడ్డపై జరుగుతున్న అతిపెద్ద హాలీవుడ్ ఈవెంట్‌లలో ఒకటిగా ఈ ప్రీమియర్ నిలవనుంది.

# స్విమ్మింగ్ కోసం సొంత దేశాన్ని వదిలిపెట్టా..



నటుడు మాధవన్ కుమారుడు వేదాంత్ తాజాగా చేసిన వ్యాఖ్యలు వైరల్ అవుతున్నాయి. 20 ఏళ్ల ఫ్రీస్టైల్ స్విమ్మర్ అయిన వేదాంత్ తన కెరీర్ కోసం భారత్‌లోని జీవితాన్ని వదులుకుని దుబాయ్‌కు వెళ్లినట్లు చెప్పాడు. కోవిడ్-19 సమయంలో భారత్‌లో స్విమ్మింగ్ పూల్స్ మూతపడటంతో 2020లో వేదాంత్ కుటుంబంతో సహా దుబాయ్‌కు మకాం మార్చాడు.ఆ మార్పు గురించి వేదాంత్ తాజాగా మాట్లాడుతూ.. షిఫ్ట్ అయితే మంచిగానే జరిగింది. మా ఆస్తులన్నీ ట్రాన్స్‌ఫర్ చేసుకున్నాం. కానీ నా కంఫర్ట్ జోన్ నుంచి బయటకు రావడం మాత్రం నాకు షాక్‌లాగే అనిపించింది. పుట్టినప్పటి నుంచి భారత్‌లోనే ఉన్నాను. కొత్త దేశానికి, కొత్త స్కూల్ లైఫ్‌కు అలవాటు పడటం, అదే సమయంలో స్విమ్మింగ్, సోషల్ లైఫ్ మేనేజ్ చేయడం కాస్త కష్టమైంది అని వేదాంత్ అన్నారు. కోవిడ్ పరిస్థితుల్లో దుబాయ్‌కు రావడం నా కెరీర్‌కు మంచి నిర్ణయమే. దానివల్లే నేను డెన్మార్క్‌లో రేస్ చేయగలిగాను.భారత్‌లో నా ఫ్రెండ్స్‌తో ఉన్న జీవితాన్ని, నాకున్న వాతావరణాన్ని త్యాగం చేశాను. కంఫర్ట్ జోన్ నుంచి బయటకు వచ్చి, కొత్త దేశంలో నాకు నచ్చిన పని చేయగలుగుతున్నాను అని వేదాంత్ తెలిపాడు. ఇక తల్లిదండ్రుల మద్దతుపై వేదాంత్ మాట్లాడుతూ.. మా అమ్మానాన్నలు నాకు చాలా సపోర్టివ్. కలలను సపోర్ట్ చేసే తల్లిదండ్రులు అందరికీ ఉండరు. ఆ విషయంలో నేను చాలా లక్కీ. వాళ్లు లేకపోతే నేను ఈ స్థాయిలో ఉండేవాడిని కాదు. స్విమ్మింగ్‌లో పేరెంట్స్ కూడా టీమ్‌లో భాగమే. వారి సపోర్ట్ లేకపోతే ఏదీ సరిగ్గా సాగదు అని వేదాంత్ చెప్పుకొచ్చాడు. మాధవన్, సరితా బిర్జే 1999లో వివాహం చేసుకున్నారు. ఎనిమిదేళ్ల డేటింగ్ తర్వాత పెళ్లి చేసుకున్న వీరికి 2005లో వేదాంత్ జన్మించాడు. ఇక సినిమాల విషయానికి వస్తే, మాధవన్ ఈ ఏడాది ‘ధురంధర్ 2’ చిత్రంలో కనిపించారు. వచ్చే వారం రాష్ట్రపతి చేతుల మీదుగా పద్మశ్రీ అవార్డు అందుకోనున్నారు.

## మహిళా సాధికారతకు బాటలు: సరూర్‌నగర్‌లో ఇందిరా మహిళా శక్తి 'ఎగ్ కార్ట్‌ల' పంపిణీ!

**- పొదుపు సంఘాల మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలి : డిప్యూటీ కమిషనర్ పిలుపు**




సరూర్‌నగర్, జూన్ 17: భారతశక్తి మహిళలు స్వయం ఉపాధి రంగాల్లో రాణిస్తూ ఆర్థికంగా నిలదొక్కుకోవాలనే లక్ష్యంతో సరూర్‌నగర్ వృత్త (సర్కిల్) పట్టణ పేదరిక నిర్మూలనా సంస్థ (యూసీడీ) విభాగం కీలక అడుగు వేసింది. ఇందిరా మహిళా శక్తి పథకంలో భాగంగా ఏర్పాటు చేసిన మూడు గుడ్ల బండ్లను (ఎగ్ కార్ట్స్) వృత్త ఉప కమిషనర్ (డిప్యూటీ కమిషనర్) సి.హెచ్. శ్రీకాంత్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉప కమిషనర్ మాట్లాడుతూ.. మహిళా పొదుపు సంఘాల సభ్యులు ప్రభుత్వం అందిస్తున్న ఇలాంటి ప్రోత్సాహక పథకాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. బ్యాంకుల ద్వారా రుణ సదుపాయాన్ని పొంది, చిన్న తరహా వ్యాపారాలను ప్రారంభించడం ద్వారా ఆర్థికాభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు.

**- లబ్ధిదారులకు ఉపాధి వాహనాల అందజేత**

కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గ పరిధిలోని పలు పొదుపు సంఘాలకు ఈ గుడ్ల బండ్లను అందజేశారు.
- భవానీ నగర్‌కు చెందిన శ్రీ విఘ్నేశ్వర పొదుపు సంఘం,
-జీబీఆర్ ఆసుపత్రి ఎదురుగా ఉన్న ,శ్రీకృష్ణ పొదుపు సంఘం,
- శ్రీ లలితాంబికా పొదుపు సంఘం,
ఈ సంఘాల సభ్యులకు ఉప కమిషనర్ చేతుల మీదుగా వాహనాలను అందించి, వ్యాపారాలను ప్రారంభించారు.

**- ఆర్థిక స్వావలంబనే ధ్యేయం**

పట్టణ పేదరిక నిర్మూలనా సంస్థ ప్రాజెక్టు అధికారి విక్రాంత్ రెడ్డి మాట్లాడుతూ, మహిళా సంఘాల సభ్యులు వ్యాపార రంగంలోకి అడుగుపెట్టి, స్వయం ఉపాధితో సొంత కాళ్లపై నిలబడాలన్నారు. మహిళలు ఆర్థికంగా బలోపేతం అయినప్పుడే సమాజంలో నిజమైన సాధికారత సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంఘటిత నిర్వాహకులు (కమ్యూనిటీ ఆర్గనైజర్లు) జి. సహదేవ్, సైదులు, శోభన, వనరుల వ్యక్తులు (ఆర్‌పీలు) పరమేశ్వరి, శిల్ప, సమాఖ్య అధ్యక్షురాలు జ్యోతి, నాగలక్ష్మితో పాటు వివిధ పొదుపు సంఘాల ప్రతినిధులు, సభ్యులు పాల్గొన్నారు.

## భైంసాలో సంజీవిని హాస్పిటల్‌లో జనరల్ సర్జన్ సేవలు ప్రారంభం.



నిర్మల్ జిల్లా ప్రతినిధి, జూన్ 17(భారత శక్తి )భైంసా పట్టణంలోని సంజీవిని హాస్పిటల్‌లో నూతనంగా జనరల్ సర్జన్‌గా డాక్టర్ ముని సాహిత్ (వీదీదీూ, మీూ) బుధవారం సేవలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని వైద్య సేవలను ప్రారంభించారు. హైదరాబాద్‌లోని పలు ప్రముఖ ఆసుపత్రుల్లో విధులు నిర్వహించిన అనుభవం కలిగిన డాక్టర్ ముని సాహిత్, దివంగత డాక్టర్ సురేందర్ స్థానంలో సంజీవిని హాస్పిటల్‌లో సేవలు అందించనున్నారు. ల్యాపరోస్కోపిక్ మరియు లేజర్ శస్త్రచికిత్సల్లో ప్రత్యేక నైపుణ్యం కలిగిన ఆయన, భైంసా పట్టణ ప్రజలతో పాటు పరిసర గ్రామాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు.ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడిన డాక్టర్ ముని సాహిత్, ఆధునిక వైద్య సదుపాయాలతో రోగులకు నాణ్యమైన చికిత్స అందుబాటులో ఉంచుతున్నామని చెప్పారు. శస్త్రచికిత్సలకు సంబంధించిన సమస్యలతో బాధపడుతున్న వారు తమ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. భైంసా ప్రాంత ప్రజలకు అందుబాటులో, నమ్మకమైన వైద్య సేవలు అందించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు.సంజీవిని హాస్పిటల్ యాజమాన్యం మాట్లాడుతూ, ప్రజలకు మెరుగైన ఆరోగ్య సేవలు అందించాలనే ఉద్దేశంతో అనుభవజ్ఞుడైన జనరల్ సర్జన్‌ను నియమించామని తెలిపారు. దీంతో స్థానిక ప్రజలకు ప్రత్యేక వైద్య సేవలు మరింత చేరువ కానున్నాయని పేర్కొన్నారు.

## రూ.20 కోట్లతో రహదారి విస్తరణ పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి.



జనగామ (భారత శక్తి)జూన్ 17: దేవరుప్పుల మండలం,అప్పిరెడ్డిపల్లి గ్రామంలో తెలంగాణ ప్రభుత్వం రహదారులు మరియు భవనముల శాఖ ఆధ్వర్యంలో చేపట్టనున్న పీడబ్ల్యూడీ రోడ్డు నుండి కొలుకొండ వరకు వయా చిన్నమడూర్,అప్పిరెడ్డిపల్లి గ్రామాల మీదుగా వెళ్లే రహదారిని రెండు వరసల (టూ లేన్) రహదారిగా విస్తరించే పనులకు పాలకుర్తి శాసనసభ్యురాలు మామిడాల యశస్విని రెడ్డి ఈరోజు శంకుస్థాపన చేశారు. సెంట్రల్ రోడ్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ ఫండ్ (జ=×ఖీ) నిధుల ద్వారా రూ.20 కోట్ల అంచనా వ్యయంతో ఈ రహదారి అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని,గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా రహదారుల విస్తరణ పనులు చేపడుతున్నామని,ఈ రహదారి పూర్తయితే కొలుకొండ, చిన్నమడూర్, అప్పిరెడ్డిపల్లి తదితర గ్రామాల ప్రజలకు రాకపోకలు మరింత సులభతరం అవుతాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షురాలు లకావత్ ధనవంతి,తెలంగాణ రీజినల్ ట్రాన్స్పోర్ట్ అథారిటీ మెంబర్ చిలువేరు అభిగౌడ్,కొడకండ్ల ఏఎంసి ఛైర్పర్సన్ నల్ల ఆండాలు,మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నల్ల శ్రీరామ్,మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు,యువజన నాయకులు,ప్రజా ప్రతినిధులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎల్బీనగర్‌కు మహర్దశ

## రేపే సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా 'వన మహోత్సవం'

**-116 ఎకరాల్లో అత్యాధునిక అర్బన్ పార్కుకు శంకుస్థాపన; రూ.20 కోట్లతో బాక్స్ డ్రైన్ పనులు**





హైదరాబాద్: జూన్ 17 :భారత శక్తి ఎల్బీనగర్ నియోజకవర్గ పరిధిలోని బి.ఎన్.రెడ్డి నగర్ ఫారెస్ట్ (అటవీ) ప్రాంతంలో గురువారం సాయంత్రం 4 గంటలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 'వన మహోత్సవం' కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. ఈ వేడుకలో భాగంగా వెయ్యి మంది పాఠశాల విద్యార్థులతో కలిసి సీఎం స్వయంగా మొక్కలు నాటనున్నారు. అనంతరం అక్కడ నిర్మించనున్న భారీ అర్బన్ పార్కుకు (పట్టణ పార్కు) శంకుస్థాపన చేయనున్నారు.ఈ నేపథ్యంలో బుధవారం నాడు టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్ అధికారులతో కలిసి సభ ఏర్పాట్లను స్వయంగా పరిశీలించారు. అనంతరం ప్రధాన అటవీ సంరక్షణాధికారి (పిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్) వినయ్ కుమార్, అటవీ సంరక్షణాధికారి (చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్) ప్రియాంక వర్గీస్‌లతో మాట్లాడి ఏర్పాట్లపై దిశా నిర్దేశం చేశారు.

**- 30 ఏళ్ల భూవివాదానికి చెక్.. కేబీఆర్ పార్కు తరహాలో అభివృద్ధి!**

ఈ సందర్భంగా మధుయాష్కి గౌడ్ విలేకరులతో మాట్లాడుతూ, గత ముప్పై ఏళ్లుగా నలుగుతున్న భూవివాదాన్ని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం సాహసోపేతంగా పరిష్కరించిందని చెప్పారు. బి.ఎన్.రెడ్డి నగర్ వాసులకు హైదరాబాద్‌లోని కేబీఆర్ పార్కు తరహాలోనే 116 ఎకరాల సువిశాల విస్తీర్ణంలో ఒక అద్భుతమైన, ఆహ్లాదకరమైన అటవీ పార్కు అందుబాటులోకి రాబోతోందని, ఇది స్థానిక ప్రజల అదృష్టమని కొనియాడారు.

**- రూ.20 కోట్లతో వరద నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం**

కేవలం పార్కు నిర్మాణమే కాకుండా, బి.ఎన్.రెడ్డి నగర్ మరియు దాని చుట్టుపక్కల కాలనీల ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలపై ప్రభుత్వం దృష్టి పెట్టిందని మధుయాష్కి తెలిపారు.
- వర్షపు నీరు, మురుగు నీరు సజావుగా సాగిపోయేందుకు రూ.20 కోట్ల వ్యయంతో బాక్స్ డ్రైన్ (భారీ మూసివున్న డ్రైనేజీ కాలువ) మరియు కొత్త డ్రైనేజీ లైన్ల నిర్మాణ పనులను చేపడుతున్నట్లు ఆయన వివరించారు.

**- ప్రజలంతా తరలిరావాలి: మధుయాష్కి పిలుపు**

గురువారం సాయంత్రం జరిగే ఈ వన మహోత్సవ, శంకుస్థాపన కార్యక్రమాన్ని భారీ ఎత్తున విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఎల్బీనగర్ నియోజకవర్గ ప్రజలు, ముఖ్యంగా పరిసర కాలనీల నివాసితులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఈ అభివృద్ధి కార్యక్రమంలో భాగస్వాములు కావాలని కోరారు.

**- కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్య నాయకులు:**

ఈ ఏర్పాట్ల పరిశీలన కార్యక్రమంలో యాదవ కార్పొరేషన్ వైస్ చైర్మన్ గజ్జి భాస్కర్ యాదవ్, మాజీ కార్పొరేటర్లు దరిపల్లి రాజశేఖర్ రెడ్డి, రాగుల.వెంకటేశ్వర్ రెడ్డి, వజీర్ ప్రకాష్ గౌడ్, ముద్దగౌని లక్ష్మీప్రసన్న, డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు మకుటం సదాశివుడు, శశిధర్ రెడ్డి, చెన్నగోని రవీందర్ గౌడ్, మహిళా అధ్యక్షురాలు స్వర్ణ మాధవి, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు పాశం అశోక్ గౌడ్, నేలపాటి రామారావు, గణేష్ నాయక్, నాయకులు పర్వతి గణేష్ రెడ్డి, రఘుమారెడ్డి, రజిని రావు, కంచర్ల కవిత, విద్యా రెడ్డి, భాను, వినయ్ పటేల్, దాము మహేందర్ యాదవ్, శ్రీనాథ్, మతీన్ షరీఫ్, కొండోజు శ్రీనివాస్, తోకటి కిరణ్, బండిగారి శ్రీనివాస్, నరేష్ గుప్త, మక్సుద్, షేక్ షాకీర్, ప్రవీణ్ రెడ్డి, సూర్యనారాయణ, రాజశేఖర్ రెడ్డి, భవాని శంకర్, శశికాంత్, రేణు గౌడ్, అంతటి శ్రీనివాస్ గౌడ్, సుధాకర్ గౌడ్, నంద కిషోర్, ప్రశాంత్ గౌడ్, భవాని, లక్ష్మణ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణపై జీహెచ్ఎంసీ ఉన్నతాధికారుల సమీక్ష

**- గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో ప్రత్యేక సమావేశం..**

**- లోపాల్లేని ఓటర్ల జాబితా రూపకల్పనే లక్ష్యం: జిల్లా ఎన్నికల అధికారి ఆర్.వి. కర్ణన్ వెల్లడి**



హైదరాబాద్ జూన్ 17 (భారత శక్తి ): నగరంలో పారదర్శకమైన, సమగ్రమైన మరియు లోపాలు లేని ఓటర్ల జాబితాను రూపొందించడమే లక్ష్యంగా గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) యంత్రాంగం కసరత్తును ముమ్మరం చేసింది. ఇందులో భాగంగా జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో ఓటర్ల జాబితా 'ప్రత్యేక సమగ్ర సవరణ' (స్పెషల్ సమ్మరీ రివిజన్) ప్రక్రియపై బుధవారం ఒక ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం జరిగింది. జీహెచ్ఎంసీ కమిషనర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి ఆర్.వి. కర్ణన్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో హైదరాబాద్ జిల్లా కలెక్టర్ ప్రియాంక అలా, అదనపు కమిషనర్ (ఎన్నికలు) కె. చంద్రకల పాల్గొని, గుర్తింపు పొందిన అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో విస్తృతంగా చర్చించారు.

**- బూత్ స్థాయి అధికారులకు సహకరించాలి**

ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి ఆర్.వి. కర్ణన్ మాట్లాడుతూ.. ఓటర్ల జాబితా నమోదు ప్రక్రియ గురించి రాజకీయ పార్టీలకు సమగ్రంగా వివరించారు. జాబితాలో ఎలాంటి తప్పులు దొర్లకుండా ఉండేందుకు అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటరు నమోదు పత్రాలను (ఎన్యుమరేషన్ ఫారమ్‌లు) పంపిణీ చేయనున్నట్లు స్పష్టం చేశారు. క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించే బూత్ స్థాయి అధికారులకు (బీఎల్ఓలు) రాజకీయ పార్టీలు పూర్తి సహకారం అందించాలని, వారి విధులకు ఎలాంటి ఆటంకాలు కలగకుండా చూడాలని కోరారు. నిర్ణీత గడువులోగా సరిగ్గా నింపిన దరఖాస్తు పత్రాలను ఎన్నికల విభాగానికి సమర్పించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు.

**- నమోదు పత్రాలు ఇవ్వకుంటే ముసాయిదా జాబితాలో పేరుండదు!**

ఓటరు నమోదు ప్రక్రియపై కమిషనర్ కీలక స్పష్టత ఇచ్చారు. నిర్దేశిత గడువులోగా ఎన్యుమరేషన్ ఫారమ్‌లను సమర్పించని ఓటర్ల పేర్లను ముసాయిదా ఓటర్ల జాబితాలో (డ్రాఫ్ట్ ఓటర్ లిస్ట్) చేర్చడం సాధ్యం కాకపోవచ్చని ఆయన స్పష్టం చేశారు. కాబట్టి అర్హులైన ప్రతి పౌరుడు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేలా రాజకీయ పార్టీల ప్రతినిధులు అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో పాల్గొన్న వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియపై పలు సందేహాలను లేవనెత్తగా, అధికారుల బృందం వాటికి తగిన వివరణలు ఇచ్చి నివృత్తి చేసింది. లోపాల్లేని ఓటరు జాబితా రూపకల్పనకు తామంతా సంపూర్ణంగా సహకరిస్తామని రాజకీయ పార్టీల ప్రతినిధులు ఈ సందర్భంగా హామీ ఇచ్చారు.

# ప్రజా సేవలే లక్ష్యం

## మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ క్యాంప్ కార్యాలయం ప్రారంభం

**- దూరాన్ని తగ్గించేలా వికేంద్రీకరణ.. ప్రజల సమస్యల త్వరితగతిన పరిష్కారానికి పెద్దపీట**



హైదరాబాద్, జూన్ 17 (భారత శక్తి ): రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణను మరింత బలోపేతం చేస్తూ, ప్రజలకు రక్షకభట (పోలీస్) సేవలను మరింత చేరువ చేసేందుకు సరికొత్త అడుగు పడింది. పరిపాలనా సంస్కరణల్లో భాగంగా నూతనంగా ఏర్పాటు చేసిన మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ క్యాంప్ కార్యాలయాన్ని రాష్ట్ర రక్షకభట శాఖాధిపతి (డీజీపీ) సి.వి. ఆనంద్, ప్రభుత్వ సలహాదారు పి. సుదర్శన్ రెడ్డితో కలిసి బుధవారం ప్రారంభించారు. సికింద్రాబాద్ నగర సివిల్ కోర్టు సమీపంలోని మల్కాజిగిరి ప్రాంతీయ (జోనల్) కార్యాలయ ప్రాంగణంలో ఈ నూతన భవనం రూపుదిద్దుకుంది.

**- సులభతర పాలన -- ప్రజలకు చెంతకు సేవలు**

ప్రజా రక్షక వ్యవస్థకు, సామాన్య పౌరులకు మధ్య ఉన్న దూరాన్ని తగ్గించడమే ఈ నూతన క్యాంప్ కార్యాలయ స్థాపన వెనుక ఉన్న ముఖ్య ఉద్దేశం. గతంలో కమిషనరేట్ సేవల కోసం ప్రజలు సుదూర ప్రాంతాలకు ప్రయాణించాల్సి వచ్చేది. ఈ ఇబ్బందులను తొలగిస్తూ నేరేడ్‌మెట్ పరిసర ప్రాంతాల వారికి సైతం అందుబాటులో ఉండేలా, సేవల వికేంద్రీకరణ ధ్యేయంగా ఈ కార్యాలయాన్ని తీర్చిదిద్దారు.

**"11 రక్షకభట నిలయాల పర్యవేక్షణ**

ఈ నూతన కార్యాలయం మల్కాజిగిరి, ఉప్పల్ ప్రాంతీయ పరిధిలోని రక్షకభట నిలయాలకు (పోలీస్ స్టేషన్లకు) ఒక కేంద్ర బిందువుగా మారనుంది. ఈ రెండు పరిధుల పరిధిలోకి వచ్చే మొత్తం 11 రక్షకభట నిలయాల రోజువారీ పరిపాలన, పర్యవేక్షణ, శాంతిభద్రతల సమీక్షలు ఇకపై ఇక్కడి నుంచే సాగుతాయి. దీనివల్ల క్షేత్రస్థాయి అధికారులకు, ఉన్నతాధికారులకు మధ్య సమన్వయం మరింత పెరుగుతుంది.

"ఈ క్యాంప్ కార్యాలయం క్షేత్రస్థాయి సిబ్బందికి, ఉన్నతాధికారులకు మధ్య ఒక వారధిలా పనిచేస్తుంది. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను త్వరితగతిన, మానవీయ కోణంలో పరిష్కరించేందుకు ఇది ఎంతగానో దోహదపడుతుంది."



సి.వి. ఆనంద్, డీజీపీ

**- ప్రముఖుల సమక్షంలో వేడుక**

శాంతిభద్రతల పరిరక్షణలో మైలురాయిగా నిలిచే ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో మల్కాజిగిరి రక్షకభట కమిషనర్ (పోలీస్ కమిషనర్) బి. సుమతి, జిల్లా కలెక్టర్ టి. వినయ్ కృష్ణా రెడ్డి, హైడ్రా కమిషనర్ ఎ.వి. రంగనాథ్, మల్కాజిగిరి ప్రాంతీయ డిప్యూటీ కమిషనర్ (డీసీపీ), రవాణా విభాగం (ట్రాఫిక్) డీసీపీ సహా పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ నూతన కార్యాలయ స్థాపన పట్ల స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# బాలాజీ నగర్‌లో 'అభ్యాస ఇన్నోవేటివ్ స్కూల్' ప్రారంభం

**- విద్యా రంగంలో సరికొత్త ఒరవడి;**

**- ఘనంగా ప్రారంభించిన టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి**

బడంగ్‌పేట్, జూన్ 17 (భారత శక్తి ): మహేశ్వరం నియోజకవర్గ పరిధిలోని బడంగ్‌పేట్ కార్పొరేషన్ బాలాజీ నగర్ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన 'అభ్యాస వినూత్న పాఠశాల' (అభ్యాస ఇన్నోవేటివ్ స్కూల్) బుధవారం ఘనంగా ప్రారంభమైంది. విద్యా రంగంలో ఆధునిక ప్రమాణాలతో సరికొత్త బోధనా పద్ధతులను అందుబాటులోకి తెస్తూ ఏర్పాటు చేసిన ఈ పాఠశాలను తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) ప్రధాన కార్యదర్శి, మాజీ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి, రిబ్బన్ కట్ చేసి అధికారికంగా ప్రారంభించారు.

**-నాణ్యమైన విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు**

ఈ సందర్భంగా పారిజాత నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థుల్లో సృజనాత్మకతను, ఆలోచనా శక్తిని పెంపొందించే వినూత్న బోధనా విధానాలు నేడు ఎంతో అవసరమన్నారు. స్థానిక విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో కూడిన విద్యను అందించేందుకు ఈ పాఠశాల కృషి చేయాలని ఆమె ఆకాంక్షించారు. మెరుగైన వసతులు, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో విద్యాబోధన సాగించడం అభినందనీయమన్నారు.

**- ప్రముఖుల సమక్షంలో వేడుక**

ఈ ప్రారంభోత్సవ వేడుకలో మాజీ కార్పొరేటర్ పెద్దబావి సుదర్శన్ రెడ్డి, స్థానిక నాయకులు నిరుడు శ్రీరాములు, పగడాల ఉమేష్, నయనా చారి, కృష్ణ రెడ్డి, శ్యామ్ సుందర్ రెడ్డి, కొండ శ్రవణ్ కుమార్ తదితరులు పాల్గొని యాజమాన్యానికి శుభాకాంక్షలు తెలిపారు.

**- విద్యావేత్తలు, తల్లిదండ్రుల హర్షం:**

పాఠశాల విశిష్టతలను, భవిష్యత్తు ప్రణాళికలను విద్యా నిపుణులు డాక్టర్ రామావత్ పాండు నాయక్, డాక్టర్ సుభాష్ రాథోడ్ వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం, పెద్ద సంఖ్యలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు మరియు స్థానిక కాలనీ వాసులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# బాలాపూర్ లో వైభవంగా బొడ్రాయి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవ పూజలు

**- ఈ నెల 25 నుండి ప్రతిష్టాత్మక ఉత్సవాలు**

**- పాత బొడ్రాయి వద్ద కమిటీ సభ్యులు, గ్రామస్తుల ప్రత్యేక ప్రార్థనలు**

**- తరలివచ్చిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు చిగిరింత నరసింహారెడ్డి.**




బాలాపూర్, జూన్ 17 (భారత శక్తి ): మహేశ్వరం నియోజకవర్గంలోని హైదరాబాద్ మహానగరపాలక సంస్థ (జీహెచ్‌ఎంసీ) పరిధిలో గల బాలాపూర్ విభాగం (డివిజన్) బాలాపూర్ గ్రామం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. ఈ నెల 25వ తేదీ నుండి గ్రామంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించ తలపెట్టిన బొడ్రాయి పండుగ ఉత్సవాల సందడి అప్పుడే మొదలైంది. ఉత్సవాల్లో భాగంగా నూతన బొడ్రాయి మహోత్సవ విగ్రహాన్ని ఈరోజు గ్రామానికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ప్రస్తుతం ఉన్న పాత బొడ్రాయి విగ్రహం వద్ద ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, గ్రామస్తులు కలిసి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. గ్రామ రక్షణకు, సుఖశాంతులకు ప్రతీక అయిన బొడ్రాయికి శాస్త్రోక్తంగా పూజలు చేసి, రాబోయే ఉత్సవాలు దిగ్విజయంగా జరగాలని ప్రార్థించారు.

**- పూజల్లో పాల్గొన్న నరసింహారెడ్డి**

ఈ ప్రత్యేక పూజా కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ ఉపఅధ్యక్షుడు (వైస్ చైర్మన్) చిగిరింత నరసింహారెడ్డి పాల్గొన్నారు. నూతన విగ్రహానికి స్వాగతం పలుకుతూ నిర్వహించిన పూజల్లో ఆయన గ్రామస్థులతో కలిసి కూర్చుని దైవదర్శనం చేసుకున్నారు.

**- పండుగ వాతావరణం**

నూతన విగ్రహ రాకతో బాలాపూర్ గ్రామంలో ముందస్తుగానే పండుగ వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ ప్రతినిధులు, స్థానిక యువకులు, మహిళలు, కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక హారతులు ఇచ్చారు. ఈ నెల 25 నుండి ప్రారంభం కాబోయే ప్రధాన ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు గ్రామస్తులు అన్ని ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

# గ్రామీణ మౌలిక వసతుల అభివృద్ధికి మరో ముందడుగు

**-రూ.65 లక్షలతో సీసీ, గ్రావెల్ రోడ్డు నిర్మాణ పనులకు భూమిపూజ చేసిన ఎమ్మెల్యే పాయం**



బూర్గంపాడు, జూన్ 17 (భారతశక్తి): మండలంలో గ్రామీణ మౌలిక వసతుల అభివృద్ధికి మరో ముందడుగు వేస్తున్నామని పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం బూర్గంపాడు గ్రామపంచాయితీలో రూ. 65 లక్షలు అంచనా వ్యయంతో సీసీ రోడ్లు, గ్రావెల్ రోడ్డు నిర్మాణ పనులకు ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు భూమిపూజ నిర్వహించారు. గ్రామ ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించడంతో పాటు గ్రామ అభివృద్ధికి దోహదపడే ఈ రోడ్డు పనులు పూర్తయితే ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని పేర్కొన్నారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తూ, ప్రజలకు అవసరమైన రహదారులు, డ్రైనేజీలు, తాగునీటి సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు, కాంగ్రెస్ మండల నాయకులు, సీనియర్ నేతలు తదితరులు పాల్గొన్నారు.

# జూలై 1న ఆంధ్రప్రదేశ్ నుంచి 'వీబీ - జీ రామ్ జీ' పథకం జాతీయ ప్రారంభోత్సవం

**- శివరాజ్ సింగ్ చౌహాన్**



న్యూ ఢిల్లీ, భారత శక్తి ప్రతినిధి, జూన్ 17: కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌తో సమావేశమయ్యారు. ఆంధ్రప్రదేశ్ ఆవిష్కరణ నమూనా ఇతర రాష్ట్రాలకు స్ఫూర్తిదాయకంగా మారుతుందని శివరాజ్ సింగ్ చౌహాన్ అన్నారు. "గ్రామీణాభివృద్ధి పథకాల పరిధిలోని అన్ని పనులు జియో-ట్యాగింగ్, ముఖ గుర్తింపు విధానంతో దాదాపుగా పూర్తయ్యాయి" అని పవన్ కళ్యాణ్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ న్యూఢిల్లీలోని కృషి భవన్‌లో కేంద్ర గ్రామీణాభివృద్ధి, వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌తో సమావేశమయ్యారు. రాష్ట్రంలో గ్రామీణాభివృద్ధి కార్యక్రమాల పురోగతి, ఉపాధి కల్పన, జీవనోపాధి పెంపు, పంచాయతీల అభివృద్ధి, వివిధ కేంద్ర పథకాల అమలుపై చర్చలు జరిపారు. ఈ ముఖ్యమైన కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేసేందుకు ప్రస్తుత స్థితి, భవిష్యత్ ప్రణాళికలపై ఈ సమావేశంలో చర్చించారు. సమావేశంలో శివరాజ్ సింగ్ చౌహాన్ మాట్లాడుతూ.. వికసిత్ భారత్ - గ్యారెంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవికా మిషన్ (గ్రామీణ్) (వీబీ - జి రామ్ జి )' జాతీయ ప్రారంభోత్సవం 2026 జూలై 1న ఆంధ్రప్రదేశ్ నుండి జరుగుతుందని ప్రకటించారు. దేశంలోని అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల గ్రామీణాభివృద్ధి మంత్రులు తమ తమ రాష్ట్రాల్లోని వివిధ క్షేత్రస్థాయి ప్రాంతాల నుంచి వీడియో కాన్ఫరెన్సింగ్ ద్వారా ఈ కార్యక్రమంలో పాల్గొంటారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొనేవారికి గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక గురించి తెలియజేయడంతో పాటు, ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి చేసిన ఆదర్శ పంచాయతీలు, వ్యర్థరహిత గ్రామ పంచాయతీల పనుల గురించి కూడా అవగాహన కల్పిస్తామని చౌహాన్ తెలిపారు. గ్రామీణ పరిపాలన, సుస్థిర అభివృద్ధి, సామాజిక భాగస్వామ్యం వంటి రంగాలలో రాష్ట్రం తన ఉత్తమ నమూనాలను, ఆవిష్కరణలను ప్రదర్శిస్తుందని, తద్వారా ఇతర రాష్ట్రాలు ఈ విజయవంతమైన అనుభవాల నుండి నేర్చుకోగలవని ఆయన అన్నారు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి ప్రస్థానాన్ని శివరాజ్ సింగ్ చౌహాన్ ప్రశంసించారు. ఇది దేశంలోనే అత్యంత ప్రగతిశీల రాష్ట్రాలలో ఒకటి అని, అభివృద్ధికి సంబంధించిన నిర్ణయాలను వేగంగా తీసుకుంటున్నారని అభినందించారు. గ్రామీణాభివృద్ధి రంగంలో రాష్ట్రం మరిన్ని ఆవిష్కరణలు చేయాలని, తద్వారా ఇతర రాష్ట్రాలు కూడా దాని నుండి స్ఫూర్తి పొందుతాయని సూచించారు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి చేసిన విజయవంతమైన నమూనాలు, ఆవిష్కరణలను దేశంలోని ఇతర రాష్ట్రాలతో పంచుకోవడం ద్వారా, గ్రామీణాభివృద్ధిలోని ఉత్తమ పద్ధతులను భారతదేశం అంతటా విస్తృతంగా వ్యాప్తి చేసి, స్వీకరించేలా చేయవచ్చని అన్నారు. పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ రాష్ట్రంలో గ్రామీణాభివృద్ధి పనులు, పథకాల పురోగతి గురించి సమాచారం తెలియజేస్తూ పారదర్శకతను నిర్ధారించడానికి, అవినీతికి ఎలాంటి ఆస్కారం లేకుండా చేయడానికి, గ్రామీణాభివృద్ధి పథకాల కింద చేపడుతున్న అన్ని పనులకు జియో-ట్యాగింగ్ చేశారని అన్నారు. లబ్ధిదారుల ధృవీకరణ కోసం ముఖ గుర్తింపు ఆధారిత వ్యవస్థ పని కూడా దాదాపుగా పూర్తయిందని తెలిపారు. రాష్ట్రంలో ప్రధాన మంత్రి ఆవాస్ యోజన-గ్రామీణ్ కింద గ్రామీణ రోడ్లు, ఇళ్ల నిర్మాణం వేగంగా పురోగమిస్తోందని తెలియజేశారు. రాష్ట్రంలోని ప్రతి పంచాయతీలో పశువులకు తాగునీటి సౌకర్యాలు కల్పించామని, దీనివల్ల గ్రామీణ పశుపోషకులకు ప్రయోజనం చేకూరుతోందని, వారి జీవనోపాధి పరిస్థితులు మెరుగుపడుతున్నాయని తెలియజేశారు. వీబీ - జీ రామ్ జీ పథకం కింద ఆంధ్రప్రదేశ్‌కు రికార్డు స్థాయిలో రూ. 7,700 కోట్లకు పైగా మధ్యంతర నిధులను అందించినందుకు కేంద్ర ప్రభుత్వానికి, గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖకు పవన్ కళ్యాణ్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ గణనీయమైన మద్దతు రాష్ట్రంలో వివిధ గ్రామీణాభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయడానికి సహాయపడుతుంది అన్నారు. రాష్ట్రం సాధించిన విజయాల పట్ల కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ సంతృప్తి వ్యక్తం చేస్తూ గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ నుండి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి సాధ్యమైనంత మద్దతు ఇస్తామని హామీ ఇచ్చారు. నూతన ఆవిష్కరణల ఆధారిత అభివృద్ధి నమూనాలను అవలంబించి, వాటిని విస్తృత స్థాయిలో అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రోత్సహించారు. ఈ సమావేశంలో, ఆంధ్రప్రదేశ్‌లో కాఫీ తోటల పెంపక కార్యకలాపాలను వీబీ-జీ రామ్ జీ కింద చేర్చినట్లు తెలిపారు. దీనివల్ల గ్రామీణ ప్రాంతాల్లో కొత్త జీవనోపాధి అవకాశాలు ఏర్పడి, ఆదాయ వనరులలో వైవిధ్యం చేకూరుతుంది. సుస్థిర వృద్ధిని ప్రోత్సహించేందుకు తీర ప్రాంతాల్లో ఆదర్శ పంచాయతీల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తోంది. జూన్ 28, 29 తేదీలలో న్యూఢిల్లీలో జరగనున్న జాతీయ గ్రామీణాభివృద్ధి సదస్సులో పాల్గొనవలసిందిగా శివరాజ్ సింగ్ చౌహాన్, పవన్ కళ్యాణ్‌ను ఆహ్వానించారు. ఈ సదస్సులో, వీబీ-జీ రామ్ జీ పథకం యొక్క సమర్థవంతమైన అమలు, రాష్ట్రాల అనుభవాల వినిమయం, గ్రామీణాభివృద్ధిలో నూతన ఆవిష్కరణలపై సవివరంగా చర్చలు జరగనున్నాయి. అన్ని రాష్ట్రాల మధ్య ఉత్తమ పద్ధతులను పంచుకోవడానికి ఈ వేదిక సహాయపడుతుంది. ఈ సమావేశంలో, గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ కార్యదర్శి రోహిత్ కన్సల్ మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్ తీరప్రాంతాల్లో ఆదర్శ పంచాయతీల అభివృద్ధికి మంత్రిత్వ శాఖ అన్ని విధాలా మద్దతు అందిస్తుందని తెలిపారు. తీరప్రాంతాల్లో అభివృద్ధి చేస్తున్న ఈ నమూనాలు, గ్రామీణాభివృద్ధి, స్థానిక వనరులను మెరుగ్గా ఉపయోగించుకోవడానికి ఇతర ప్రాంతాలకు కూడా ఆదర్శంగా నిలుస్తాయని అన్నారు. గ్రామీణ జీవనోపాధి, మహిళా సాధికారతను ప్రోత్సహించేందుకు, 'లక్ పత్ దీదీలు'గా ప్రసిద్ధి చెందిన మహిళా స్వయం సహాయక బృందాలకు వాహనాలు కొనుగోలు చేసే కార్యక్రమానికి మంత్రిత్వ శాఖ మద్దతు అందిస్తుందని ఆయన తెలిపారు. ఈ విషయంలో, దీన్ దయాళ్ అంత్యోదయ యోజన-జాతీయ గ్రామీణ జీవనోపాధి మిషన్ కింద గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ అవసరమైన ఆమోదం ఇచ్చింది. ఈ చర్య గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో మహిళల భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేస్తుంది. ఈ సమావేశంలో గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ జాయింట్ సెక్రటరీ శ్రీమతి రోహిణి ఆర్. భజిభకరేతో పాటు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖకు చెందిన సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

# గీతంలో 2026-27 విద్యా సంవత్సరానికి ప్రవేశాలు

**గీతం స్కూల్ ఆఫ్ ఎడ్యుకేషన్ ప్రారంభం**

**వెల్లడించిన ప్రోవీసీ ప్రొఫెసర్ డీ.ఎస్.రావు**

పటాన్‌చెరు జూన్ 17 భారత శక్తి హైదరాబాదులోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో 2026-27 విద్యా సంవత్సరానికి అండర్ గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్ కోర్సులలో ప్రవేశాలు కొనసాగుతున్నట్టు బుధవారం విడుదల చేసిన ఒక పత్రికా ప్రకటనలో వెల్లడించారు. ఒక కీలక విద్యా మైలురాయిగా, విశ్వవిద్యాలయం తన బహుళ విషయక అభ్యాస పర్యావరణ వ్యవస్థను మరింత విస్తరిస్తూ, గీతం స్కూల్ ఆఫ్ ఎడ్యుకేషన్ ను ప్రారంభించినట్టు తెలియజేశారు. హైదరాబాదు ప్రాంగణం ఈ ఏడాది అనేక కొత్త కోర్సులను ప్రవేశపెట్టిందని తెలిపారు. వాటిలో ఇంటిగ్రేటెడ్ టీచర్ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్ కింద నాలుగేళ్ల ఇంటిగ్రేటెడ్ బీఏ బీఈడీ, బీఎస్సీ బీఈడీ; బోవర్ స్కూల్ ఆఫ్ ఎంటర్ ప్రెన్యూర్ షిప్ సహకారంతో బీబీఏ (ఎంటర్ ప్రెన్యూర్ షిప్); అలాగే బీఎస్సీ మైక్రోబయాలజీ, ఎమ్మెస్సీ బయోటెక్నాలజీ, ఎంటెక్ రోబోటిక్స్ అండ్ ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, ఎం.ఫార్మా (ఇండస్ట్రియల్ ఫార్మసీ -- పీసీఐ ఆమోదం పొందాల్సి ఉంది) వంటివి ఉన్నట్టు వివరించారు. ఈ మార్పుచేర్పులు, అభివృద్ధి చెందుతున్న పరిశ్రమ పోకడలు, సామాజిక అవసరాలకు అనుగుణంగా విద్యను తీర్చిదిద్దాలనే గీతం నిబద్ధతను ప్రతిబింబిస్తున్నాయన్నారు. గీతం హైదరాబాదు ప్రత్యేకత, దాని లిబరల్ ఎడ్యుకేషన్ ఫ్రేమ్ వర్క్ అని, ఇది విద్యార్థులకు వివిధ విభాగాలలో మేజర్, మైనర్లను కలపడానికి వీలుకల్పిస్తూ, ఆయా విద్యార్థుల అభిరుచికి అనుగుణంగా విద్యనభ్యసించ వచ్చని తెలిపారు. ఈ విధానం అభ్యాసకులను భవిష్యత్తుకు సిద్ధంగా ఉండే నైపుణ్యాలను పెంపొందించుకుంటూ, జ్ఞానంలో లోతు, విస్తృతి.. రెండింటినీ పొందేందుకు అనుమతిస్తుందన్నారు. గీతం ప్రవేశ పరీక్ష (గాట్-2026) ద్వారా గానీ, లేదా టీజీ/ఏపీ ఈఏపీసెట్, ఎన్ సెట్, నాటా, జేఈఈ, సీయూసెట్, క్యాట్ (TG & AP EAPCET, NCET, NATA, JEE, CUET, CAT), ఇతర గుర్తింపు పొందిన జాతీయ, రాష్ట్ర స్థాయి ప్రవేశ పరీక్షల ద్వారా కూడా ప్రవేశాలు పొందవచ్చని తెలిపారు. అర్హత పరీక్షలో చూపిన ప్రతిభ, పనితీరు ఆధారంగా, విద్యార్థులు ట్యూషన్ ఫీజు, ఆహారం, వసతిలో వంద శాతం వరకు ఉపకార వేతనాలను (స్కాలర్ షిప్) పొందవచ్చని పేర్కొన్నారు. విశ్వవిద్యాలయం నిర్వహించే జాతీయ-స్థాయి ప్రవేశ పరీక్ష (గాట్-2026) జూన్ 28న దేశ వ్యాప్తంగా ఆన్ లైన్ విధానంలో జరగనుందని, దానికి దరఖాస్తు చేసుకోవడానికి చివరి తేదీ జూన్ 26న అని వెల్లడించారు. గీతం, హైదరాబాద్ ప్రాంగణం తన స్కూల్ ఆఫ్ టెక్నాలజీ, సైన్స్, బిజినెస్, హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్, ఆర్కిటెక్చర్, ఫార్మసీ, పబ్లిక్ పాలసీ, కొత్తగా స్థాపించిన స్కూల్ ఆఫ్ ఎడ్యుకేషన్ ద్వారా వివిధ కోర్సులను అందిస్తోందన్నారు. కృత్రిమ మేధస్సు (ఏఐ), డేటా సైన్స్, సైబర్ సెక్యూరిటీ, బయోటెక్నాలజీ, ఎంటర్ ప్రెన్యూర్ షిప్, ఫార్మసీ, ఆర్కిటెక్చర్, సైకాలజీ, ఎకనామిక్స్, మీడియా స్టడీస్, టీచర్ ఎడ్యుకేషన్ వంటి పలు అభివృద్ధి చెందుతున్న రంగాలకు అనుగుణంగా కోర్సులను రూపొందించినట్టు తెలియజేశారు. గీతం హైదరాబాద్, 350కి పైగా ప్రముఖ నియామక సంస్థలతో బలమైన సంబంధాలను కొనసాగిస్తూ, విభిన్న రంగాలలో ఉద్యోగ అవకాశాలను అందిస్తోందన్నారు. గీతం హైదరాబాదు పరివర్తనాత్మక విద్య వ్యక్తులను అర్థవంతమైన వృత్తిని నిర్మించుకోవడానికి, సమాజానికి దోహదపడటానికి శక్తినిస్తుందని తాము విశ్వసిస్తున్నట్టు గీతం హైదరాబాదు అదనపు ఉప కులపతి ప్రొఫెసర్ డి.ఎస్.రావు తెలిపారు. స్కూల్ ఆఫ్ ఎడ్యుకేషన్ ను ప్రారంభించడం, రోబోటిక్స్, ఏఐ, వ్యవస్థాపకత, జీవశాస్త్రాలు, ఇతర అభివృద్ధి చెందుతున్న రంగాలలో కొత్త కోర్సులను ప్రవేశపెట్టడం వంటివి, వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రపంచానికి విద్యార్థులను సిద్ధం చేయాలనే గీతం నిబద్ధతను ప్రతిబింబిస్తోందన్నారు. లిబరల్ ఎడ్యుకేషన్ ఫ్రేమ్ వర్క్, బహుళ-విషయాల అభ్యాస వాతావరణం ద్వారా, విద్యార్థులు వారి ఆసక్తులను అన్వేషించడానికి, విమర్శనాత్మక నైపుణ్యాలను పెంపొందించు కోవడానికి, భవిష్యత్తుకు సిద్ధంగా ఉన్న నిపుణులుగా, ఆవిష్కర్తలుగా, నాయకులుగా ఎదగడానికి తాము అవకాశాలను కల్పిస్తున్నట్టు ఒకింత గర్వంగా వెల్లడించారు. ఇతర వివరాల కోసం ఞఞఞ.స్త్రఱ్ణుఎ.వసబను సందర్శించాలని సూచించారు.

# పెండింగ్ సమస్యలపై జర్నలిస్టుల పోరుబాట: రేపు 'చలో హైదరాబాద్'

**- అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు, బకాయిల విడుదలకై (TWJF) శంఖారావం**

హైదరాబాద్: జూన్ 17 భారత శక్తి, జర్నలిస్టుల సంక్షేమాన్ని, వారి దీర్ఘకాలిక డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపిస్తూ తెలంగాణ శ్రామిక జర్నలిస్టుల సమాఖ్య (౨ఔజీఖ్) జూన్ 18న భారీ 'చలో హైదరాబాద్' నిరసన కార్యక్రమానికి పిలుపునిచ్చింది. మీడియా రంగాన్ని వేధిస్తున్న కీలక సమస్యల పరిష్కారం కోసం తెలంగాణ వ్యాప్తంగా ఉన్న జర్నలిస్టులందరూ ఉదయం 10 గంటలకు గన్‌పార్కు అమరవీరుల స్తూపం వద్దకు చేరుకుని, అక్కడ నుండి ప్రదర్శన నిర్వహిస్తారని సమాఖ్య వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య తెలిపాడు. గడచిన రెండున్నరేళ్లుగా ప్రభుత్వం జర్నలిస్టుల సమస్యలను, ముఖ్యంగా చిన్న, మధ్యతరహా పత్రికల ఇబ్బందులను పరిష్కరించడంలో పూర్తిగా విఫలమైందని సోమయ్య ఆరోపించాడు. పెండింగ్‌లో ఉన్న ప్రకటనల బిల్లులు, ప్రభుత్వ ప్రకటనల మద్దతు తగ్గడం, ఇళ్ల స్థలాల కేటాయింపులో ఆలస్యం, ఆరోగ్య బీమా మరియు గుర్తింపు కార్డుల (అక్రిడిటేషన్) సౌకర్యాలు లేకపోవడం వంటి అంశాలను ప్రధానంగా ప్రస్తావించాడు.

**-సమాఖ్య ప్రధాన డిమాండ్లు:**

- బకాయిల విడుదల: మీడియా సంస్థలకు పెండింగ్‌లో ఉన్న ప్రకటనల బకాయిలను వెంటనే విడుదల చేయాలి.
- చిన్న పత్రికలకు మద్దతు: చిన్న పత్రికలకు క్రమం తప్పకుండా ప్రభుత్వ ప్రకటనలు ఇవ్వాలి.
- ముద్రణా సౌకర్యాలు: ముద్రణా యంత్రాల (ప్రింటింగ్ ప్రెస్) ఏర్పాటుకు భూమి, ఆర్థిక సహాయం అందించాలి.
- డిజిటల్ మీడియాకు గుర్తింపు: కేబుల్ మరియు ఇంటర్నెట్ ప్రొటోకాల్ టెలివిజన్ (ఖూఎం) వార్తా ఛానళ్లకు సైతం ప్రభుత్వ గుర్తింపు పరిధిని విస్తరించాలి.
- నివాస వసతి: అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు కేటాయించాలి.

**- సామాజిక భద్రత: సీనియర్ జర్నలిస్టులకు విశ్రాంతి వేతనం (పెన్షన్) సౌకర్యం కల్పించాలి.**



**-మహిళా జర్నలిస్టుల సంక్షేమం:** మహిళా జర్నలిస్టుల భద్రత, ప్రయోజనాల కోసం ప్రత్యేక సంక్షేమ చర్యలు చేపట్టాలి.

ప్రభుత్వ వైఖరి వివక్షతో కూడుకున్నదని, ఉదాసీనంగా వ్యవహరిస్తోందని దుయ్యబట్టిన సోమయ్య, రాష్ట్రవ్యాప్తంగా ఉన్న జర్నలిస్టులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఈ 'చలో హైదరాబాద్' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చాడు.

Printed,Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Printed and Published from Sri Muktheswara Publications, Plot No.31, Road No.5, Mallikarjunanagar Colony, Sagar Ring Road Bairamalguda,Hyderabad - 500079, Telangana. Tel: 040-24044446, Fax: 040-24054446, Cell: 9550336688,94405 08078 Email: bharathasakti@gmail.com, RNI No. APTEL/2006/17880, Editor: Kesaram Penta Reddy,Executive Editor: M.Venugopal Reddy